




ప్రక్షాళన ఏదీ.!

అసలు వైద్యశాఖలో ఏమి జరుగుతోంది!

పెత్తనం కోసమే ఒకరిపై ఒకరు ఫిర్యాదులు?

పాత నియామకాల్లో అవకతవకలపై విచారణ నివేదికలపై మౌనం

తాజాగా మరో 18 పోస్టుల భర్తీపై అవినీతి ఆరోపణలు

నోట్‌ఫైల్ లేకుండానే నింపారా!

ప్రతిష్ఠాత్మకమైన శాఖ అది. కానీ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యశాఖలో జరుగుతున్న తంతు చూస్తుంటే సామాన్య ప్రజానీకం కూడా అసహ్యించుకునే విధంగా ఉంది. ఒకరు చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు మరొకరి తప్పును వెలుగులోకి తీసుకురావడం, వాటిపై ఫిర్యాదులు చేయడమే పనిగా పెట్టుకున్నట్లున్నారు. తమకు పైస్థాయిలో ఉండే పరపతితో విచారణలకు నియమించడం... విచారణ చేసిన తర్వాత తప్పులు వెలుగులోకి వచ్చాక... ఆ నివేదికలను పక్కనపెట్టడం సర్వసాధారణమై పోతుండటంతో వైద్యశాఖ అప్రతిష్ఠను మూటగట్టుకుంటోంది.

ఒంగోలు(కలెక్టరేట్), మే 16 : ఎంతో ఉన్నతమైన వైద్య ఆరోగ్యశాఖకే అవినీతి జబ్బు చేసింది. దానిని నయం చేసే సరైన ఉన్నతాధికారి లేకపోవడమే కారణమా? అన్న చర్చ ఇప్పుడు ఆ శాఖలో నడుస్తోంది. తాము ఉన్నతాధికారిగా ఉన్నప్పుడు అంతా నిజాయితీ నడుస్తుందని చెబుతుంటారు.. వారు ఇక్కడి నుంచి బదిలీపై బయటకు వెళ్లాక ఒక్కొక్కటి తప్పులు వెలుగులోకి వస్తుండటంతో ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. కొవిడ్-19ను ఆసరా చేసుకొని ఉద్యోగ నియామకాల నుంచి హాస్పిటల్స్ రెన్యువల్స్, అనుమతులు ఇచ్చే విషయంలో అనుసరించిన విధానాలపై అనేక ఫిర్యాదులున్నా పట్టించుకున్నా పరిస్థితి లేకుండా పోయింది. కరోనా సమయంలో అత్యవసరంగా భర్తీ చేసిన ఉద్యోగాల విషయంలో కనీసం నోట్‌ఫైల్ కూడా లేకుండా అంతా చేశారంటే అది ఒక్క వైద్యశాఖకు చెల్లుతుంది. ఉన్నతాధికారులు, శాఖలో పనిచేసే కీలక ఉద్యోగులు కుమ్మక్కై పోస్టులను అమ్ముకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అత్యవసర సేవల కోసం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇస్తే దానిని ఆదాయ వనరుగా మార్చుకున్న పరిస్థితి.

కాంట్రాక్టు పేరుతో మోసం



కాంట్రాక్టు ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా ఆరు నెలల్లో రెగ్యులర్ కూడా చేయిస్తామని హామీలు ఇచ్చి ఏజెన్సీల ద్వారా నియమించారు. ఉద్యోగాలు పొందిన వ్యక్తులు తాము ఏజెన్సీల ద్వారా ఉద్యోగాలు చేస్తున్నామనే విషయాన్ని మర్చిపోయి తమకు జీతాలు రాకపోయినా పదినెలల పాటు ఉచితంగా పనిచేశారు. అంటే శాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు వారిని ఎంతలా మభ్యపెట్టారో అర్థమవుతోంది. 2020లో భర్తీ చేసిన ఉద్యోగ నియామకాల్లో కూడా అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆ నియామకాలపై ముగ్గురు అధికారులతో కూడిన బృందాన్ని నియమించారు. విచారణాధికారులుగా వారు అంతా పరిశీలించి, ఉద్యోగులను విచారించి భారీగా అక్రమాలు జరిగాయని నిర్ధారించి కలెక్టర్‌కు నివేదిక అందజేసినా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఉద్యోగ నియామకాల వ్యవహారాన్ని పక్కనబెడితే అత్యవసరం అనే పేరుతో ఇష్టారీతిన డిప్యుటేషన్లను వేశారు. అందులోనూ పెద్దఎత్తున అవినీతి, ఆరోపణలు వచ్చినా, ఆ సమయంలో భర్తీచేసిన పోస్టుల్లో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది.

డిప్యుటేషన్లు రద్దు.. అయినా ఇక్కడే..

జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా వచ్చేవారు తమకు అనుకూలమైన ఉద్యోగులను కార్యాలయానికి డిప్యుటేషన్‌పై తెచ్చుకోవడం పరిపాటిగా మారింది. ఆ తర్వాత వారి ద్వారా ఇష్టారీతిన అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇలా పలువురు ఉన్నతాధికారులపై ఆరోపణలు వచ్చాయి. అయినా అవేమి పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. గత నెలలో ఉద్యోగ విరమణ చేసిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల డిప్యుటేషన్లను రద్దుచేశారు. కానీ ఆ కార్యాలయంలో ఇంకా ఇద్దరు, ముగ్గురు పనిచేస్తున్నారంటే అందుకు అండదండలు అందిస్తున్నది ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. వాస్తవంగా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉద్యోగులు తక్కువగా ఉన్నారు. అయితే కార్యాలయంలో పనులు సకాలంలో పూర్తి చేసుకునేందుకు సంబంధిత డీఎంహెచ్‌వో ఆ శాఖలో ఇతర ప్రాంతాల్లో పనిచేసే వారిని తెచ్చుకోవడం సాధారణమే. కానీ తాము ఉన్నప్పుడు ఒప్పు.. ఇప్పుడు తప్పు అన్నట్లుగా ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వైద్యశాఖ కార్యాలయానికి పట్టిన అవినీతి జబ్బును నయం చేసేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైసీపీకి తొత్తుగా దర్శి పోలీసులు

అధికార పార్టీ నేతల దాడులతో గాయపడిన టీడీపీ వర్గీయులపైనే అక్రమ కేసులు

వీడియోల్లో తొలుత వైసీపీ వారే దాడులకు దిగినట్లు ఆధారాలున్నా చర్యలు శూన్యం



దర్శి, మే 16 : దర్శి నియోజకవర్గంలో పోలీసులు వైసీపీకి కొమ్ముకాస్తున్నారు. బాధితులైన టీడీపీ వర్గీయులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. పోలింగ్ సందర్భంగా పలుచోట్ల వైసీపీ వర్గీయులు టీడీపీ శ్రేణులపై దాడులు చేసి గాయపరిచినప్పటికి పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దర్శి మండలంలోని బొట్లపాలెంలో ఎన్నికలకు ముందురోజు తెలుగుయువత నేత కల్లూరు సుబ్బుపై వైసీపీ నేతలు దాడి చేశారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు గమ్మునున్నారు. మరుసటిరోజు పోలింగ్ సందర్భంగా తొలిరోజు దాడి చేసి వ్యక్తులే మళ్లీ టీడీపీ వర్గీయులపై దాడులకు తెగబడ్డారు. ఆ దాడిలో ఇరువురికి తలలు పగలటంతో పాటు పలువురికి గాయాలయ్యాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. ఆ ఘాతుకాలపై సహించలేక టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి స్థానికులతో కలిసి నిందితులపై చర్యలు తీసుకోవాలని శాంతియుతంగా ధర్నా చేశారు. అప్పటి వరకు దాడులు చేసిన వైసీపీ గూండాల గురించి పట్టించుకోకుండా ధర్నా చేశారన్న నెపంతో అభ్యర్థి లక్ష్మితోపాటు మరికొందరిపై కేసులు నమోదు చేశారు. ఇదేమి అన్యాయమని అడిగినా స్పందించలేదు. మరుసటిరోజు పోలీసులు ఇరువర్గాలపై మొక్కుబడిగా కేసులు నమోదు చేశారు. బాధితులపై అన్యాయంగా కేసు నమోదు చేయడాన్ని టీడీపీ వర్గీయులు అడిగినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో టీడీపీ నేత వీసీరెడ్డిపై వైసీపీ నాచకులు దాడి చేసినా వారిపై కేసు నమోదు చేయలేదు. ఈవీఎంలు పగలగొట్టాడన్న నెపంతో అతనిపై కేసు నమోదు చేశారు. ఈవీఎం కింద పడగా వాస్తవానికి పగిలిపోలేదు. పోలింగ్ యథాతథంగా నిర్వహించారు. అయినప్పటికీ పోలీసులు తమ ఇష్టానుసారం కేసు పెట్టారు. దర్శి మండలంలోని కురిచేడు రోడ్డులో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలోని పోలింగ్ బూత్ వద్ద వైసీపీ వర్గీయులు గొడవకు దిగారు. టీడీపీ అభ్యర్థి లక్ష్మి పోలింగ్ బూత్‌లోకి వెళ్లే సమయంలో వైసీపీ వారు అడ్డుకుని ఆమెపై రాళ్లతో దాడికి యత్నించారు. అడ్డుకున్న టీడీపీ వర్గీయులపై కేసు పెట్టారు. తొలుత రాళ్ల దాడికి పాల్పడ్డ వైసీపీ వర్గీయులపై ఇప్పటికీ కేసు నమోదు చేయలేదు. దేవవరంలో ఓట్లువేసి బయట నిల్చున్న టీడీపీ వర్గానికి చెందిన మహిళను ఉద్దేశపూర్వకంగా దూషించారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఆ ఘటనలో కూడా టీడీపీ వర్గీయులపై కేసు నమోదు చేశారు. మహిళలపై గొడవకు దిగిన వారిని గురించి పట్టించుకోలేదు. వరుసగా వైసీపీ వర్గీయులు దాడులు చేసిన విషయం వీడియోల్లో వైరల్ అవుతున్నాయి. సాక్ష్యాధారాలతో టీడీపీ వర్గీయులు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవటంలేదు.

బాధితుల ఫిర్యాదులను పరిశీలించి న్యాయబద్ధంగా చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారు. టీడీపీ వర్గీయులు ఇదేమి అన్యాయమని ఒక అధికారిని అడుగగా మాఇష్ట ప్రకారం ముందుకు పోతాంఅని సమా

ఇక్కడ కాకపోతే మరోచోటికి..

ధానమిచ్చినట్లు తెలిసింది. ప్రభుత్వం మారితే ఇక్కడ కాకపోతే మరోచోటకు వెళతాం. మీరు అంత కంటే ఇంకేమి చేయలేరు కదా అని ఆ పోలీస్ అధికారి సమాధానమిచ్చినట్లు టీడీపీ నాయకులు చెబుతున్నారు. వైసీపీ నాయకుల సూచనల మేరకు అక్రమ కేసులు నమోదు చేయించడంపై పలువురు టీడీపీ నేతలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం

నియోజకవర్గంలో పోలింగ్‌లో జరిగిన అక్రమాలపై, టీడీపీ వర్గీయులపై దాడుల గురించి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు టీడీపీ శ్రేణులు సన్నద్ధం అవుతున్నాయి. పలుబూత్‌ల్లో టీడీపీ ఏజెంట్‌లను బయటకు నెట్టేసిన ఘటనలపై ఆధారాలు, వైసీపీ వర్గీయులు టీడీపీ శ్రేణులపై చేసిన దాడుల వివరాలను కూడా సేకరించారు. అన్ని విషయాలను ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు టీడీపీ వర్గాలు సమాయత్తమవుతున్నట్లు సమాచారం.



భద్రతపై ఎస్పీ, ఇతర అధికారులతో చర్చిస్తున్న దినేష్‌కుమార్

భద్రత పటిష్టం

స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 16: ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. స్ట్రాంగ్‌రూం భద్రతా ఏర్పాట్లను గురువారం ఎస్పీ గరుడ్ సుమిత్‌సునీల్, జేసీ గోపాలకృష్ణలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒంగోలు పార్లమెంట్‌తోపాటు ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలన్నారు. లెక్కింపు కేంద్రాలకు ఈవీఎం యూనిట్స్ తరలించే మార్గాలు, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లేందుకు అనువుగా బారికేడ్ల ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని ఆదేశించారు. పవర్ బ్యాకప్ సౌకర్యంతో సీసీ టీవీలతోపాటు లైటింగ్, అవసరమైన మేరకు జనరేటర్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కమాండ్ కంట్రోలు రూములో సీసీటీవీ ద్వారా స్ట్రాంగ్‌రూంలను 24బై7 మూడు షిఫ్ట్‌లలో పరిశీలించేలా ప్రతి షిఫ్ట్‌కు గెజిటెడ్ అధికారులను నియమించామన్నారు. ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూం వద్ద మూడంచెల విధానంలో బందోబస్తును పటిష్టంగా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీలత, ఓడా వైస్‌చైర్మన్ విశ్వేశ్వరరావు, ఆర్వోలు సుబ్బారెడ్డి, లోకేశ్వరరావు, హౌసింగ్ పీడీ పేరయ్య, ఎస్ఈ దేవానందం పాల్గొన్నారు.

లోయలో మినీ ట్రక్ బోల్తా

నల్లమల ఘాట్ రోడ్డులో ప్రమాదం

15 మందికి తీవ్రగాయాలు



లోయలో బోల్తా పడిన వాహనం

పెద్దదోర్నాల, మే 16: వేగం అదుపుతప్పిన మినీ ట్రక్ లోయలో బోల్తా పడి పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం నల్లమల అటవీ ప్రాంతం శ్రీశైలం-దోర్నాల ఘాట్‌రోడ్డులో చిన్నారుట్ల మూలమలుపు వద్ద చోటుచేసుకొంది. కర్నూలు జిల్లా కోడుమూరు మండలం పేలేకుర్తి గ్రామానికి చెందిన 15 మందికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిసిన కథనం ప్రకారం.. కోడుమూరు మండలం నుంచి మినీ ట్రక్‌లో 25 మంది శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనార్థం వెళుతున్నారు. చిన్నారుట్ల మూలమలుపు వద్ద వేగం అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొట్టి లోయలోకి దూసుకుపోయింది. చెట్టుకు తాకడంతో బోల్తా పడింది. దీంతో వాహనంలో ప్రయాణిస్తున్న వారిలో 15 మందికి తీవ్రగాయాలయ్యాయి. అదృష్టవశాత్తు లోయలోకి పూర్తిగా పోకుండా చెట్టు నిలువరించింది. దీంతో ప్రాణనష్టం జరగలేదు. వెంటనే 108 అంబులెన్స్ వాహనానికి సమాచారమివ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను దగ్గరలోని సున్నిపెంట వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు.



టంగుటూరులో బేళ్లు కొనుగోలు చేస్తున్న బయ్యర్లు

రూ.303

- పొగాకుకు మరోమారు పెరిగిన గరిష్ఠ ధర
- నేడు బోర్డు ఈడీ రాక

ఒంగోలు మే 16 (ఆంధ్రజ్యోతి): వారంరోజులుగా కిలో రూ.300లపై నిలకడగా ఉన్న పొగాకు ధర గురువారం స్వల్పంగా పెరిగింది. ఒంగోలు-1,-2 కేంద్రాల్లో గరిష్ఠ ధర మరో రూ.3 పెరిగి కిలో రూ.303 లభించింది. పలు ప్రధాన కంపెనీలు కూడా బేళ్ల కోసం పోటీ పడుతూ ధరలు పెంచుతున్నారు. సాధారణంగా ఎక్స్‌పోర్టర్లు, డీలర్లు తేడా లేకుండా అన్ని కంపెనీల బయ్యర్లు ధరలు పెంచి కొంటున్నా కీలక కంపెనీ ఐటీసీ బయ్యర్లు మాత్రం ధరలు పెంచేందుకు ముందుకు రారు. డీలర్లు ఇచ్చే గరిష్ఠ ధరకన్నా కనీసం కిలోకు రూ.20 తగ్గించి వేసే అవకాశం ఉన్న బేళ్లనే కొంటుంటారు. ప్రస్తుతం మార్కెట్లో ఇంకా మేలురకం బేళ్ల రాక జోరు అందుకోలేదు. బేళ్ల కోసం పలు కంపెనీల బయ్యర్లు తీవ్రంగా పోటీపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఐటీసీ బయ్యర్లు కూడా ఇతరులతో పోటీపడి కొనక తప్పడం లేదు. డీలర్లు మరింత స్పీడ్ పెంచాల్సిరావడంతో గురువారం మార్కెట్‌లో గరిష్ఠ ధర కిలో రూ.303 లభించింది. బ్రౌన్ గరిష్ఠంగా కిలో రూ.270 వరకు పలుకుతున్నా అత్యధిక బేళ్లను ఒక్కో రోజు రూ.250కే కొంటున్నారు. లోగ్రేడ్‌ల పరిస్థితి కూడా అలాగే ఎగుడు,దిగుడుగా నడుస్తోంది. ఈ విషయాన్ని రైతు ప్రతినిధులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఈడీ, సెక్రటరీలు శుక్రవారం జిల్లాకు వస్తున్నారు.



జలమయమైన ఒంగోలు

పలుచోట్ల జల్లులు

- ఎండల నుంచి ఉపశమనం
- జిల్లా అంతటా చల్లబడిన వాతావరణం
- ఒంగోలులో భారీవర్షం
- ఇక్కట్లు పడ్డ జనం
- ఈసారి సీజన్‌పై రైతుల్లో ఆశలు

ఒంగోలు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు వేసవి తాపం... మరోవైపు సార్వత్రిక ఎన్నికల రాజకీయ వేడితో ఉన్న జిల్లాప్రజలకు ఉపశమనం లభించేలా గురువారం వర్షం కురిసింది. పలుప్రాంతాల్లో జల్లులు పడగా ఒంగోలులో ఏకంగా భారీవర్షమే కురిసింది. గత మూడు నాలుగు రోజులుగా ఎండల తీవ్రత తగ్గి వాతావరణంలో మార్పులు కనిపించాయి. వాతావరణం చల్లబడటంతోపాటు జిల్లాలోని ఏదో ఒక ప్రాంతంలో జల్లులు పడుతూనే ఉన్నాయి. ఈక్రమంలో గురువారం తెల్లవారుజాము నుంచే వాతావరణంలో మార్పు రాగా ఉదయం 9 గంటల ప్రాంతంలో వర్షం పడింది. ఒంగోలు నగరంలో భారీవర్షమే కురిసింది. సుమారు 50.50 మి.మీ. వర్షపాతం ఇక్కడ నమోదైంది. దాదాపు గంటసేపు తెరపి లేకుండా కురిసిన వర్షంతో నగరంలోని ప్రధాన వీధులన్నీ కాలువలు, చెరువులను తలపిస్తూ నీరు పారింది. రోడ్లపైకి మురుగు చేరడంతోపాటు ట్రాఫిక్‌కు ఆటంకం కలిగింది. వీధి వ్యాపారులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. ఇతర ప్రాంతాల్లో చూస్తే మద్దిపాడు మండలంలో 24.50 మి.మీ., కనిగిరిలో 16.50, పామూరులో 12.0 మి.మీ. నమోదు కాగా జరుగుమల్లి, కొండపి, చీమకుర్తి, ఎన్‌జీపాడు, వెలిగండ్ల, సీఎస్‌పురం, గిద్దలూరు ఇలా పలు మండలాల్లో జల్లులు పడ్డాయి. దీంతో వేసవి ఎండల తీవ్రత తగ్గి ప్రజలు తాత్కాలికంగా ఉపశమనం పొందారు. ఒంగోలులో వారం రోజులుగా 37 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా గురువారం భారీవర్షం నేపథ్యంలో ఎండలు తగ్గాయి. గరిష్ఠ ఉష్ణోగ్రత 33.7 డిగ్రీలు నమోదుకాగా జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ గత నాలుగు రోజులుగా నమోదవుతున్న దానికన్నా నాలుగైదు డిగ్రీలు తగ్గాయి. ఈ ఏడాది మంచి వర్షాలే కురుస్తాయని, ముందుగానే రుతుపవనాలు వస్తాయన్న సంకేతాలు వాతావరణ శాఖ నుంచి అందాయి. దానికి సంకేతంగా తాజా వర్షాలు ఉన్నట్లు ప్రజానీకం, ప్రత్యేకించి రైతాంగం భావిస్తున్నారు. మరోసారి ఒక మోస్తరు వర్షం కురిస్తే దుక్కులు దున్ని తొలకరి పైర్లు సాగుకు రైతులు సిద్ధమయ్యే అవకాశం ఉంది.



ఒంగోలు డిపోలో ప్రయాణికుల కష్టాలు

టీడీపీకి ఓటు వేశాడని కొడవలితో దాడి

వెలిగండ్ల, మే 16 : ఎన్నికల తర్వాత వైసీపీ నేతల ఆగడాలకు అంతులేకుండా పోతోంది. వైసీపీని వీడి టీడీపీలో చేరారనే అక్కసుతో ఓ యువకుడిపై కొడవలితో దాడికి తెగబడ్డారు. ఈ ఘటన మండలంలోని పందువ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. పందువ గ్రామానికి చెందిన జటికే తిమోతి వైసీపీని వీడి టీడీపీలో చేరాడు. పార్టీలో చురుగ్గా పనిచేస్తూ తమ కుటుంబీకులు, బంధువుల ఓట్లను టీడీపీకి వేయించాడు. దీంతో కోపం పెంచుకున్న వైసీపీకి చెందిన గురవయ్య కాపుకాచి తిమోతిపై కొడవలితో దాడిచేశాడు. ఇది గమనించిన తిమోతి పక్కకు ఒరగడంతో చెవి భాగానికి తగిలి తీవ్ర రక్తస్రావమైంది. బాధితుడ్ని కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చెవిభాగంలో నాలుగు కుట్లు పడ్డాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెలిగండ్ల పోలీసులు తెలిపారు.



దాడిలో గాయపడ్డ తిమోతి



లాయర్‌పేట సాయిబాబా గుడి రోడ్డు జలమయం



మస్తాన్‌దర్గా సెంటరులో నిలిచిన వర్షపునీరు



బాపూజీ మార్కెట్ వద్ద రోడ్డుపైకి చేరిన మురుగు



పిల్లలతో వర్షంలో తడుస్తూ వెళుతున్న వాహనదారుడు



ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో నిలిచిన వర్షపునీరు



చెరువులా మారిన కర్నూలురోడ్డు

ఉక్కపోతల నుంచి ఉపశమనం

- నగరంలో జోరువాన

ఒంగోలు(కార్పొరేషన్), మే 16: నెలన్నరపాటు మండుటెండలు..ఉక్కపోతలతో అల్లాడిన నగర ప్రజలకు ఉపశమనం లభించింది. గురువారం ఉదయం ఒంగోలులో గంటసేపు కురిసిన వానకు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో నగర ప్రజలకు కొంత ఇబ్బంది ఏర్పడినప్పటికీ చల్లటి వాతావరణంతో ఊరట చెందారు. అయితే నగర వీధులు జలమయంగా మారాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరుతోడై రోడ్లపై ప్రవహించి చెరువులను తలపించాయి. ఇదిలా ఉండగా చాలా రోజుల తర్వాత కురిసిన గాలివానకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఏకధాటిగా కురిసిన వానకు నగరం తడిసి ముద్దయింది.



కొప్పోలురోడ్డులో జోరుగా కురుస్తున్న వర్షం

పలు ప్రాంతాలు జలమయం

ఎడతెరిపి లేకుండా ముసురుతో కూడిన వర్షంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వెంకటేశ్వరకాలనీ, బలరాంకాలనీ, బిలాల్‌నగర్, కరుణా మిలటరీ కాలనీ, బాలినేని భరత్ కాలనీ, ఇందిరాకాలనీ, గుర్రజంజాషువా కాలనీ, మదర్‌థెరిస్సా కాలనీ, ప్రగతి కాలనీ, చినమల్లేశ్వర కాలనీలతోపాటు నగరంలోని కర్నూలు రోడ్డు, నెల్లూరు బస్టాండ్, ఆర్టీసీ ఆవరణం, స్టేషన్ రోడ్, పలు ప్రాంతాలలో రహదారులపై వర్షపు నీరు ఏరులై పారగా, మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఇక దారావారితోట, జర్నలిస్ట్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, రాజీవ్ గృహకల్ప, భాగ్యనగర్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో నీరు రోడ్లపై అలాగే నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



కొత్తపట్నం బస్టాండు వద్ద వర్షపునీటిలో ప్రజల రాకపోకలు



ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రయాణికుల పాట్లు

డెంగ్యూపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 16 : జిల్లాలో డెంగ్యూవ్యాధిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అన్ని గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను శుభ్రపర్చి ఫ్రైడే, డ్రైడేని సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. దర్శి పరిసర ప్రాంతాల్లో డెంగ్యూ కేసులు అధికంగా నమోదు అవుతున్నందన అందుకు కారణాలను విశ్లేషించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వెక్టార్ కంట్రోల్ యాప్ పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడం ద్వారానే డెంగ్యూను నివారించేందుకు సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం శాఖల వారీగా దిశా నిర్దేశం ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

'సింగరాయకొండ'పై బెట్టింగ్‌లు !

మండలంలో మెజారిటీపై టీడీపీ, వైసీపీ ధీమా

కూటమితోపాటు కొండపిలో స్వామి గెలుపుపై పందేలకు అధికారపార్టీ నేతలు వెనుకంజ

సింగరాయకొండ, మే 16 : రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం గెలుపోటములపై బెట్టింగ్‌లు ప్రారంభమయ్యాయి. సింగరాయకొండ మండలంలో టీడీపీకి ఆధిక్యత వస్తుందని ఆ పార్టీ నాయకులు, వైసీపీకి మెజారిటీ వస్తుందని వైసీపీ నేతలు ఎవరి ధీమాలో వారు ఉన్నారు. దీంతో 10 గ్రామాల్లో జరిగిన పోలింగ్ సరళిని అంచనా వేసుకొని ఇరుపార్టీ నేతలు పందెలు కాస్తున్నారు. మండలంలో పోస్టల్ బ్యాలెట్‌తో కలుపుకొని ఒక్క ఓటైనా తమ పార్టీకి మెజారిటీ వస్తోందని టీడీపీ, తమకే వస్తోందని వైసీపీ నేతలు గురువారం రూ.25 లక్షలు పందెం కాసుకున్నారు. పాతసింగరాయకొండ పంచాయతీలో వైసీపీకి ఒక్క ఓటైనా మెజారిటీ వస్తోందని పోలింగ్ ముందురోజు వైసీపీ నేతలు రూ.3 లక్షలు బెట్టింగ్ కాశారు. రాదని టీడీపీ నేతలు రూ.3 లక్షలు పందెం పెట్టారు. పోలింగ్ ముగిసిన తరువాత టీడీపీ నేతలు పాతసింగరాయకొండలో టీడీపీదే ఆధిక్యతని ఒకటికి మూడింతలు ఇస్తామని ముందుకు వచ్చారు. దీనిపై వైసీపీ నేతలు వెనక్కి తగ్గుతున్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తోందని, కొండపిలో తెలుగుదేశం అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి హ్యాట్రిక్ విజయం సాధిస్తారని ఆ పార్టీ నేతలు ఎంతైనా పందెలు కాయడానికి సిద్ధమయ్యారు. వైసీపీ నేతలు మాత్రం ఆరెండింటిపై మేము బెట్టింగ్‌లు పెట్టలేమని చేతులెత్తేశారు.

కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలన



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

టంగుటూరు, మే 16 : వల్లూరు సమీపంలోఉన్న రైజ్ కృష్ణసాయి ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సమిత్ సునీల్ గురువారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈకౌంటింగ్ కేంద్రంలో ఒంగోలు పార్లమెంట్‌తోపాటు కొండపి, ఒంగోలు, సంతనూతలపాడు, దర్శి , కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్లను లెక్కించనున్నారు.

ప్రసన్న స్వరూపుడు మల్లవరం శ్రీవేంకటేశ్వరుడు

- శతాబ్దాల చరిత్ర కలిగిన దేవస్థానం
- రేపటి నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు
- 25న కల్యాణోత్సవం, తిరునాళ్ల

మద్దిపాడు, మే 16: మద్దిపాడు మండలం మల్లవరంలోని గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద వెలిసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరుడు భక్తులకు కొంగుబంగారంగా వెలుగొందుతున్నాడు. స్థలపురాణం ప్రకారం.. ఒకసారి భూలోకంలో విహరిస్తున్న శ్రీనివాసుడు విశ్రాంతి కోసం తమ్మవరం కొండ దగ్గరికి వెళ్తే తనను భరించే శక్తి లేదని, క్షమించమని వేడుకుందట. ఆ సంభాషణ విన్న మల్లవరం గిరి తనపై సేదదీరమని సప్తగిరీశుని ఆహ్వానించగా ఆ భక్తికి మెచ్చిన శ్రీనివాసుడు ఒక వరం కోరుకోమన్నాడట. నీ తేజంతో కూడిన అంశం ఇక్కడే శాశ్వతంగా నెలకొని ఉండే వరం ఇవ్వాలని వేడుకోగా స్వామివారు అనుగ్రహించాడు. అనంతరం లోకసంచారకుడైన నారదుడు స్వామిని దర్శించుకున్నాడు. సామాన్య భక్తులకు కూడా ఆపదమొక్కులవాడి దివ్య స్వరూపం కనిపించాలన్న సంకల్పంతో కొండమీద వేంకటేశ్వరుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇక్కడి గుండికా నది నేటి గుండ్లకమ్మ గురించి స్కంధపురాణంలో ప్రస్తావించబడింది. కవిత్రయంలో ఒకరైన ఎర్రాప్రగడ తన ఉత్తర హరివంశపీఠికలో క్షేత్ర వైభవాన్ని వర్ణించారు. శ్రీకృష్ణదేవరాయలు మల్లవరం శ్రీనివాసుని దర్శించుకుని దేవాలయ నిర్మాణం చేసినట్లు పెద్దలు చెబుతారు. అద్దంకి సీమను పాలించిన రెడ్డిరాజులు స్వామికి మాన్యాలు ఇచ్చారు. ఓ శాసనం ప్రకారం కోమటిరెడ్డి వేమారెడ్డి క్రీ.శ.1277లో స్వామి కైంకర్యం కోసం మల్లవరం గ్రామాన్ని దానం చేశారు. వేమారెడ్డి భార్య అన్నమాంబకు కుమరయ్య, వేమయ్య, దొడ్డయ్య, అన్నమయ్య, మల్లయ్య అనే ఐదుగురు సంతానం కాగా వారిలో సైన్యాధిపతి అయిన మల్లారెడ్డి పేరిట మల్లవరం, దొడ్డారెడ్డి పేరిట దొడ్డవరం, వేమారెడ్డి పేరిట వెల్లంపల్లి గ్రామాలు ఏర్పడట్లు పెద్దలు చెబుతారు. ఒకప్పుడు చాలా చిన్నదిగా ఉన్న ఆలయం దినదినాభివృద్ధి చెంది రాజగోపురం, చక్కని కళ్యాణ మండపం, గరుత్మంతుని, హనుమంతని భారీ విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టుపక్కల పచ్చని పచ్చికతోపాటు గుండ్లకమ్మ రిజర్వాయర్ కనువిందు చేస్తుంది. సాహితీసేవలో ఎంతోమంది కవులు మల్లవరం వెంకన్నకు అక్షరార్చన చేశారు. కాగా ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా విశేష వాహన సేవలు, కళ్యాణం, తెప్పోత్సవం, రథోత్సవం, చక్రస్నానాలు మొదలైన క్రతువులు జరుగుతాయి. చివరిరోజు 25న స్వామివారి కల్యాణం, తిరునాళ్ల జరుగుతుంది. ఈ బ్రహ్మోత్సవాలలో సుమారు 10 వేలకు పైగా భక్తులు పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దామా నాగేశ్వరరావు, కమిటీ ప్రతినిధి నారా నాగిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.



ఆకర్షణీయంగా ఆలయ రాజగోపురం

వైసీపీ నాయకులపై మంత్రి సురేష్ అసహనం

ఎన్నికల్లో ఖర్చుపెట్టిన డబ్బు లెక్కలు చెప్పిన టంగుటూరు మండల నేతలు

ఎవరెవరు ఎంత ఖర్చుచేశారో తెలుసన్న ఆదిమూలపు • అందరూ పార్టీ పదవులకు రాజీనామాలు చేయాలంటూ ఆగ్రహం

టంగుటూరు, మే 16 : రాష్ట్ర మంత్రి, కొండపి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ టంగుటూరు మండలంలోని పలువురు వైసీపీ నాయకులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల ముగిసిన తరువాత సింగరాయకొండ క్యాంపు ఆఫీస్‌లో ఉన్న మంత్రి సురేష్‌ను కలిసేందుకు వెళ్లారు. ఎన్నికలలో ఖర్చుపెట్టిన డబ్బు విషయం మాట్లాడడంతో మంత్రి కస్సుమన్నారు. ఆ మాటలతో కంగుతిన్న నాయకులు కిమ్మనకుండా వచ్చిన దారినే తిరిగి వెళ్లారు. అందిన సమాచారం మేరకు...

ఎన్నికల సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటుకు రూ.2వేలు లెక్కన వైసీపీ పంపిణీ చేసింది. ఈసారి పోలింగ్‌కు రెండు రోజులు ముందుగానే డబ్బుల పంచారు. ఆ సమయంలో కొందరు ఓటర్లు అందుబాటులో లేకపోవడంతో డబ్బులు ఇవ్వలేదు. వారు వచ్చాక మళ్లీ వస్తామంటూ వేసీపీ నేతలు చెప్పి వెళ్లారు. ఎన్నికల సమయానికి మళ్లీ వస్తానన్న వారు అడ్రస్ లేరు. దీంతో ఆయా గ్రామాల నాయకులందరూ అప్పుడే మంత్రిని కలిసి పరిస్థితిని వివరించారు. వెంటనే మంత్రి మీరు ఇవ్వండి, తరువాత సర్దుబాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆయా గ్రామాలలో నాయకులు వాటాలు వేసుకొని మిగిలిపోయిన ఓటర్లకు డబ్బులతోపాటు దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి చార్జీలూ ముట్టజెప్పారు.

డబ్బుల కోసం వెళ్లిన వారిపై అసహనం

తాము ఓటర్లకు చెల్లించిన డబ్బులు లెక్కలు చెప్పి తీసుకుపోదామని నాయకులు ఎన్నికలు ముగిసిన మరుసటి రోజున సింగరాయకొండ వెళ్లారు. మంత్రిని కలిసి ఖర్చుపెట్టిన నగదు వివరాలు చెప్పారు. నాయకులు చెప్పిన మాటలను కొద్ది సమయం విన్న మంత్రి ఒక్కసారిగా నాయకులపై ఫైర్ అయ్యారు. 'ఎవరు ఎంత డబ్బులు తీసుకుంది, ఎంత ఖర్చుపెట్టింది నాకు తెలుసు. అంతా గందరగోళం చేశారని' వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వెంటనే పార్టీ పదవులు ఉన్నవారంతా మీ పదవులకు రాజీనామా చేయండి, కరెక్టుగా ఉండే వారికి నేనే పదవులు ఇచ్చుకుంటాను, డబ్బులు ఇచ్చేది లేనేలేదని' తేల్చిచెప్పినట్లు సమాచారం. దీంతో నాయకులు బిక్కమొహం పెట్టి మెల్లగా అక్కడ నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. విషయం బయటకు రావడంతో ఓటమి గ్యారెంటీ అని మంత్రికి స్పష్టమైందని, ఈ విషయం తెలిశాకే ఆయన నాయకులపై ఇంత ఆగ్రహం వ్యక్తం చేశాడని పలువురు గుసగుసలాడుకుంటున్నారు.

ఓబన్నపాలెం ఓటర్లు సైకిల్ వైపే..

- గతంలో విడిపోయి ఒక్కటైన టీడీపీ వర్గీయులు

నాగులుప్పలపాడు, మే 16 : గత ఎన్నికల్లో ఆ గ్రామంలోని నాయకులు రెండు వర్గాలుగా ఏర్పడి రెండు పార్టీలకు మద్దతు పలికారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఆ రెండు పార్టీల నాయకులు ఒక్కటై సైకిల్‌కు తమ మద్దతు ఇచ్చారు. మండల పరిధిలోని ఓబన్నపాలెం గ్రామంలో 588 మంది ఓటర్లు ఉన్నారు అందులో పురుష ఓటర్లు-277, మహిళా ఓటర్లు-311 ఉన్నారు. 2019 ఎన్నికలకు ముందు గ్రామం మొత్తం తెలుగుదేశం పార్టీకి మద్దతుగా ఉన్నారు. తదనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు రెండు వర్గాలుగా విడిపోయారు. వైసీపీ, టీడీపీలకు తమ మదతు పలికారు. అయితే రానురాను వైసీపీకి మద్దతు పలికిన నాయకులకు ఆ పార్టీలో సరైన గౌరవం, గుర్తింపు దక్కకపోవడంతో 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆ పార్టీని వీడి అందరూ ఐక్యతారాగంతో తెలుగుదేశం పార్టీలో చేరారు. దాంతో ఆ గ్రామంతో వైసీపీ పూర్తిగా పట్టు కోల్పోయింది. ఎన్నికల సమయంలో ఆ గ్రామం నుంచి 450 ఓట్లు పోలవగా, 211 పురుషులు, 239 మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా 450 ఓట్లలో 50 లోపే వైసీపీ, కాంగ్రెస్ పార్టీల వైపు మొగ్గు చూపగా మిగిలిన 400 మంది ఓటర్లు తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇచ్చినట్లు గ్రామంలోని రాజకీయ వర్గాల్లో చర్చ సాగింది. దీంతో ఓబన్నపాలెం గ్రామం నుంచే కూటమి పార్టీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్‌కు దాదాపు 400 ఓట్ల మెజారిటీ రానుంది. కాగా నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో ఉన్న వైసీపీ అభ్యర్థి మెరుగు నాగార్జున, టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ ఓబన్నపాలెం గ్రామంలోని రామాలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహించి ఎన్నికల నామినేషన్‌కు తరలి వెళ్ళడం విశేషం.



ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

అవీ..ఇవీ..

నేటి నుంచి సబ్జెక్టు టీచర్లకు శిక్షణ : డీఈవో

ఒంగోలు(విద్య), మే 16: జిల్లాలో సీబీఎస్ఈ పాఠశాలలుగా ఎంపిక చేసిన 63 ప్రభుత్వ స్కూళ్లలో 9,10 తరగతుల విద్యార్థులకు బోధిస్తున్న 546 మంది సబ్జెక్టు టీచర్లకు శుక్రవారం నుంచి ఈనెల 21 వరకు శిక్షణ ఇస్తున్నట్లు డీఈవో సుభద్ర గురువారం తెలిపారు. ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూలులో నాన్ రెసిడెన్షిల్ విధానంలో శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 8నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణకు ఇంగ్లీషు సబ్జెక్టు టీచర్లు 97 మంది, సోషల్ స్టడీస్ టీచర్లు 89 మంది, బయాలాజికల్ సైన్స్ 116, గణితంలో 128, ఫిజిక్స్‌లో 58, కెమిస్ట్రీలో58 మంది టీచర్లకు శిక్షణ ఇస్తారు. ఇంగ్లీషు, సోషల్, బయాలాజికల్‌సైన్స్ టీచర్లకు ఈనెల 17,18 తేదీల్లో, అలాగే గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ టీచర్లకు ఈనెల 20,21 తేదీల్లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పరిశీలకులుగా గ్రంథాలయ సంస్థ రాష్ట్ర డైరెక్టర్, ఎంఆర్ ప్రసన్నకుమార్ వ్యవహరిస్తారన్నారు. శిక్షణకు ఎంపికైన టీచర్లను సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు రిలీవ్ చేసి పంపించాలని డీఈవో కోరారు.

లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి : డీఎంహెచ్‌వో

ఒంగోలు(కలెక్టరేట్), మే 16: జిల్లాలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను లక్ష్యానికి అనుగుణంగా సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్ ఆదేశించారు. ఒంగోలులోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న అన్ని కేడర్లకు సంబంధించిన వైద్యఅధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌సీహెచ్, చైల్డ్ హెల్త్, ఇమ్యునైజేషన్‌పై తగిన చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త గర్భిణుల పేర్లు సకాలంలో రిజిస్టర్ చేసి వారి వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రసవం, ప్రసవానంతరం వరకు అందించాల్సిన సేవలను విధిగా వివరాలను వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప వైద్యాధికారి డాక్టర్ మాధవీలత, డీపీఎంవో వాణిశ్రీ, డీపీహెచ్ఎన్‌వో సుగుణమ్మ, డీపీవో సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు చైతన్యం అభినందనీయం

ఒంగోలు(కలెక్టరేట్), మే 16: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల చైతన్యం వల్ల భారీగా ఓటింగ్ శాతం పెరగడం పట్ల వలంటీర్ ఎన్విరాన్‌మెంటల్ ఆర్గనైజేషన్ చైర్మన్ జి.వీరభద్రాచారి గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో ఎన్నికల అధికారులు ఓటు వినియోగంపై ఓటర్లకు కలిగించిన అనేక అవగాహన కార్యక్రమాలతో పాటు అనేక స్వచ్ఛంద సంస్థల ప్రచార కార్యక్రమాలు కూడా పోలింగ్ శాతం పెరిగేందుకు దోహదపడ్డాయని ఆయన తెలిపారు.

20న మండల సర్వసభ్య సమావేశం

మద్దిపాడు, మే 16: మద్దిపాడు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 20వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంకర్ గురువారం తెలిపారు. ఎంపీపీ వాకా అరుణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులందరూ సమగ్ర నివేదికతో హాజరుకావాలని ఆయన కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

మద్దిపాడు, మే 16: మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ మహేష్ హెచ్చరించారు. గురువారం మద్దిపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఆదేశాల మేరకు ఎన్నికల ముందు బైండోవర్ కేసులో ఉన్న వారందరినీ మండల మేజిస్ట్రేట్ దగ్గర హాజరుపరచి జరిమానాలు విధిస్తామని చెప్పారు. మండలంలో 763 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఉత్సాహంగా శిక్షణ తరగతులు

ఒంగోలు(కల్చరల్), మే 16: ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గురువారం విద్యార్థుకు పుస్తకపఠనం, కథలు చదివించటం, చెప్పించటం వంటివి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపగ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి మాట్లాడుతూ పిల్లలలో పుస్తకపఠనం పట్ల ఆసక్తి పెంచటం ప్రధాన లక్ష్యంగా వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వారిలో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలపై అవగాహన కల్పించటం కూడా ముఖ్య ఉద్దేశ్యమన్నారు. శిక్షణ తరగతులు జూన్ 7వ తేదీ వరకు జరుగుతాయని, కనుక విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆమె కోరారు.

నాగులుప్పలపాడులో చిరుజల్లులు

నాగులుప్పలపాడు, మే 16: గత రెండు రోజుల నుంచి కురుస్తున్న చిరుజల్లులతో నాగులుప్పలపాడు మండల ప్రజలకు ఉపశమనం లభించింది. ఈ ఏడాది వేసవి కాలం ప్రారంభం నుంచి భానుడి ప్రతాపంతో ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజలు ఉక్కపోతలతో ఉక్కిరిబిక్కిరయ్యారు. అయితే రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు సంభవించి ఆకాశం మేఘావృతమై చల్లటి ఆహ్లాదకర వాతావరణంతో చిరుజల్లులు కురిశాయి. దీనికి తోడు ఈ ఏడాది ముందుగానే రుతుపవనాలు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందని అధికారులు చల్లటి కబురును చేరవేయడంతో ప్రజలు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

డెంగ్యూను తరిమికొట్టాలి

మద్దిపాడు, మే 16: ప్రజలను చైతన్యపరిచి డెంగ్యూను తరిమికొట్టాలని డాక్టర్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా మద్దిపాడులో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దోమల ద్వారా డెంగ్యూ వస్తుందన్నారు. డాక్టర్ జగదీష్ బాబు, డాక్టర్ వినీల చౌదరి మాట్లాడుతూ చల్లని ప్రదేశంలో పెరిగే ఈ దోమ కాటు వేస్తే డెంగ్యూ జ్వరం వస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సతీష్, లలితమ్మ, పద్మావతి, బాలకోటయ్య, సీతాదేవి, ఎ.నాగరాజు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రావణ్‌కుమార్

నేడు శానంపూడిలో ఆరాధనోత్సవాలు

సింగరాయకొండ, మే 16 : మండలంలోని శానంపూడి గ్రామంలో శుక్రవారం మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద సంతర్పణ, రాత్రికి గ్రామోత్సవ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ పూజారి చిలకపాటి సుధాకర్ తెలిపారు.

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.301

టంగుటూరు, మే 16 : టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో గురువారం జరిగిన వేలం ద్వారా గరిష్ట ధర రూ.301 రైతులకు దక్కింది. పొందూరు రైతులు 1047 పొగాకు చెక్కులను వేలం కేంద్రానికి తీసుకొచ్చారు. ఇందులో 1,008 బేళ్లు కొనుగోలు కాగా, మిగిలిన బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. వీటిలో ఎన్‌టీ-10 బేళ్లు. ఆర్ఆర్-1, సీఆర్-21 బేళ్లు జరిగింది. జరిగిన వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.301కాగా, కనిష్ఠ ధర రూ.205 పడింది. సరాసరి ధర రూ.264.59 ఉంది. కొనుగోళ్లలో 18 కంపెనీల బయ్యర్లు పాల్గొన్నారు.

వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి రూ.10.34 లక్షల ఆదాయం

- వేలంలో అత్యధికంగా రంగులరాట్నం పాట రూ.9 లక్షలు

సింగరాయకొండ, మే 16 : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 16 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రంగులరాట్నం నిర్వహణ, కొబ్బరికాయలు, లడ్డూ, ప్రసాదాలు అమ్ముకోవడం,కొబ్బరిచిప్పలు పోగుచేసుకునేందుకు, కూల్‌డ్రింక్స్, బొమ్మలు అమ్ముకునేందుకు గురువారం దేవస్థానంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. వేలంలో రంగులరట్నం పాట హోరాహోరీగా సాగింది. చివరకు నెల్లూరుకు చెందిన పరింకాయల రాజేష్ రూ.9 లక్షలకు రంగుల రట్నం నడుపుకునే హక్కును కైవసం చేసుకున్నాడు. కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే హక్కును పాతసింగరాయకొండకు చెందిన కొట్టే జాలయ్య రూ.83 వేలకు దక్కించుకున్నారు. లడ్డూ, కలకండ, ప్రసాదాలు అమ్ముకునే హక్కును వరికూటి ఆంజనేయులు రూ.51 వేలకు సొంతం చేసుకున్నారు. దీంతో దేవస్థానానికి బహిరంగ వేలంపాట ద్వారా రూ.10.34 లక్షలు ఆదాయం సమకూరింది. కొబ్బరికాయలు, కూల్‌డ్రింక్స్ అమ్ముకోవడానికి పాటదారులు ఎవరూ ముందుకు రానందున వాటిని మరోమారు వేలంపాట నిర్వహిస్తామని దేవాదాయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు దేవదాయ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈవో కృష్ణవేణి, ఆలయ చైర్మన్ పామర్తి మాధవరావు పాల్గొన్నారు.



వేలంపాటను నిర్వహిస్తున్న అధికారులు

అప్రమత్తమైన పోలీస్ !

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు

ఘటనలకు పోలీసు అధికారులదే బాధ్యత • ఎస్పీ హెచ్చరిక

గస్తీ ముమ్మరం చేస్తూ ఆదేశాలు

ఒంగోలు(క్రైం), మే 16 : ఎన్నికల అనంతరం అవాంఛనీయ ఘటనలపై పోలీసు ఉన్నతాధికారులు ఎట్టకేలకు కదిలారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఆయా నియోజకవర్గాల పరిధిలో పోలీసు అధికారులతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ఎస్పీ గరుడ సుమిత్ సునీల్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌పై నిఘా ఉంచాలని చెప్పారు. రాత్రుళ్లు గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఎన్నికల సందర్భంగా ఘర్షణలు చోటుచేసుకున్న ప్రాంతాలలో పోలీసు పికెట్లు ఏర్పాటుచేసి భద్రత చర్యలు కట్టుదిట్టం చేయాలని కోరారు. జిల్లావ్యాప్తంగా 22వేల మందికిపైగా బైండోవర్ చేసిన వారికి తిరిగి హెచ్చరికలు జారీచేయాలన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరిగినా సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు ఆయా నియోజకవర్గంలోని పోలీసు అధికారులు బైడోవర్ చేసిన వారు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ప్రకటనలు జారీచేశారు. అదే క్రమంలో ఆయా గ్రామాలో నాయకులకు కూడా హెచ్చరిస్తున్నారు.

బస్సు దగ్ధం ఘటనపై విష ప్రచారం

సీఎం పత్రికలో తప్పుడు కథనం • ఖండించిన మాజీ జడ్పీటీసీ

పర్చూరు, మే 16 : ప్రమాదం జరిగి కుటుబాలు శోకసంద్రంలో ఉంటే సానుభూతి తెలపాల్సిన పరిస్థితుల్లో సంఘటనపై విషప్రచారం చేయడం పత్రికల విలువను దిగజార్చడమేనని జడ్పీటీసీ మాజీ సభ్యుడు, సీనియర్ నాయకుడు కొల్లా సుభాష్ బాబు అన్నారు. పల్నాడు జిల్లా, చిలకలూరిపేట మండలం పసుమర్రు సమీపంలోని ఈపూరువారిపాలెం వద్ద బస్సు దగ్ధమైన సంఘటనపై సీఎం పత్రికలో వచ్చిన దుష్ప్రచార వార్తపై ఆయన స్పందించారు. బాధ్యతతో సొంత ఊరిలో ఓటువేసుకొని తిరుగు ప్రయాణం చేస్తూ దురదృష్టవశాత్తు బస్సు దగ్ధమైన సంఘటనలో సజీవదహనం కావడం బాధాకరమన్నారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబాలకు సానుభూతి ప్రకటించి ఓదార్చాల్సిన పరిస్థిల్లో ఇలా తప్పుడు రాతలు రాయడం దారుణమన్నారు. నోవా అగ్రిటెక్ ప్రొటెక్ట్స్‌కు సంబంధించి ఏమైన ప్రమాదకరమైన రసాయనాలు తరలించారా అని అనుమానాలను రేకెత్తించే విధంగా అసత్య వార్తలు రాయడాన్ని ఖండించారు. వ్యవసాయ సీజన్ ముగిసి మూడు నెలలైందని, ఈ సమయంలో వీటిని తీసుకువెళ్లడం ఏమిటనేది వారికే తెలియాలన్నారు. బస్సు డ్రైవ ర్ నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు గాలిలో కలసి పోయాయన్నారు. మృతుల కు టుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఒంగోలు సర్వీసులు సక్రమంగా నడపాలి

ఇంకొల్లు, మే 16 : ఇంకొల్లు నుంచి ఒంగోలు నడిపే బస్సు సర్వీసులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా సక్రమంగా నడపాలని ఒంగోలు డిపో మేనేజరు ధర్మవరపు శ్రీనివాసులుకు విన్నవించారు. గురువారం జరిగిన డైల్‌యువర్ డీఎం కార్యక్రమంలో ఇంకొల్లు ప్రాంత ప్రయాణికులు డీఎంతో ఫోన్‌లో సమస్యలను విన్నవించారు. ఒంగోలు వయా రాచపూడి మీదగా హైదరాబాద్, తిరుపతి సర్వీసులు నడపాలని, సాయంత్రం 6 గంటల తరువాత ఒంగోలు సర్వీసులు సమయపాలన సక్రమంగా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని డీఎం హామీ ఇచ్చారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

• పరామర్శించిన ఎమ్మెల్యే ఏలూరి



సురేష్ మృతదేహం వద్ద విషణ్ణవదనంతో ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, మే 16 : మండలంలోని రాజుగారి పాలెంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త, మార్టూరులోని హీరో షోరూం యజమాని శ్రీనివాసరాజుకు సోదరుడైన కళ్లేపల్లి సురేష్ రాజు (40) గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాత్రి సమయంలో ఇంటిలో అస్వస్థ తకు గురైన సురేష్‌ను కుటుంబ సభ్యులు కారులో మార్టూరులోని ప్రభుత్వ ఆస్పత్రి కి తరలించారు. అక్కడ అతనిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు కుటుంబసభ్యులకు తెలిపారు. దాంతో మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకువచ్చారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రాజుగారిపాలెం వెళ్లి సురేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. రెండు రోజుల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో రాజుగారిపాలెంలో తెలుగుదేశం పార్టీ గెలుపునకు పార్టీ కార్యకర్తగా సురేష్ విశేషంగా కృషి చేశారు. చిన్న వయస్సులో సురేష్ మృతి చెందడం వారి కుటుంబానికి, పార్టీకి తీరని లోటు అన్నారు. సురేష్ రాజుగారిపాలెంలోని టీడీపీ నేత మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతి రాజుకు దగ్గర బంధువు కావడం, అంతేగాకుండా మార్టూరులో హీరో షోరూంలో పని చేస్తూ పలువురు పరిచయాలు ఉండడంతో మండలంలోని టీడీపీ శ్రేణులు షేక్ రజాక్, కామినేని జనార్దన్, తొండెపు ఆదినారాయణలతో పాటు మార్టూరు లోని పలువురు వ్యక్తులు సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి సంతాపం తెలియచేశారు.

మా డబ్బులు తిరిగివ్వండి..!

• ఓటర్లపై వైసీపీ నేత ఒత్తిడి

మార్కాపురం, మే 16: ఓటుకు నోట్లు ఇస్తే ఓటర్లు తాము చెప్పిందే చేస్తారని భావించారు వైసీపీ నేతలు. తమ అధిష్ఠానం ఆదేశాల మేరకు పోటీలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఇచ్చిన డబ్బును వారి వారి పరిధిలోని ఓటర్లకు పంపిణీ చేశారు. మేము ముందు అనిపించుకోవడానికి ఒకటి, రెండు రోజుల ముందే ఓటర్లకు చేర్చారు. డబ్బులు తీసుకోకుండా వ్యతిరేకిస్తే లేనిపోని కక్షసాధింపులు ఎదుర్కొవలసి వస్తుందని ప్రస్తుతం ఓటర్లు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎవరు డబ్బులిచ్చానా తీసుకొని, తమ మనస్సాక్షి ప్రకారం ఓటు వేస్తున్నారు. అయితే వైసీపీ నేతలకు ఓటర్లపై విశ్వాసం లేకుండా పోయింది. దీంతో డబ్బులు తీసుకోని తమ అభ్యర్థులకు ఓట్లేయలేదని కొంతమంది ఓటర్లను అనుమానిస్తున్నారు. వారిపై బుధవారం రాత్రి నుంచి ఒత్తిడి తీసుకొస్తున్నారు. 'మీరు మాకు ఓటు వేయలేదు. మేము మీకిచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వండి' అంటూ హుకుం జారీ చేస్తున్నారు. నోట్ల రివకరీ కోసం మార్కాపురం అసెంబ్లీ స్థానానికి పోటీ చేసిన అభ్యర్థికి అనుయాయుడిగా ఉన్న ఓ కౌన్సిలర్ రంగంలోకి దిగాడు. అయితే ఈ విషయం వైసీపీ అభ్యర్థి దృష్టికి వెళ్లలేదని కొందరూ.., వెళ్లినా ఆయన పట్టించుకోవడం లేదని కొందరు ఆ పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు.

తిరుపతి రైలుకు అదనపు బోగీలు

గిద్దలూరు, మే 16: వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకుని గుంటూరు నుంచి గిద్దలూరు మీదుగా తిరుపతి వెళ్ళే ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనపు బోగీలను ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు-గిద్దలూరు-తిరుపతి (17261) రైలుకు మే 16 నుంచి 31వ తేదీ వరకు, తిరుపతి-గిద్దలూరు-గుంటూరు (17262) రైలుకు మే 17 నుంచి జూన్ 1వ తేది వరకు 2 స్లీపర్ క్లాస్, 3 జనరల్ బోగీలను అదనంగా జతచేయడం జరుగుతుందని, ప్రయాణికులు వినియోగించుకోవాలని రైల్వే కమర్షియల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

స్నేహితుడిని కలిసేందుకు హైదరాబాద్ నుంచి ఒంగోలుకు..

చక్రాయపాలెం సమీపంలో కారు బోల్తా

దశాబ్దకాలం క్రితం వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో తల్లిదండ్రుల మృతి



భానుశరత్‌శర్మ(ఫైల్)



నుజ్జునుజ్జు అయిన కారు

అద్దంకి, మే 16 : పుట్టిన రోజుకు తన స్నేహితుడు రాలేదని, ఒంగోలులో ఉన్న స్నేహితుడు వద్దకు వస్తూ రోడ్డు ప్రమాదంలో యువకుడు మహదావం భానుశరత్‌శర్మ (28) దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలిలో నివాసముండే భానుశరత్‌శర్మ ఈవెంట్స్ టీమ్‌ను నిర్వహిస్తుంటాడు. భానుభరత్ శర్మ పుట్టిన రోజు వేడుకలు బుధవారం హైదరాబాద్‌లో జరగగా ఒంగోలులో ఉన్న నరేష్ హాజరుకాలేదు. దీంతో నరేష్‌ను కలిసేందుకు కారులో ఒంగోలు వస్తుండగా బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత తెల్లవారుజామున 3-30 గంటల సమయంలో అద్దంకి మండలం చక్రాయపాలెం సమీపంలో మలుపు వద్ద అదుపు తప్పి పల్టీలు కొట్టుకుంటూ కారు పొలంలోకి బోల్తా పడింది. తీవ్రగాయాలైన భానుశరత్‌శర్మను 108లో ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. నిద్రమత్తులో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. కారులో ఒక్కడే ప్రయాణిస్తున్నాడు. భానుశరత్‌శర్మ తల్లిదండ్రులు కూడా దశాబ్దకాలం క్రితం వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో మృతి చెందారు. కుటుంబం మొత్తం మృతి చెందడం బంధువులను తీవ్రంగా కలిచివేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతర్

వైసీపీ నేతల అండతో తెగబడుతున్న ఆక్రమణదారులు • రూ. కోటి విలువైన స్థలం కబ్జాకు తిరిగి యత్నం



మున్సిపల్ స్థలమంటూ గత ఏడాది వేసిన బోర్డు (ఫైల్)



ప్రస్తుతం ఆ స్థలంలో చేపట్టిన నిర్మాణం

కనిగిరి, మే 16: కనిగిరిలో వైసీపీ నేతల అండతో ఆక్రమణల పరంపర కొనసాగుతున్నా అధికారుల్లో మాత్రం చలనం లేకుండా పోయింది. మున్సిపాల్టీ స్థలాలు, ప్రభుత్వ, వంక, వాగు పోరంబోకు భూములు ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు సాగిస్తున్నా పట్టించుకునే అధికారి లేకుండా పోయాడు. గత ఏడాది అక్టోబర్‌లో స్థానిక వెంకటేశ్వర థియేటర్ రోడ్డులో ఓ సామాజిక భవనం పేరుతో అక్రమంగా మున్సిపాల్టీ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టేందుకు ఆయా స్థలాన్ని చదును చేసి, అనంతరం గుంతలు తీసి పిల్లర్లు వేసేవరకూ తెగించారు. ఈక్రమంలో చాలా మార్లు గతంలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన నారాయణరావు ఆయా నిర్మాణాలు నిలుపుదల చేసి నోటీసులు జారీ చేశారు. ఈ విషయం ప్రస్తుత కలెక్టర్ దృష్టికి వెళ్లినా ఆయన కూడా నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఈ నోటీసులో ఆయా స్థలంలో అక్రమ నిర్మాణాలు సాగించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలతో కూడిన నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో ఆయా నిర్మాణాలను ఆక్రమణదారులు నిలిపివేశారు. తిరిగి మళ్ళీ అదే స్థలంలో నాలుగు రోజులుగా స్థలానికి చుట్టూ ఎత్తయిన ఇనుప రేకులను అడ్డుగా పెట్టి నిర్మాణాలు సాగిస్తున్నారు. ఉన్నతాధికారులు పనులు నిలిపివేయాలని నోటీసులు జారీ చేసినా ఆయా అధికారి పట్టించుకోకుండా ఆక్రమణదారులకు వత్తాసుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ తతంగంలో ప్రస్తుత టీపీవోగా పనిచేస్తున్న అధికారికి భారీ స్థాయిలో ముడుపులు ముట్టాయని ఆరోపణలు వ్యక్తమౌతున్నాయి. అందుకే ఆక్రమణదారులు వైసీపీ నేతల అండతో తిరిగి ఆ స్థలంలో నిర్మాణం చేపట్టేందుకు తెగబడ్డారని విమర్శలు వ్యక్తమౌతున్నాయి. ఎన్నికల బదిలీల్లో భాగంగా కనిగిరి మున్సిపల్ కమిషనర్‌గా వచ్చిన అధికారి తాను ఉండే నాలుగు రోజులకు ఇవన్నీ తనకెందుకు అన్నట్లుగా వ్యవహరించటం వెనుకు అంతర్యం ఏమిటో అర్థం కావటం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అక్రమ కట్టడాలను నిలిపివేసి విలువైన మున్సిపల్ స్థలాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నేతలకు గాయాలు

• టైరు పేలి స్తంభాన్ని ఢీకొన్న కారు

మార్కాపురం రూరల్, మే 16: కారు ప్రమాదంలో కొనకనమిట్ల మండలానికి చెందిన ఇద్దరు టీడీపీ నేతలకు గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొనకనమిట్ల మండల టీడీపీ అధ్యక్షుడు మోరబోయిన బాబూరావు, పొదిలి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చప్పిడి రామలింగయ్యలు పొదిలి పట్టణం నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డిని కలిసేందుకు గురువారం ఉదయం వస్తున్నారు. మండలంలోని రాయవరం సమీపంలోని మెడికల్ కళాశాల వద్ద ఒక్క సారిగా వీరు ప్రయా ణిస్తున్న కారు టైర్ పేలింది. దీంతో కారు నడుపుతున్న బాబురావు, ప్రయాణిస్తున్న రామలింగయ్యలకు గాయాలయ్యాయి. వీరిని మార్కాపురం పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలలో తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిని కందుల నారాయణరెడ్డి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.



పరామర్శిస్తున్న నారాయణరెడ్డి

లారీని ఢీకొన్న కారు

ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో గాయాలతో బయటపడిన ముగ్గురు





నుజ్జునుజ్జు అయిన కారు, క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

అద్దంకి, మే 16 : కారులో ఎయిర్ బెలూన్‌లు తెరుచుకోవడంతో తీవ్ర ప్రమాదం నుంచి ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నెల్లూరుకు చెందిన పి.మంజుల, నితీష్ హైదరాబాద్ నుంచి కారులో నెల్లూరు వెళ్తుండగా అద్దంకి మండలం చినకొత్తపల్లి క్రాస్ రోడ్డు వద్ద నామ్ రోడ్డుపై గురువారం సాయంత్రం ప్రమాదం జరిగింది. కారు ముందు వెళ్తున్న లారీని అధిగమించబోయి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మంజుల, నితీష్‌తో పాటు కారు డ్రైవర్ సాయి ప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. 108 సిబ్బంది ప్రమాద స్థలం లోనే ప్రాథమిక చికిత్స నిర్వహించారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండడంతో కారు మొత్తం నుజ్జునుజ్జయింది. కారు పూర్తిగా దెబ్బతిన్నా ఎయిర్ బెలూన్‌లు ఓపెన్ కావడంతో కారులో ఉన్న ముగ్గురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు.

తాళ్లూరు మండలంలో 92.2 శాతం పోలింగ్

• అధికంగా ఓటుహక్కు వినియోగించుకున్న మహిళలు

తాళ్లూరు, మే 15 : సార్వత్రిక ఎన్నికల్లో మండలంలో 37,722 మంది ఓటర్లకు గాను 34,782 మందిఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 ఎన్నికల్లో 92శాతం పోలింగ్ నమోదుకాగా ఈ ఎన్నికల్లో 92.2శాతం పోలింగ్ నమోదయింది.ఈ ఎన్నికల్లో పురుషులు 17,514 మంది, మహిళలు 17,268 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. మండలంలో పురుషుల కంటే మహిళలు అత్యధికంగా తాళ్లూరులో 2,274 మంది, తూర్పు గంగవరంలో 2,223 మంది, తురకపాలెంలో 938 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో అత్యధికంగా లక్కవరం, విఠలాపురం గ్రామాల్లో 95 శాతం పోలింగ్ నమోదు కాగా, తురకపాలెంలో అత్యల్పంగా 86శాతం నమోదయింది. గత ఎన్నికల్లో నూరుశాతం వైసీపీ వైపు నిలిచిన కాపులు ఈసారి 70శాతం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వైపు మొగ్గు చూపారు. వైసీపీ శ్రేణులు ఓటమి భయంతో ఓటర్లకు అధికంగా తాయిలాలు ఇచ్చి తమ వైపు కొందరినే ఆ కట్టుకోగలిగారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటర్లు మాత్రం వైసీపీ తాయిలాలు తీసుకున్నా వీవీఎంలలో మాత్రం తాము అనుకున్న వారికే ఓట్లు వేసినట్లు తెలుస్తోంది. ఈ పర్యాయం ఇతరప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ప్రత్యేక వాహనాల్లో తరలి వచ్చి పోలింగ్‌లో పాల్గొన్నారు. వారంతా కూటమి వైపు నిలిచారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిరుద్యోగ యువత ప్రభుత్వ వ్యతిరేకత కనపరిచినట్లు విశ్లేషకులు అంటున్నారు. మహిళలు కూడా అధిక సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొన్నారు. టీడీపీ కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యత నిచ్చినందున మహిళలు కూటమి వైపు నిలిచారని కొందరు అంటున్నారు.



కోటేశ్వరావుతో ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న రవికుమార్

గొట్టిపాటి పరామర్శ

అద్దంకి, మే 16 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కోటేశ్వరరావును ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ గురువారం పరామర్శించారు. అద్దంకి పట్టణంలోని 20వ వార్డుకు చెందిన నంబూరి కోటేశ్వరరావు ఈ నెల 14వ తేదీన రామాంజనేయపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నర్సరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే గొట్టిపాటి గురువారం పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట టీడీపీ నేతలు కరి పరమేష్, కోనేటి అనిల్, గుంజి గోవిందు, ఏసోబు ఉన్నారు.

ఆ రోడ్డులో వెళ్లాలంటే నరకమే..

• కంకరరాళ్లలో అదుపుతప్పి పడుతున్న వాహనదారులు



కంకరరాళ్లతో అడ్డదిడ్డంగా ఉన్న కాశీపురం-తుమ్మకుంట

కనిగిరి, మే 16: కనిగిరిపట్టణ సమీపంలోని కాశీపురం-తుమ్మకుంట రోడ్డు మరీ నరకప్రాయంగా తయారైంది. గతంలో ఉన్న మట్టిరోడ్డే కొంత మెరుగ్గా ఉందని గ్రామస్థులు చెప్తున్నారు. 2019 ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా అప్పటి వైసీపీ ఇన్‌చార్జి బుర్ర మధుసూదన్‌యాదవ్ కాశీపురం-తుమ్మకుంట వెళ్లేందుకు తారురోడ్డు నిర్మాణం చేయిస్తామని హామీ ఇచ్చారు. 2019 ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఆ రోడ్డును నిర్మించేందుకు అలక్ష్యం వహించారు. తిరిగి 2024 ఎన్నికల్లో భాగంగా గడపగడపకు కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలకు ప్రచారానికి వెళ్ళారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రోడ్డు విషయంలో ఎమ్మెల్యేను నిలదీశారు. ఎన్నికల్లో తనకే మళ్ళీ వైసీపీ ఎమ్మెల్యేగా అధిష్ఠానం టికెట్ ఇస్తుందన్న భ్రమలో ఆయా గ్రామాలకు వెళ్ళే రోడ్డులో కంకర రాళ్లతో రోడ్డు పోశారు. ఆ తర్వాత దానిని చదును చేయాల్సి ఉంది. ఎన్నికల నాలుగునెలల ముందు ఆయా గ్రామాలకు చెందిన ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎమ్మెల్యే బుర్రా చేసిన ప్రయత్నం ఫలించకపోగా ఆయనకే స్థానచలనం జరిగింది. ఇంతలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మరో వైసీపీ నేతకు అధిష్ఠానం కనిగిరి ఎమ్మెల్యే టికెట్ కేటాయించింది. ఇంతలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో గ్రామస్థులకు అవస్థలు మొదలైనాయి. కంకరు రాళ్ళతో కూడిన రోడ్డు కావటంతో వాహనదారులు కిందపడి గాయాలు పాలవుతున్నారు. ఇలాంటి ఘటనలు ఈ నాలుగు నెలల్లో చాలానే జరిగాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖాధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డును చదును చేయాలని వేడుకుంటున్నారు.

ఆన్‌లైన్ రుణం..తీర్చలేని భారం..!

యాప్ ఉచ్చులో పడి సర్వం పోగొట్టుకున్న బాధితులు

మరెవ్వరూ బలికావద్దని వేడుకోలు

నష్టపోతారని పోలీసుల హెచ్చరిక

చీరాల, మే 16 : రుణ యాప్‌ల జోలికి వెళ్లొద్దు. ఆ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకోవద్దు. తీసుకుంటే దారుణంగా నష్టపోతారని బాధితులు, పోలీసులు చెప్తున్నారు. గతంలో ఆ యాప్‌ల ద్వారా రుణాలు పొందినవారు తమ అనుభవాలను చెప్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరెవ్వరూ ఆ యాప్ వలలో చిక్కుకోవద్దని సూచిస్తున్నారు.

రుణ యాప్‌ల నిర్వాహకులు ముందస్తుగా డబ్బు అవసరం ఉన్న పేద, మధ్యతరగతి వారిని, ఉద్యోగాల కోసం వెదుక్కుంటున్నవారిని, రుణం కోసం ప్రయత్నిస్తున్నవారిని గుర్తిస్తారు. వారి సెల్‌ఫోన్లు ఆ యాప్‌ల నిర్వాహకులు తమ యాప్‌ల ద్వారా రుణాలు పొందేందుకు సులువైన మార్గమని నమ్మంచే విధంగా పోస్టులు పెడతారు. అవసరంలో ఉన్నవారు రుణం పొందాలనే తొందర్లో వారు చెప్పే అన్ని రకాల నిబంధనలకూ ఒప్పుకుంటారు. ఆ క్రమంలో తమ ఫోన్ కాంటాక్ట్ నెంబరు, ఫొటోలు తదితరాలు వారు ట్రాక్ చేసుకునే విధంగా అంగీకారం కోరతారు. రుణం తీసుకునే ఆత్రుతలో ఇవన్నీ సాధారణమని ఓకే చేస్తారు. వారు ఇచ్చే రుణం, తిరిగి చెల్లించాల్సిన వ్యవధి తక్కువ గా ఉంటుంది. వడ్డీ అధికంగా ఉంటుంది. ఉదాహరణకు రూ.10వేలు రుణం ఇస్తుంటే ముందుగానే రూ.2వేలు తగ్గించుకుని రూ.8వేలు మాత్రమే ఇస్తారు. రుణం చెల్లించాల్సిన కాలపరిమిధిలో చెల్లించకుంటే ఇక వారి టార్చర్ మొదలవుతుంది. ఫోన్‌లోని నెంబర్ల ద్వారా తెలిసినవారు దగ్గర వారి పరువుతీసే విధంగా మాట్లాడతారు. వేరెక్కడైనా రుణం తీసుకుందామన్నా, అది తెలుసుకుని అక్కడ కూడా చెడుగా చెప్తుంటారు. ఈ క్రమంలో తమ యాప్ ద్వారానే మరో లోన్ ఇంకాస్త పెద్దమొత్తంలో ఇచ్చేందుకు అవకాశం ఉందని చెప్తూ, ఆ వైపు ఆకర్షితులయ్యే విధంగా ప్రేరేపిస్తారు. ఆ లోన్ తీసుకుని ముందు తీసుకున్న లోన్ క్లియర్ చేసిన తరువాత మరలా కాలపరిమితి దాటగానే టార్చర్ మొదలవుతుంది. దీంతో కొందరు ఆ టార్చర్‌ను భరించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఎవరు కూడా రుణయాప్‌ల ద్వారా రుణాలు పొందవద్దని బాధితులు చెప్తున్నారు. పోలీస్‌శాఖ పరంగా కూడా హెచ్చరిస్తున్నారు.

20న ఎడ్ల బండలాగుడు పోటీలు

సీఎస్‌పురం(పామూరు) మే 16: సీఎస్‌పురం మండలం రామాపురం గ్రామంలో శ్రీ పట్టాభిరామస్వామి తిరునాళ్ల సందర్భంగా ఈ నెల 20తేదీ సోమవారం ప్రకాశం, నెల్లూరు, కడప, గుంటూరు, కృష్ణా జిల్లాల స్థాయిలో ఎడ్లబండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎడ్ల పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన ఎడ్ల యజమానులు తమ పేర్లను 19 వ తేదీ లోపు రూ.500 ఎంట్రీ ఫీజుతో చెల్లించి నమోదుచేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు వరుసగా ప్రథమబహుమతి రూ. 50 వేలు, ద్వితీయ రూ.40వేలు, తృతీయ రూ. 30వేలు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు సెల్ 9666673735, 8499036565, 9611118712 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

వాహనం అదుపు తప్పి ఒకరికి తీవ్రగాయాలు

చీరాలటౌన్, మే 16 : ద్విచక్ర వాహనం అదుపుతప్పి సెక్యూరిటీ గార్డుకు తీవ్రగాయాలైన సంఘటన గురువారం గొనసపూడి-ఇంకొల్లు రోడ్డులో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం గొనసపూడికి చెందిన సంతోషరావు ఇంకొల్లులోని ఓ ప్రైవేటు విద్యా సంస్థలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలోనే ఎప్పటిలాగే ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన సంతోషరావు మార్గం మధ్యలో వాహనం అదుపుతప్పి పడ్డాడు. దీంతో తలకు, శరీరంపై తీవ్ర రక్త గాయాలు కావడంతో 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఎక్స్‌కవేటర్‌ను ఢీకొని ఒకరికి..

వెలిగండ్ల: ఎక్స్‌కవేటర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సీఎస్ పురం మండలం వెంగనగుంట గ్రామానికి చెందిన చెన్నకేశవులు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కనిగిరి నుంచి తన స్వగ్రామమైన వెంగనగుంటకు వెళ్తుండగా పద్మాపురం క్రాస్ రోడ్డు వద్ద ఎక్స్‌కవేటర్ రోడ్డు పక్కన ఆగివుంది. అతి వేగంతో వచ్చి బైక్ ఢీకొట్టడంతో తలకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సహాయంతో కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇంటర్మీడియట్ ప్రవేశానికి కౌన్సెలింగ్

కంభం, మే 16 : డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులకు మెరిట్ ప్రకారం మిగులు సీట్ల భర్తీకి శింగరాయకొండ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 21న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కంభం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చాముండేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ లిస్టు విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావడానికి వారి మొబైల్‌కు సమాచారం పంపించినట్లు తెలిపారు. సమాచారం కోసం 7815805491 సంప్రదించాలని కోరారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

• ట్రైనీ ఐఎఫ్ఎస్ శివశంకర్ హంగళ్

పెద్దదోర్నాల, మే 16: సకల జీవకోటికి ప్రకృతి వరప్రసాదంగా ఇచ్చిన పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ట్రైనీ ఐఎఫ్ఎస్ శివ శంకర్ హంగళ్ పేర్కొన్నారు. దోర్నాల ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద శివశంకర్ హంగళ్ గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నల్లమల అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వంటి వ్యర్థాలను వేయడం వల్ల వన్యప్రాణులు తిని ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నాయన్నారు. స్వచ్ఛమైన అటవీ ప్రాంతంలో యాత్రికులు ప్లాస్టిక్ వస్తువులను వేయకుండా ఉండేందుకు చైతన్యం కల్పిస్తున్నామని చెప్పారు. అంతేకాదు అడవికి, మూగజీవాల మనుగడకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రధానంగా అటవీ అధికారులు, సిబ్బంది మరింత శ్రద్ధ వహించాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో అటవీ ప్రాంతంలో రోడ్ల వెంట వ్యర్థాలను తొలగించేందుకు ప్రత్యేకంగా స్వచ్ఛ సేవకులను నియమించామన్నారు. అటవీ ప్రాంతంలో ప్రయాణించే యాత్రికులు అగ్ని ప్రమాదాలకు హేతువైన బీడీ, సిగరెట్టు వంటివి పడేయరాదని ఆయన కోరారు. అటవీ సంపదకు, పర్యావరణానికి రాజైన పెద్దపులులు, వాటి మనుగడకు అందరూ సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

డబ్బులు తిరిగివ్వండి..!

● ఓటర్లపై వైసీపీ నేత ఒత్తిడి

మార్కాపురం, మే 16: ఓటుకు నోట్లు ఇస్తే ఓటర్లు తాము చెప్పిందే చేస్తారని భావించారు వైసీపీ నేతలు. తమ అధిష్ఠానం ఆదేశాల మేరకు పోటీలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఇచ్చిన డబ్బును వారి వారి పరిధిలోని ఓటర్లకు పంపిణీ చేశారు. మేము ముందు అనిపించుకోవడానికి ఒకటి, రెండు రోజుల ముందే ఓటర్లకు చేర్చారు. డబ్బులు తీసుకోకుండా వ్యతిరేకిస్తే లేనిపోని కక్షసాధింపులు ఎదుర్కోవలసి వస్తుందని ప్రస్తుతం ఓటర్లు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎవరు డబ్బులిచ్చానా తీసుకొని, తమ మనస్సాక్షి ప్రకారం ఓటు వేస్తున్నారు. అయితే వైసీపీ నేతలకు ఓటర్లపై విశ్వాసం లేకుండా పోయింది. దీంతో డబ్బులు తీసుకోని తమ అభ్యర్థులకు ఓట్లేయలేదని కొంతమంది ఓటర్లను అనుమానిస్తున్నారు. వారిపై బుధవారం రాత్రి నుంచి ఒత్తిడి తీసుకొస్తున్నారు. 'మీరు మాకు ఓటు వేయలేదు. మేము మీకిచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వండి' అంటూ హుకుం జారీ చేస్తున్నారు. నోట్ల రికవరీ కోసం మార్కాపురం అసెంబ్లీ స్థానానికి పోటీ చేసిన అభ్యర్థికి అనుయాయుడిగా ఉన్న ఓ కౌన్సిలర్ రంగంలోకి దిగాడు. అయితే ఈ విషయం వైసీపీ అభ్యర్థి దృష్టికి వెళ్లలేదని కొందరూ.., వెళ్లినా ఆయన పట్టించుకోవడం లేదని కొందరు ఆపార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం

● పొంచి ఉన్న ప్రమాదం ● స్పందించని అధికారులు


ఒరిగిన విద్యుత్‌స్తంభం

మార్కాపురం, మే 16: నిత్యం వందలాది వాహనాలు వెళ్లె రహదారి. ఆ రోడ్డు నుంచి ప్రజా ప్రతినిధులు, ఉన్నతోద్యోగులు అటుగా వెళుతుంటారు, ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని చూస్తుంటారు. మార్కాపురం చెరువు కట్టపై ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభం కింద భాగం పూర్తిగా దెబ్బతింది. దీంతో స్తంభం పట్టు కోల్పోయి వైర్లపై వేళాడుతూ ఒరిగి ఉంది. ఎప్పుడు తెగి పడుతుందో అర్థకాని పరిస్థితి. ఇంతటి ప్రమాదకర పరిస్థితి అక్కడ ఉన్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడే కంటే ముందస్తుగా స్తంభానికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మితిమీరిన వేగంతో వెళితే చర్యలు

వాహనదారులకు ఎస్సై రాజేష్ కౌన్సెలింగ్

కంభం, మే 16 : రహదారి భద్రత నియమాలను సక్రమంగా పాటించకుండా వెళుతున్న వాహనదారులకు ఎస్సై పులి.రాజేష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. కంభం, కందులాపురంలో కొంత మంది యువకులు ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసివేసి చెవులు చిల్లులు పడేలా శబ్ధాలు చేస్తూ వెళుతున్నారు. వారిని అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ నిర్వహించారు. నిత్యం జనసంచారంతో ఉండే జాతీయ రహదారిపై మితిమీరిన వేగంతో వెళ్లడంతో మీతో పాటు ఎదుటివారి ప్రాణాలకు ప్రమాదమన్నారు. అలాగే వాహనాలకు ఉన్న సైలెన్సర్లు తీసివేసి వేగంగా నడుపుతూ శబ్ధకాలుష్యం చేయడం నేరమన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం తగదన్నారు. వారితో వాహనాలను స్టార్ట్ చేయకుండా పట్టణంలో నడిపించారు. సీసీ కెమెరాల్లో గమనించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పారిశుధ్య కార్మికుడి మృతి

పొదిలి,మే16: నగర పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న గాలిముట్టి నాగులు అనారోగ్యానికి గురై బుధవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి నాగులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. తక్షణ సాయంగా రూ.15వేలను అందించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు..

కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలన


కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

టంగుటూరు, మే 16 : వల్లూరు సమీపంలోఉన్న రైజ్ కృష్ణసాయి ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సమిత్ సునీల్ గురువారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈకౌంటింగ్ కేంద్రంలో ఒంగోలు పార్లమెంట్‌తోపాటు కొండపి, ఒంగోలు, సంతనూతలపాడు, దర్శి , కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్లను లెక్కించనున్నారు.

ప్రసన్న స్వరూపుడు మల్లవరం శ్రీవేంకటేశ్వరుడు

● శతాబ్దాల చరిత్ర కలిగిన దేవస్థానం
● 18 నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు
● 25న కల్యాణోత్సవం, తిరునాళ్ల


ఆకర్షణీయంగా ఆలయ రాజగోపురం

మద్దిపాడు, మే 16: మద్దిపాడు మండలం మ ల్లవరంలోని గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద వెలిసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరుడు భక్తులకు కొంగుబంగారంగా వెలుగొందుతున్నాడు. స్థలపురాణం ప్రకారం.. ఒకసారి భూలోకంలో విహరిస్తున్న శ్రీనివాసుడు విశ్రాంతి కోసం తమ్మవరం కొండ దగ్గరికి వెళ్తే తనను భరించే శక్తి లేదని, క్షమించమని వేడుకుందట. ఆ సంభాషణ విన్న మల్లవరం గిరి తనపై సేదదీరమని సప్తగిరీశుని ఆహ్వానించగా ఆ భక్తికి మెచ్చిన శ్రీనివాసుడు ఒక వరం కోరుకోమన్నాడట. నీ తేజంతో కూడిన అంశం ఇక్కడే శాశ్వతంగా నెలకొని ఉండే వరం ఇవ్వాలని వేడు కోగా స్వామివారు అనుగ్రహించాడు. అనంతరం లోకసంచారకుడైన నారదుడు స్వామిని దర్శించు కున్నాడు. సామాన్య భక్తులకు కూడా ఆపదమొ క్కులవాడి దివ్య స్వరూపం కనిపించాలన్న సం కల్పంతో కొండమీద వేంకటేశ్వరుని విగ్రహాన్ని ప్ర తిష్టించారు. ఇక్కడి గుండికా నది నేటి గుండ్లక మ్మ గురించి స్కంధపురాణంలో ప్రస్తావించబడిం ది. కవిత్రయంలో ఒకరైన ఎర్రాప్రగడ తన ఉత్తర హరివంశపీఠికలో క్షేత్ర వైభవాన్ని వర్ణించారు. శ్రీకృష్ణదేవరాయలు మల్లవరం శ్రీనివాసుని దర్శిం చుకుని దేవాలయ నిర్మాణం చేసినట్లు పెద్దలు చె బుతారు. అద్దంకి సీమను పాలించిన రెడ్డిరాజులు స్వామికి మాన్యాలు ఇచ్చారు. ఓ శాసనం ప్రకా రం కోమటిరెడ్డి వేమారెడ్డి క్రీ.శ.1277లో స్వామి కైంకర్యం కోసం మల్లవరం గ్రామాన్ని దానం చే శారు. వేమారెడ్డి భార్య అన్నమాంబకు కుమర య్య, వేమయ్య, దొడ్డయ్య, అన్నమయ్య, మల్ల య్య అనే ఐదుగురు సంతానం కాగా వారిలో సైన్యాధిపతి అయిన మల్లారెడ్డి పేరిట మల్లవరం, దొడ్డారెడ్డి పేరిట దొడ్డవరం, వేమారెడ్డి పేరిట వెల్లంపల్లి గ్రామాలు ఏర్పడట్లు పెద్దలు చెబుతా రు. ఒకప్పుడు చాలా చిన్నదిగా ఉన్న ఆలయం దినదినాభివృద్ధి చెంది రాజగోపురం, చక్కని కళ్యా ణ మండపం, గరుత్మంతుని, హనుమంతని భారీ విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టుప క్కల పచ్చని పచ్చికతోపాటు గుండ్లకమ్మ రిజర్వా యర్ కనువిందు చేస్తుంది. సాహితీసేవలో ఎంతోమంది కవులు మల్లవరం వెంకన్నకు అక్షరార్చ న చేశారు. కాగా ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరుగనున్నా యి. ఈ సందర్భంగా విశేష వాహన సేవలు, క ళ్యాణం, తెప్పోత్సవం, రథోత్సవం, చక్రస్నానాలు మొదలైన క్రతువులు జరుగుతాయి. చివరిరోజు 25న స్వామివారి కల్యాణం, తిరునాళ్ల జరుగుతు ంది. ఈ బ్రహ్మోత్సవాలలో సుమారు 10 వేలకు పైగా భక్తులు పాల్గొంటారని అంచనా వేస్తున్న ట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దామా నాగేశ్వ రరావు, కమిటీ ప్రతినిధి నారా నాగిరెడ్డి గురువా రం ఓ ప్రకటనలో తెలిపారు.

శివారు ప్రాంతాల్లో పెరిగిన పోలింగ్ శాతం

● పట్టణంలో పోలింగ్ శాతం 80.77
● పురుషులతో సమానంగా ఓటేసిన మహిళలు


మార్కాపురం పట్టణం

మార్కాపురం, మే 16: సార్వత్రిక ఎన్నికలలో గతంలో ఎన్నడూలేని విధంగా మార్కాపురం పట్టణంలో ఓటింగ్ శాతం పెరిగింది. గ్రామీణ ప్రాంతాలతో పోల్చుకుంటే తక్కువే అయినా ఇంతకుముందెన్నడూ ఎప్పుడు ఈ మాత్రం పోలింగ్ శాతం అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో నమోదుకాలేదు. మార్కాపురం పట్టణంలోని మొత్తం 58 పోలింగ్ కేంద్రాల్లో 56,021 ఓట్లు ఉండగా ఈ ఎన్నికల్లో 45,250 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 80.77 శాతం ఓట్లు పోలయ్యాయి. గత సార్వత్రిక ఎన్నికల్లో పట్టణంలో 74 శాతం మాత్రమే పట్టణంలో పోలింగ్ శాతం నమోదైంది.

శివారు ప్రాంతాల్లో పెరిగిన ఓటింగ్

ముఖ్యంగా ప్రధాన పట్టణంతో పోల్చితే శివారు ప్రాంతాల్లోనే ఎక్కువగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. 58 పోలింగ్ కేంద్రాల్లో సుమారు 30 వరకు శివారు ప్రాంతాల్లోనే ఉన్నాయి. విజయాటాకీస్ ఏరియా, ఎస్టేట్, పూలసుబ్బయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో ఒక్కో కేంద్రంలో రమారమి 87 శాతానికిపైగా ఓట్లు పోలయ్యాయి. ప్రధాన పట్టణంలో 70 నుంచి 75 శాతం వరకే ఓటుహక్కు వినియోగించుకున్నారు. అత్యధికంగా 12వ బ్లాకు పరిధిలోని స్థానిక చెన్నరాయుని పల్లిలో 94.60 శాతం పోలైంది. మొత్తం 741 ఓట్లకుగాను 701 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యల్పంగా స్థానిక 10వ బ్లాకు పరిధిలోని 40వ పోలింగ్ కేంద్రంలో 69.89 శాతం నమోదైంది. మొత్తం 870 ఓట్లకుగాను 608 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఈ బూత్ పరిధిలోనే మంత్రి ఆదిమూలపు సురేష్, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డిల ఓట్లు ఉండడం గమనార్హం. విద్యావంతులు, ఉద్యోగులు, వ్యాపార రంగాలకు చెందిన వాళ్లే ఈ బూత్ పరిధిలో అధికంగా ఉండడం విశేషం.

పురుషులకు తీసిపోని నారీమణులు

పట్టణంలోని అన్ని బూత్‌లలో కలిపి పురుషులకంటే మహిళల ఓట్లే ఎక్కువ. పురుషుల ఓట్లు 27,428 ఉంటే మహిళలవి 28,591 ఉన్నాయి. సుమారు 1,163 మహిళా ఓట్లు అధికంగా ఉన్నాయి. పోలింగ్‌లో కూడా మహిళలు పురుషులకు ఏ మాత్రం తీసిపోలేదు. పురుషులు 81.12 శాతంతో 22,251 ఓట్లు వేశారు. ఆదే విధంగా మహిళలవి 81.14 శాతంతో 23,201 ఓట్లు పోలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నేతలకు గాయాలు

కారు టైరు పేలి స్తంభాన్ని ఢీకొట్టడంతో ఘటన



ప్రమాదంలో దెబ్బతిన్న కారు ముందుభాగం, పరామర్శిస్తున్న నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, మే 16: కారు ప్రమాదంలో కొనకనమిట్ల మండలానికి చెందిన ఇద్దరు టీడీపీ నేతలకు గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొనకనమిట్ల మండల టీడీపీ అధ్యక్షుడు మోరబోయిన బాబూరావు, పొదిలి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ చప్పిడి రామలింగయ్యలు పొదిలి పట్టణం నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డిని కలిసేందుకు గురువారం ఉదయం వస్తున్నారు. మండలంలోని రాయవరం సమీపంలోని మెడికల్ కళాశాల వద్ద ఒక్కసారిగా వీరు ప్రయాణిస్తున్న కారు టైర్ పేలింది. దీంతో కారు నడుపుతున్న బాబురావు, ప్రయాణిస్తున్న రామలింగయ్యలకు గాయాలయ్యాయి. వీరిని మార్కాపురం పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలలో తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిని కందుల నారాయణరెడ్డి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం


వాహన తనిఖీ చేస్తున్న ట్రైనీ ఐఎఫ్ఎస్ శివ శంకర్

ట్రైనీ ఐఎఫ్ఎస్ శివశంకర్ హంగళ్

పెద్ద దోర్నాల, మే 16:సకల జీవకోటికి ప్రకృతి వరప్రసాదంగా ఇచ్చిన పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ట్రైనీ ఐఎఫ్ఎస్ శివ శంకర్ హంగళ్ అన్నారు. స్థానిక ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద శివ శంకర్ హంగళ్ గురువారం వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నల్లమల అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వంటి వ్యర్థాలను వేయడం వల్ల వన్య ప్రాణులు తిని ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నాయన్నారు. స్వచ్ఛమైన అటవీ ప్రాంతంలో యాత్రికులు ప్లాస్టిక్ వస్తువులను వేయకుండా ఉండేందుకు చైతన్యం కల్పిస్తున్నామన్నారు. అంతేకాదు అడవికి, మూగజీవాల మనుగడకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రధానంగా అటవీ అధికారులు, సిబ్బంది మరింత శ్రద్ధ వహించాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో అటవీ ప్రాంతంలో రోడ్ల వెంట వ్యర్థాలను తొలగించేందుకు ప్రత్యేకంగా స్వచ్ఛ సేవకులను నియమించామన్నారు. అటవీ ప్రాంతంలో ప్రయాణించే యాత్రికులు అగ్ని ప్రమాదాలకు హేతువైన బీడీ, సిగరెట్టు వంటివి పడేయరాదని కోరారు. అటవీ సంపదకు, పర్యావరణానికి రాజైన పెద్దపులులు, వాటి మనుగడకు అందరూ సహకరించాలన్నారు.

'సింగరాయకొండ'పై బెట్టింగ్‌లు !

మండలంలో మెజారిటీపై టీడీపీ, వైసీపీ ధీమా

సింగరాయకొండ, మే 16 : రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం గెలుపోటములపై బెట్టింగ్‌లు ప్రారంభమయ్యాయి. సింగరాయకొండ మండలంలో టీడీపీకి ఆధిక్యత వస్తుందని ఆ పార్టీ నాయకులు, వైసీపీకి మెజారిటీ వస్తుందని వైసీపీ నేతలు ఎవరి ధీమాలో వారు ఉన్నారు. దీంతో 10 గ్రామాల్లో జరిగిన పోలింగ్ సరళిని అంచనా వేసుకొని ఇరుపార్టీ నేతలు పందెలు కాస్తున్నారు. మండలంలో పో స్టల్ బ్యాలెట్‌తో కలుపుకొని ఒక్క ఓటైనా తమ పార్టీకి మెజారిటీ వస్తోందని టీడీపీ, తమకే వస్తోందని వైసీపీ నేతలు గురువారం రూ.25 లక్షలు పందెం కాసుకున్నారు. పాతసింగరాయకొండ పంచాయతీలో వైసీపీకి ఒక్క ఓటైనా మెజారిటీ వస్తోందని పోలింగ్ ముందురోజు వైసీపీ నేతలు రూ.3 లక్షలు బెట్టింగ్ కాశారు. రాదని టీడీపీ నేతలు రూ.3 లక్షలు పందెం పెట్టారు. పోలింగ్ ముగిసిన తరువాత టీడీపీ నేతలు పాతసింగరాయకొండలో టీడీపీదే ఆధిక్యతని ఒకటికి మూడింతలు ఇస్తామని ముం దుకు వచ్చారు. దీనిపై వైసీపీ నేతలు వెనక్కి తగ్గుతున్నారు. రాష్ట్రంలో టీడీపీ కూట మి అధికారంలోకి వస్తోందని, కొండపిలో తెలుగుదేశం అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి హ్యాట్రిక్ విజయం సాధిస్తారని ఆ పార్టీ నేతలు ఎంతైనా పం దెలు కాయడానికి సిద్ధమయ్యారు. వైసీపీ నేతలు మాత్రం ఆరెండింటిపై మేము బె ట్టింగ్‌లు పెట్టలేమని చేతులెత్తేశారు.

ఎస్సీ కాలనీలో సమస్యలను పరిష్కరించరా?

● అపరిశుభ్రంగా తోకపల్లి ఎస్సీ కాలనీ ● స్పందించని అధికారులు

పెద్దారవీడు, మే 16: మండలంలోని తోకపల్లి ఎస్సీ కాలనీలో పారిశుధ్య పనులు చేయక నెలలు గడుస్తోంది. దీంతో మురుగు ఎక్కడ పడితే అక్కడే నిల్వ ఉంటోంది. వాటర్ ట్యాంకర్ వద్ద అ పరిశుభ్రత నెలకొంది. వాటర్ పైపులు లీక్ కావడంతో ట్యాంక్ చుట్టూ నీరు నిల్వ ఉంటోంది. దీంతో ట్యాంక్ వద్దకు నీళ్లకోసం వెళ్లివారు జారి పడే పరిస్థితి నెలకొంది. పలుమార్లు ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి దృష్టికి సమస్యను తీసుకెళ్లినా, పట్టించుకోవడం లేదని ఎస్సీ కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్సీ కాలనీలో పారిశుధ్య పనులు చేయించాలని కోరుతున్నారు.


పైపులు లీకు కావడంతో రోడ్డుపై చేరిన నీరు


నిల్వ ఉన్న మురుగునీరు

గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే చర్యలు


విలేకర్లతో మాట్లాడుతున్న రాములునాయక్

ఎర్రగొండపాలెం, మే 16 : ఎర్రగొండపాలెం మండలంలో ఎన్నికల ముందు సత్ప్రవర్తన కోసం ఇరు పార్టీలలో 500 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని సీఐ రాములునాయక్ గురువారం విలేకర్లకు తెలిపారు. తహసీల్దార్ ఎదుట బైండోవర్‌కు గ్యారెంటీ ఇచ్చిన వ్యక్తి గొడవలకు పాల్పడితే బాండుపై ఎంతనగదు చెల్లిస్తామని సంతకం చేశారో...? అదే నగదు చెల్లించాలన్నారు. గొడవలకు పాల్పడినా, ప్రోత్సాహించినా, బెండోవరైన వ్యక్తి రూ.1 లక్ష నగదుకు బాండు ఇచ్చి ఉంటే లక్ష జరిమానాగా ప్రభుత్వానికి చెల్లించాల్సిందేనన్నారు. నగదు చెల్లించకపోతే రెవెన్యూ సీఆర్‌పీసీ ప్రకారం అతని భూములను జప్తు చేస్తామన్నారు.

ఈ నెల 14న వాదంపల్లి గ్రామంలో ఒక మహిళ ఓటు విషయమై రెండుపార్టీల నాయకులు, కార్యకర్తలు గొడవపడి, మిద్దెలపై ఉండి రాళ్లు రువ్వుకున్నారన్నారు. ఈ ఘటనలో ఐదుగురు వైద్యశాలలో చేరారు. వాదంపల్లి జరిగిన గొడవలో బెండోవరైన ముగ్గురు నాయకులు ఉన్నారని, వారి ముగ్గురిపై బైండోవర్ కేసుకు తహసీల్దార్ వద్ద ఒక్కొక్కరు 1 లక్షవంతున బాండ్లపై సంతకాలు చేశారన్నారు. వారి నుంచి ఇపుడు జరిమానా వసూలు చేస్తామన్నారు. గ్రామాల్లో బైండోవర్ కేసులో తహసీల్దార్ వద్ద పూచికత్తు బాండు ఇచ్చిన పెద్దలు, నాయకులు గొడవలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ప్రశాంతంగా ఉంచి సహకారం అందించాలన్నారు.

పరిసరాల శుభ్రతతో డెంగ్యూ నివారణ

డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మార్కాపురం వన్‌టౌన్, మే 16: పరిసరాల పరిశుభ్రతతో డెంగ్యూను నివారించవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.పద్మావతి అన్నారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ.. దోమల నివారణకు ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఆర్.నాగేందర్‌రెడ్డి, వైద్యులు శ్రావణ్‌తేజ, హర్షవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం

గిద్దలూరు : జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యసిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ వ్యాధికి సంబంధించిన టైగర్ దోమ మంచినీటిలో పెరిగి పగటి పూటనే కుట్టి డెంగ్యూ వ్యాధిని కలుగ జేస్తుందన్నారు. దీంతో ప్రతివారం డ్రై డేగా పాటించాలని ప్రజలకు సూచించారు. చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు ఈ వ్యాధి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వడమే నివారణ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ భార్గవరెడ్డి, డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ సుబేర్, సబ్ యూని ట్ ఆఫీసర్లు రంగనాయకులు, వెంకటేశ్వర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పొదిలి : జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూవ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శరత్‌చంద్ర, సబ్‌యూనిట్ అధికారి కృష్ణ ఆధ్వర్యంలో గురువారం పొదిలి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నివాస ప్రాంతాలు వాటి సమీపంలో నీరు నిలిచి ఉండకుండా చూసుకోవాలన్నారు. పాత టైర్లు, కొబ్బరికాయ టెంకలు, పగిలిన సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా పాటించి నీటి నిల్వలను తొలగించి వాటర్‌ట్యాంకులు, నీటి తొట్లను శుభ్రం చేసుకోవాలన్నారు. దోమల నివారణకు ప్రతిఒక్కరు బాధ్యత కలిగి ఉండాలన్నారు.

అవీ..ఇవీ..

తిరుపతి రైలుకు అదనపు బోగీలు

గిద్దలూరు, మే 16 : వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకుని గుంటూరు నుండి గిద్దలూరు మీదుగా తిరుపతి వెళ్ళే ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనపు బోగీలను ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు-గిద్దలూరు-తిరుపతి (17261) రైలుకు మే 16 నుంచి 31వ తేది వరకు, తిరుపతి-గిద్దలూరు-గుంటూరు (17262) రైలుకు మే 17 నుంచి జూన్ 1వ తేది వరకు 2 స్లీపర్ క్లాస్, 3 జనరల్ బోగీలను అదనంగా జతచేయడం జరుగుతుందని, ప్రయాణికులు వినియోగించుకోవాలని రైల్వే కమర్షియల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ తెలిపారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం


పుస్తక పఠనం నిర్వహిస్తున్న విద్యార్థిని

మార్కాపురం వన్ టౌన్, మే 16: విద్యార్థులు వేసవి సెలవులలో గ్రంథాలయ సేవలు ఉపయోగించుకోవాలని గ్రంథపాలకుడు జీవీ రంగారెడ్డి అన్నారు. స్థానికశాఖ గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పుస్తక పఠనం, చిత్రలేఖనం, సంగీతం, వివిధ ఆటలు, స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ నిర్వహించారు.

పెద్ద దోర్నాల : వేసవి శిక్షణ తరగతులతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందుతాయని గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి తెలిపారు. గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, ఆంగ్లంలో రాయడం, చదవడం నేర్పించారు.

రేపే అమ్మవారి జన్మదినోత్సవ వేడుక

గిద్దలూరు, మే 16 : పట్టణంలోని వాసవీ అమ్మవారిశాలలో ఈ నెల 18న శనివారం వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షులు గర్రె సత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఆర్యవైశ్య పతాక ఆవిష్కరణ, 102 మంది కన్యకలు, ముత్తైదువులు తెచ్చిన గంగాజలంతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, ఆర్యవైశ్య మహిళలతో సామూహిక లలిత సహస్రనామ పారాయణం, మధ్యాహ్నం ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం, సాయంత్రం సామూహిక కుంకుమపూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఓటింగ్‌లో గ్రామీణుల చైతన్యం

● 60 శాతం పోలింగ్ కేంద్రాలలో 90 శాతానికిపైగా ఓట్లు

మార్కాపురం, మే 16: మార్కాపురం నియోజకవర్గంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ సరళిని పరిశీలిస్తే గ్రామీణులలో పెరిగింది. మార్కాపురం నియోజవర్గంలో మార్కాపురం మున్సిపాలిటీ, మండలం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి నగర పంచాయతీ, మండలాలు ఉన్నాయి. పట్టణ ప్రాంతంతో పోలిస్తే గ్రామీణ ప్రాంత ప్రజలు ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మార్కాపురం నియోజకవర్గ సగటు 87.58 శాతం. పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో సగటు దాటి ఓటింగ్ శాతాలు నమోదయ్యాయి.

154 కేంద్రాలలో 90 శాతం కంటే అధికం

మార్కాపురం నియోజకవర్గంలోని 257 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 154 కేంద్రాలలో 90 శాతానికి పైగా ఓట్ల శాతం నమోదైంది. పట్టణ పరిధిలోకి వచ్చే మార్కాపురంలో 58 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో కేవలం 3 చోట్ల మాత్రమే 90 శాతం దాటింది. 78వ పోలింగ్ కేంద్రంలో 100 శాతం ఓట్లు పోలయ్యాయి. పొదిలి నగర పంచాయతీ, మండలాలలో 65 పోలింగ్ కేంద్రాలుండగా 37 చోట్ల, కొనకనమిట్ల మండలంలో 57 కేంద్రాలుండగా 33 చోట్ల, తర్లుపాడులో 35 పోలింగ్ కేంద్రాలుండగా 22 కేంద్రాలలో 90 శాతానికిపైగా ఓట్లు నమోదయ్యాయి.

ఇంటర్మీడియెట్ ప్రవేశానికి కౌన్సెలింగ్

కంభం, మే 16 : డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులకు మెరిట్ ప్రకారం మిగులు సీట్ల భర్తీకి శింగరాయకొండ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 21న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కంభం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చాముండేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ లిస్టు విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావడానికి వారి మొబైల్‌కు సమాచారం పంపించినట్లు తెలిపారు. సమాచారం కోసం 7815805491 సంప్రదించాలని కోరారు.

డాక్టర్ మౌలాలికి పరామర్శ


మౌలాలిని పరామర్శిస్తున్న కృష్ణారెడ్డి

మార్కాపురం, మే 16: రోడ్డు ప్రమాదంలో గాయపడి పల్నాడు జిల్లా నరసరావుపేటలో చికిత్సపొందుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షులు డాక్టర్ షేక్ మౌలాలిని ఏఎంసీ మాజీ చైర్మన్ డీవీ కృష్ణారెడ్డి గురువారం పరామర్శించారు. మండలంలోని దరిమడుగు సమీపంలో ఈ నెల 15న డాక్టర్ మౌలాలి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో ఆయన కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్సల అనంతరం మౌలాలిని మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట తరలించారు. ఆయన్ను పరామర్శించిన వారిలో టీడీపీ అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం ఉన్నారు.


వైద్యశాల సేవలను వినియోగించుకోవాలి

● 100 పడకలతో రోగులకు మెరుగైన సేవలు
● అందుబాటులో 27 మంది వైద్యులు
● వైద్యశాల సూపరింటెండెంట్ యాదిద్య


మాట్లాడుతున్న యాదిద్య

ఎర్రగొండపాలెం, మే 16 : ఎర్రగొండపాలెం ప్రభుత్వ వంద పడకల ఏరియా వైద్యశాలలో 27 మంది వైద్యులు ఉన్నారని, అని రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టరు యాదిద్య తెలిపారు. గురవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైద్యశాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యశాలలో అన్ని రకముల రక్త పరీక్షలు, ఎక్సరే యూనిట్ ఉన్నాయన్నారు. షుగర్, బీపీ వంటి దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు మందులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వైద్యశాలలో కాన్పులు కూడ ఎక్కువగానే జరుగుతున్నట్లు వివరించారు. ఆధార్‌కార్డుతో ఆయుష్మాన్‌భవ పథకానికి దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ వైద్యశాలలో ఉచిత వైద్యసేవలు పొందాలన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిదోషం ఉన్నవారికి కండ్ల అద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు.

వైభవంగా కోదండ రామాలయ వార్షికోత్సవం


భక్తులకు దర్శనమిస్తున్న సీతా సమేత కోదండరాముడు

త్రిపురాంతకం, మే 16: మండల కేంద్రంలోని కోదండ రామాలయ వార్షికోత్సవాన్ని గురువారం వేదమంత్రోచ్చరణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని భక్తులు దర్శించుకుని విశ్వక్షేణ ఆరాధన, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్టాపణ, మూలమంత్ర హవనములు, పంచ సూక్త హవనములు, హోమాలు, తీర్థ ప్రసాద వినియోగములు నిర్వహించారు. దీనిలో భాగంగా శుక్రవారం శాంతి కళ్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈకార్యక్రమంలో గ్రామస్థులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మద్యం షాపుల వద్ద బారులు తీరిన మందుబాబులు

మద్యం కోసం బారులు

పామూరు, మే 16 : సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక మద్యం షాపుల టార్గెట్ మధ్యాహ్నానికే పూర్తి అయి షాపులు మూసివేస్తున్నారు. దీంతో మద్యం దొరకక మంద బాబులు ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో మద్యం షాపులు తెరవకముందే షాపుల ముందు మందుబాబులు క్యూ కడుతున్నారు. పట్టణంలో 4 మద్యం షాపులు ఉండగా ఎన్నికల సమయంలో ఒక షాపును అధికారులు తనిఖీ చేసి స్టాకులో తేడాలు ఉన్నట్టు గుర్తించి సీజ్ చేసారు. దాంతో మూడు షాపులే ఉండటంతో మద్యం కోసం ఉదయం నుంచే పడికాపులు కాస్తున్నారు. మందుబాబుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొన్న షాపు నిర్వాహకులు మంచి సరుకును తమకు అనుకూలమైనవారికి చేరవేసి పిచ్చి బ్రాండ్లను అమ్ముతున్నారని, మంచి మందు అడిగితే స్టాకు లేదని ఇష్టమైతే కొను లేకుంటే పో అంటూ కసురుతున్నారని మందుబాబులు వాపోతున్నారు.



రోడ్లపై సంచరిస్తున్న ఆవులు

ప్రధాన రోడ్లపై ఆవుల సంచారం

● వాహనాల రాకపోకలకు ఇబ్బందులు

పామూరు, మే 16 : పామూరు పట్టణానికి నిత్యం వివిధ పనుల కోసం పామూరు మండలం నుంచే కాకుండా ఇతర మండలాల నుంచి వస్తుంటారు. దాంతో పట్టణంలోని ప్రధాన కూడళ్ళు మెయిన్ బజారు రద్దీగా ఉంటాయి. పామూరు మెయిన్ రోడ్లపై ఆవులు సంచరించడమే కాకుండా నడిరోడ్లపై అడ్డంగా నిలబడి ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులు, కొనుగోలు దారుల చేతుల్లోని కూరగాయలు, ఇతర వస్తువులను లాగేసుకొని నష్ట పరుస్తున్నాయి. తినుబండరాలు అమ్మే వ్యాపారులు, పండ్లు, కూరగాయాలు అమ్మే వారు కాస్తంత ఆదమరిస్తే చాలు వస్తువులను లాగేసి నష్టపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆవుల యజమానులు వాటిని బహిరంగంగా వదిలి వేస్తుండటంతో పలు సమస్యలు ఏర్పడుతున్నాయి. రోడ్లపై వీటి సంచారంతో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లపై ఆవుల సంచారం లేకుండా చూడాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు



పామూరులో కురుస్తున్న వర్షం

పామూరులో భారీ వర్షం

పామూరు, మే 16 : తీవ్ర ఎండవేడిమి, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు గురువారం కురిసిన భారీ వర్షం ఉపశమనం కలిగింది. ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొని ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం సుమారు అర గంటకు పైగా కురిసింది. దాంతో వాతావరణం చల్లబడి ఆహ్లాదకరంగా తయారైంది. మరో రెండుమూడు రోజులు ఇలాంటి వర్షం కురిస్తే ఎండలు తగ్గుముఖం పడుతాయని దాంతో ఎండ వేడిమినుంచి ఉపశమనం పొందవచ్చునని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ప్రమాదంలో గాయపడ్డ చెన్నకేశవులు

ఎక్స్‌కవేటర్‌ను ఢీకొన్న బైక్

● ఒకరికి తీవ్ర గాయాలు

వెలిగండ్ల, మే 16 : ఎక్స్‌కవేటర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సీఎస్‌పురం మండలం వెంగనగుంట గ్రామానికి చెందిన చెన్నకేశవులు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కనిగిరి నుంచి తన స్వగ్రామమైన వెంగనగుంటకు వెళ్తుండగా పద్మాపురం క్రాస్ రోడ్డు వద్ద ఎక్స్‌కవేటర్ రోడ్డు పక్కన ఆగివుంది. అతి వేగంతో వచ్చి బైక్ ఢీకొట్టడంతో తలకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సహాయంతో కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

20న 5 జిల్లాల స్థాయిలో ఎడ్లబండలాగుడు పోటీలు

సీఎస్‌పురం(పామూరు) మే 16: సీఎస్‌పురం మండలం రామాపురం గ్రామంలో శ్రీ పట్టాభిరామస్వామి తిరునాళ్ల సందర్భంగా ఈ నెల 20తేదీ సోమవారం ప్రకాశం, నెల్లూరు, కడప, గుంటూరు, కృష్ణా జిల్లాల స్థాయిలో ఎడ్లబండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎడ్ల పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన ఎడ్ల యజమానులు తమ పేర్లను 19 వ తేదీ లోపు రూ.500 ఎంట్రీ ఫీజుతో చెల్లించి నమోదుచేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు వరుసగా ప్రథమబహుమతి రూ. 50 వేలు, ద్వితీయ రూ.40వేలు, తృతీయ రూ. 30వేలు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు సెల్ 9666673735, 8499036565, 9611118712 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

ఓటరు చైతన్యం అభినందనీయం

ఒంగోలు(కలెక్టరేట్), మే 16: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల చైతన్యం వల్ల భారీగా ఓటింగ్ శాతం పెరగడం పట్ల వలంటీర్ ఎన్విరాన్‌మెంటల్ ఆర్గనైజేషన్ చైర్మన్ జి.వీరభద్రాచారి గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో ఎన్నికల అధికారులు ఓటు వినియోగంపై ఓటర్లకు కలిగించిన అనేక అవగాహన కార్యక్రమాలతో పాటు అనేక స్వచ్ఛంద సంస్థల ప్రచార కార్యక్రమాలు కూడా పోలింగ్ శాతం పెరిగేందుకు దోహదపడ్డాయని ఆయన తెలిపారు.

అధికారుల ఆదేశాలు బేఖాతర్

● వైసీపీ నేతల అండతో తెగబడుతున్న ఆక్రమణదారులు

● రూ. కోటి విలువైన స్థలం కబ్జాకు తిరిగి యత్నం

కనిగిరి, మే 16: కనిగిరిలో వైసీపీ నేతల అండతో ఆక్రమణల పరంపర కొనసాగుతున్నా అధికారుల్లో మాత్రం చలనం లేకుండా పోయింది. మున్సిపాల్టీ స్థలాలు, ప్రభుత్వ వంక, వాగు పోరంబోకు భూములు ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు సాగిస్తున్నా పట్టించుకునే అధికారి లేకుండా పోయాడు. గత ఏడాది అక్టోబర్‌లో స్థానిక వెంకటేశ్వర థియేటర్ రోడ్డులో ఓ సామాజిక భవనం పేరుతో అక్రమంగా మున్సిపాల్టీ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టేందుకు ఆయా స్థలాన్ని చదును చేసి, అనంతరం గుంతలు తీసి పిల్లర్‌లు వేసేవరకూ తెగించారు. ఈక్రమంలో చాలా మార్లు గతంలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన డీవీఎస్ నారాయణరావు ఆయా నిర్మాణాలు నిలుపుదల చేసి నోటీసులు జారీ చేశారు. ఈ విషయం ప్రస్తుత కలెక్టర్ దృష్టికి వెళ్లినా ఆయన కూడా నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఈ నోటీసులో ఆయా స్థలంలో అక్రమ నిర్మాణాలు సాగించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలతో కూడిన నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో ఆయా నిర్మాణాలను ఆక్రమణదారులు నిలిపివేశారు. తిరిగి మళ్ళీ అదే స్థలంలో నాలుగు రోజులుగా స్థలానికి చుట్టూ ఎత్తయిన ఇనుప రేకులను అడ్డుగా పెట్టి నిర్మాణాలు సాగిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు పనులు నిలిపివేయాలని నోటీసులు జారీ చేసినా ఆయా అధికారి పట్టించుకోకుండా ఆక్రమణదారులకు వత్తాసుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ తతంగంలో ప్రస్తుత టీపీవోగా పనిచేస్తున్న అధికారికి భారీ స్థాయిలో ముడుపులు ముట్టాయని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అందుకే ఆక్రమణదారులు వైసీపీ నేతల అండతో తిరిగి ఆ స్థలంలో నిర్మాణం చేపట్టేందుకు తెగబడ్డారని విమర్శలు వ్యక్తమౌతున్నాయి. ఎన్నికల బదిలీల్లో భాగంగా కనిగిరి మున్సిపల్ కమిషనర్‌గా వచ్చిన అధికారి తాను ఉండే నాలుగు రోజులకు ఇవన్నీ తనకెందుకు అన్నట్లుగా వ్యవహరించటం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావటం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఆక్రమ కట్టడాలను నిలిపివేసి విలువైన మున్సిపల్ స్థలాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



మున్సిపల్ స్థలం అంటూ గత ఏడాది వేసిన బోర్డు (ఫైల్)



ప్రస్తుతం ఆ స్థలంలో చేపట్టిన నిర్మాణాలు

విరిగిపడిన భారీ వృక్షం

● తెగిపడిన విద్యుత్‌తీగలు

● 9గంటలపాటు చీకట్లో గ్రామం



పశువైద్యశాలలో నేలకూలిన భారీ వృక్షం

వీసీపల్లి,మే16: రెండురోజుల క్రితం కురిసిన వర్షానికి తడిసిన వేపచెట్టు కూలిపోయి విద్యుత్ లైనుపై పడడంతో తీగలు తెగి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆ గ్రామంలో 9గంటలపాటు చిమ్మచీకట్లు అలుముకున్నాయి. మండలంలోని పీసీపల్లి పశువైద్యశాల ప్రాంగణంలో సుమారు రెండున్నర దశాబ్దాల నాటి భారీ వేపచెట్టు ఉంది. ఇటీవల కురిసిన వర్షానికి చెట్టు బాగా తడిసి నానిపోయింది.ఒకవైపు బరువు ఎక్కువైన చెట్టు బుధవారం అర్ధరాత్రి ఒక్కసారిగా నేలకూలింది.ఈ సమయంలో పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ మెయిన్‌లైన్‌పై పడడంతో తీగలు తెగి కిందపడ్డాయి. దీంతో బ్యాంకు సెంటరు నుంచి గోపవరపువారిపల్లి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం 10గంటల వరకు కూడా విద్యుత్‌లైను మరమ్మతు చేయకపోవడంతో ఆ గ్రామంలో అంధకారం నెలకొంది. తెగిపడిన విద్యుత్ తీగలు ఇళ్లపై పడ్డాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. పశువైద్యశాల ప్రాంగణంలో రోజూ పశుపోషకులతో పాటు గ్రామప్రజలు ఎండతీవ్రతను తట్టుకోలేక ఈ వేపచెట్టుకిందనే సేదతీరుతుంటారు.పిల్లలు ఈ చెట్టు కిందనే ఆటలు ఆడుకుంటూ ఉంటారు.నేలకూలిన వృక్షం రాత్రి సమయంలో కాకుండా పగలు సమయంలో విరిగిపడి ఉంటే భారీగా ప్రాణనష్టం జరిగి ఉండేదని గ్రామస్థులు చెప్తున్నారు.



ఇళ్లపై తెగిపడిన విద్యుత్‌వైర్లు

మరమ్మతులను అడ్డుకున్న గ్రామస్థులు

తెగిపోయిన విద్యుత్ వైర్లను అతికించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు వచ్చిన విద్యుత్ సిబ్బందిని గ్రామప్రజలు అడ్డుకున్నారు. ఇళ్లమీదుగా వెళ్లిన విద్యుత్ లైనును తొలగించాలని గత కొన్నేళ్లుగా అనేక పర్యాయాలు ఫిర్యాదులు చేసినా ఎందుకు తొలగించలేదంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు.ఇళ్ల మీదుగా వెళ్లిన విద్యుత్‌తీగలను తొలగిస్తేనే మరమ్మతులు చేపట్టాలని భీష్మించారు. గతంలో ఆదే గ్రామానికి చెందిన చంద్ర అనే యువకుడు ఇంటిపైగా వెళ్లిన విద్యుత్ తీగలు తగిలి మృతిచెందినా మీకు కనువిప్పు కలగలేదా అంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. త్వరలోనే గ్రామంలోని ఇళ్లపైగా వెళ్లిన విద్యుత్ తీగలను మారుస్తామని విద్యుత్ సిబ్బంది హామీ ఇవ్వడంతో గ్రామస్థులు శాంతించారు.తెగిపోయిన విద్యుత్ తీగలను మరమ్మతులు చేసిన విద్యుత్ సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ప్రాణాలు పోతున్నాయన్నా పట్టించుకోవడంలేదు



ఇళ్లపైగా వెళ్లిన 11కేవీ విద్యుత్ తీగలతో ప్రజల ప్రాణాలు పోతున్నాయి. రెండేళ్ల క్రితం మా గ్రామానికి చెందిన చంద్ర అనే వ్యక్తి ఇంటిపైకి ఎక్కుతూ విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. మరో వ్యక్తి గాయపడ్డాడు. ఇళ్లపై ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్‌లైను తొలగించమని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు.వర్షాకాలంలో గాలుల తీవ్రతకు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందేమోనని భయంభయంగా గడుపుతున్నాం. విద్యుత్‌లైను తొలగించేందుకు అయ్యే ఖర్చుకు పంచాయతీ నుంచి తీర్మానం ఇచ్చినా నిధులు విడుదల చేయకపోవడంతో జాప్యం జరుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్‌లైన్లు మార్చి గ్రామ ప్రజల ప్రాణాలను కాపాడాలి.

-బుజ్జిరెడ్డి, గోపవరపువారిపల్లి

ఉత్సాహంగా శిక్షణ తరగతులు

ఒంగోలు(కల్చరల్), మే 16: ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గురువారం విద్యార్థుకు పుస్తకపఠనం, కథలు చదివించటం, చెప్పించటం వంటివి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపగ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి మాట్లాడుతూ పిల్లలలో పుస్తకపఠనం పట్ల ఆసక్తి పెంచటం ప్రధాన లక్ష్యంగా వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వారిలో సృజనాత్మకతను పెంపొం దించడంతో పాటు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలపై అవగాహన కల్పించటం కూడా ముఖ్య ఉద్దేశ్యమన్నారు. శిక్షణ తరగతులు జూన్ 7వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు..

చిరుజల్లులతో ఉపశమనం

నాగులుప్పలపాడు, మే 16: గత రెండు రోజుల నుంచి కురుస్తున్న చిరుజల్లుల తో మండల ప్రజలకు ఉపశమనం లభించింది. ఈ ఏడాది వేసవి కాలం ప్రారంభం నుంచి భానుడి ప్రతాపంతో ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజలు ఉక్కపోతలతో ఉక్కిరిబిక్కిరయ్యారు. అయితే రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు సంభవించి ఆకాశం మేఘావృతమై చల్లటి ఆహ్లాదకర వాతావరణంతో చిరుజ ల్లులు కురిశాయి. దీనికి తోడు ఈ ఏడాది ముందుగానే రుతుపవనాలు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందని అధికారులు చల్లటి కబురును చేరవేయడంతో ప్రజలు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

చీరాలటౌన్, మే 16 : ద్విచక్ర వాహనం అదుపుతప్పి సెక్యూరిటీ గార్డుకు తీవ్రగాయాలైన సంఘటన గురువారం గొనసపూడి - ఇంకొల్లు రోడ్డులో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం గొనసపూడికి చెందిన సంతోషరావు ఇంకొల్లులోని ఓ ప్రైవేటు విద్యా సంస్థలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలోనే ఎప్పటిలాగే ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన సంతోషరావు మార్గం మధ్యలో వాహనం అదుపుతప్పి పడ్డాడు. దీంతో తలకు, శరీరంపై తీవ్ర రక్త గాయాలు కావడంతో 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

డెంగ్యూపై ప్రజలకు అవగాహన కల్పించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 16 : జిల్లాలో డెంగ్యూవ్యాధిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అన్ని గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను శుభ్రపర్చి ఫ్రైడే, డ్రైడేని సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. దర్శి పరిసర ప్రాంతాల్లో డెంగ్యూ కేసులు అధికంగా నమోదు అవుతున్నందున అందుకు కారణాలను విశ్లేషించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వెక్టార్ కంట్రోల్ యాప్ పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడం ద్వారానే డెంగ్యూను నివారించేందుకు సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం శాఖల వారీగా దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి సబ్జెక్టు టీచర్లకు శిక్షణ : డీఈవో

ఒంగోలు(విద్య), మే 16: జిల్లాలో సీబీఎస్‌ఈ పాఠశాలలుగా ఎంపిక చేసిన 63 ప్రభుత్వ స్కూళ్లలో 9,10 తరగతుల విద్యార్థులకు బోధిస్తున్న 546 మంది స బ్జెక్టు టీచర్లకు శుక్రవారం నుంచి ఈనెల 21 వరకు శిక్షణ ఇస్తున్నట్లు డీఈవో సుభద్ర గురువారం తెలిపారు. ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూలులో నా న్ రెసిడెన్షిల్ విధానంలో శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 8నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణకు ఇంగ్లీషు సబ్జెక్టు టీచర్లు 97 మంది, సోషల్ స్టడీస్ టీచర్లు 89 మంది, బయాలాజికల్ సైన్స్ 116, గణితంలో 128, ఫిజిక్స్‌లో 58, కెమిస్ట్రీలో58 మంది టీచర్లకు శిక్షణ ఇస్తారు. ఇం గ్లీషు, సోషల్, బయాలాజికల్‌సైన్స్ టీచర్లకు ఈనెల 17,18 తేదీల్లో, అలాగే గణి తం, ఫిజిక్స్, కెమిస్ట్రీ టీచర్లకు ఈనెల 20,21 తేదీల్లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నా రు. రాష్ట్ర పరిశీలకులుగా గ్రంథాలయ సంస్థ రాష్ట్ర డైరెక్టర్, ఎంఆర్ ప్రసన్నకుమా ర్ వ్యవహరిస్తారన్నారు. శిక్షణకు ఎంపికైన టీచర్లను సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు రిలీవ్ చేసి పంపించాలని డీఈవో కోరారు.

లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి : డీఎంహెచ్‌వో

ఒంగోలు(కలెక్టరేట్), మే 16: జిల్లాలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను లక్ష్యానికి అనుగుణంగా సకాలంలో పూర్తి చేసేలా చర్య లు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్ ఆదేశించారు. ఒంగోలులో ని డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తు న్న అన్ని కేడర్లకు సంబంధించిన వైద్యఅధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌సీహెచ్, చైల్డ్ హెల్త్, ఇమ్యునై జేషన్‌పై తగిన చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త గర్భిణుల పేర్లు సకాలంలో రిజిస్టర్ చేసి వారి వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయా లన్నారు. ప్రసవం, ప్రసవానంతరం వరకు అందించాల్సిన సేవలను విధిగా వివ రాలను వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప వైద్యాధికారి డాక్టర్ మాధవీలత, డీపీఎంవో వాణిశ్రీ, డీపీహెచ్‌ఎన్‌వో సుగుణమ్మ, డీపీవో సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కంకర రాళ్లతో అడ్డదిడ్డంగా ఉన్న కాశీపురం - తుమ్మకుంట రోడ్డు

ఆ రోడ్డులో వెళ్లాలంటే నరకమే..!

● కంకరరాళ్లలో అదుపుతప్పి పడుతున్న వాహనదారులు

కనిగిరి, మే 16: కనిగిరిపట్టణ సమీపంలోని కాశీపురం-తుమ్మకుంట రోడ్డు మరీ నరకప్రాయంగా తయారైంది. గతంలో ఉన్న మట్టిరోడ్డే కొంత మెరుగ్గా ఉందని గ్రామస్థులు చెప్తున్నారు. 2019 ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా అప్పటి వైసీపీ ఇన్‌చార్జి బుర్ర మధుసూదన్‌యాదవ్ కాశీపురం- తుమ్మకుంట వెళ్లేందుకు తారు రోడ్డు నిర్మాణం చేయిస్తామని హామీ ఇచ్చారు. 2019 ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఆ రోడ్డును నిర్మించేందుకు అలక్ష్యం వహించారు. తిరిగి 2024 ఎన్నికల్లో భాగంగా గడపగడపకు కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలకు ప్రచారానికి వెళ్లారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రోడ్డు విషయంలో ఎమ్మెల్యేను నిలదీశారు. ఎన్నికల్లో తనకే మళ్ళీ వైసీపీ ఎమ్మెల్యేగా అధిష్ఠానం టికెట్ ఇస్తుందన్న భ్రమలో ఆయా గ్రామాలకు వెళ్ళే రోడ్డులో కంకర రాళ్లతో రోడ్డు పోశారు. ఆ తర్వాత దానిని చదును చేయాల్సి ఉంది. ఎన్నికల నాలుగునెలల ముందు ఆయా గ్రామాలకు చెందిన ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎమ్మెల్యే బుర్రా చేసిన ప్రయత్నం ఫలించకపోగా ఆయనకే స్థానచలనం జరిగింది. ఇంతలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మరో వైసీపీ నేతకు అధిష్ఠానం కనిగిరి ఎమ్మెల్యే టికెట్ కేటాయించింది. ఇంతలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో గ్రామస్థులకు అవస్థలు మొదలైనాయి. కంకరు రాళ్ళతో కూడిన రోడ్డు కావటంతో వాహనదారులు కిందపడి గాయాలు పాలవుతున్నారు. ఇలాంటి ఘటనలు ఈ నాలుగు నెలల్లో చాలానే జరిగాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖాధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డును చదును చేయాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

తాళ్లూరు మండలంలో 92.2 శాతం పోలింగ్

● అధికంగా ఓటుహక్కు వినియోగించుకున్న మహిళలు

తాళ్లూరు, మే 15 : సార్వత్రిక ఎన్నికల్లో మండలంలో 37,722 మంది ఓటర్లకుగాను 34,782 మందిఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019ఎన్నికల్లో 92శాతం పోలింగ్ నమోదుకాగా ఈ ఎన్నికల్లో 92.2శాతం పోలింగ్ నమోదయింది.ఈ ఎన్నికల్లో పురుషులు 17,514 మంది, మహిళలు 17,268 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. మండలంలో పురుషుల కంటే మహిళలు అత్యధికంగా తాళ్లూరులో 2,274 మంది, తూర్పుగంగవరంలో 2,223 మంది, తురకపాలెంలో 938 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో అత్యధికంగా లక్కవరం, విఠలాపురం గ్రామాల్లో 95 శాతం పోలింగ్ నమోదు కాగా, తురకపాలెంలో అత్యల్పంగా 86శాతం నమోదయింది. గత ఎన్నికల్లో నూరుశాతం వైసీపీ వైపు నిలిచిన కాపులు ఈసారి 70శాతం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వైపు మొగ్గు చూపారు. వైసీపీ శ్రేణులు ఓటమి భయంతో ఓటర్లకు అధికంగా తాయిలాలు ఇచ్చి తమ వైపు కొందరినే ఆ కట్టుకోగలిగారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటర్లు మాత్రం వైసీపీ తాయిలాలు తీసుకున్నా వీవీఎంలలో మాత్రం తాము అనుకున్న వారికే ఓట్లు వేసినట్లు తెలుస్తోంది. ఈ పర్యాయం ఇతరప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ప్రత్యేక వాహనాల్లో తరలి వచ్చి పోలింగ్‌లో పాల్గొన్నారు. వారంతా కూటమి వైపు నిలిచారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పోలింగ్‌లో యువత ఎక్కువగా ఉత్సాహంగా పాల్గొన్నారు. నిరుద్యోగ యువత ప్రభుత్వ వ్యతిరేకత కనపరిచినట్లు విశ్లేషకులు అంటున్నారు. మహిళలు కూడా అధిక సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొన్నారు. టీడీపీ కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యతనిచ్చినందున మహిళలు కూటమి వైపు నిలిచారని కొందరు అంటున్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 17 మే 2024





వరద నీటి మునకలో నరసరావుపేట పట్టణం (పాత చిత్రం)





నరసరావుపేటలో జమ్ముతో, వ్యర్థాలతో పూడిపోయిన ప్రధాన వరద నీటి కాలువలు







నరసరావుపేటలో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగు

పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని పురపాలక సంఘాల్లో వేసవి ప్రణాళికలను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వర్షాకాలంలో ప్రజలకు వరద నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి. వర్షాలు కురవక ముందే పురపాలక సంఘాలలో ముంపు నివారణకు అవసరమైన పనులు పూర్తి చేయాలి. భారీ వర్షాలు కురిస్తే పల్లపు ప్రాంతాలు ముంపుకు గురవ్వకుండా వరద నీటి, ప్రధాన మురుగు కాలువల్లో పూడిక తీత చేపట్టాలి. గతంలో ఏఏ ప్రాంతాలు వరదనీటితో ముంపుకు గురయ్యాయో గుర్తించి ఆయా ప్రాంతాల్లో వరద నీటి కాలువలను అభివృద్ధి చేయాలి. వర్షాలు కురిస్తే ఈ పనులు చేపట్టేందుకు వీలుండదు. అయినా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు.

మేల్కోకుంటే.. మునకే!

- వర్షాకాలం ముందస్తు చర్యలు శూన్యం
- పూడి పోయిన వరద నీటి కాలువలు
- పూడిక తీతకు నోచుకోని వైనం
- భారీ వర్షం కురిస్తే పల్లపు ప్రాంతాలు మునకే
- చోద్యం చూస్తున్న మునిసిపల్ అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

భారీ వర్షాలు కురిస్తే ఉమ్మడి జిల్లాల్లోని పట్టణాల్లో పల్లపు ప్రాంతాలు ఏటా ముంపుకు గురవుతున్నాయి. వర్షాకాలం ముందస్తు పనులు చేపట్టడాన్ని పురపాలకులు విస్మరిస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. గత అనుభవాలను పరిశీలనలోకి తీసుకొని వరద నీరు గృహాల్లోకి ప్రవేశించ కుండా పూర్తిస్థాయి చర్యలు మునిసిపాలిటీల్లో చేపట్టాల్సి ఉంది. ఈ దిశగా మునిసిపల్ అధికారులు స్పందించటం లేదు. వర్షా కాలం తరుముకొస్తున్నా పురపాలకులు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదు. ప్రతి మునిసిపాలిటీలో ఉన్న వరద నీటి కాలువలు, ప్రధాన మురుగు కాలువల్లో వర్షా కాలానికి ముందుగా అభివృద్ధి చేయాల్సి ఉంది. పూడిపోయిన కాలువలను పునరుద్ధరించాలి. వరద నీరు సులువుగా కాలువల్లో ప్రవహించే విధంగా చర్యలు చేపట్టాలి. ప్రధాన మురుగు కాలువల్లో ప్రారంభం నుంచి చివరి వరకు పూడిక తీయాలి. వరద నీటి కాలువల్లో పెరిగిన జమ్ము, నాచు తొలగించాలి. కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా కాలువలను అభివృద్ధి చేయాలి. ఇందు కోసం మునిసిపాలిటీలు ప్రత్యేక నిధులు కేటాయించాలి. వేసవి కాలం ముగియ బోతున్నా సదరు పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

పురపాలకుల్లో చలనం లేదు..

జూన్ మొదటి వారంలో వర్షాలు కురుస్తుంటాయని తెలిసినా పురపాలకుల్లో చలనం లేదు. ఇంజనీరింగ్, ప్రణాళికా, పారిశుధ్య విభాగాల అధికారులు కమిటీగా ఏర్పడి సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉంది. కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించి నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు తీసుకోవాలి. సదరు విభాగాల అధికారులు వరద నీటి కాలువల్లో పూడిక తీత పనులు, పగిలి పోయిన కట్టడాల పునరుద్ధరణ చేపట్టేందుకు ఇంకా మునిసిపాలిటీలలో సమాయత్తం కాకపోవటం గమనార్హం. ఈ ఏడాదైనా ఈ పరిస్థితుల నుంచి పేదలను గట్టెక్కించేందుకు ఇప్పటికైనా వర్షాకాలం ముందస్తు పనులు చేపట్టే అంశంపై ఏ విధంగా స్పందిస్తారో చూడాలి. నగర పంచాయతీలు, ఏ ఒక్క మునిసిపాల్టీలో కూడా ఈ పనులు చేపట్టలేదు. వర్షాకాలం ముందస్తు చర్యలు చేపట్టేందుకు అధికారులు ఇప్పటికైనా స్పందించాలి. వర్షాలు కురిసే సమయంలో పనులు చేసే పరిస్థితి ఉండదు.

వెంటాడుతున్న నిధుల కొరత...

మునిసిపాల్టీల్లో నిధుల కొరత వెంటాడుతోంది. ప్రభుత్వం నుంచి నిధులు రావడంలేదు. ఉద్యోగుల జీతాల చెల్లింపు కటకటలాడుతోంది. ఎన్నికల నేపథ్యంలో పన్ను వసూళ్లు పూర్తి స్థాయిలో జరగలేదు. ప్రభుత్వం వరుసగా నాలుగేళ్లు పన్ను పెంచడంతో కొత్త ప్రభుత్వం వస్తే పెంచిన పన్నులు తగ్గిస్తారన్న భావనతో పన్నులు చెల్లించేందుకు పురాల పౌరులు ముందుకు రాలేదు. దీంతో మునిసిపాల్టీల ఖజానాలు నిండుకున్నాయి. దీంతో వర్షాకాలం ముందస్తు చర్యలు తీసుకోవడంలో అలసత్వం నెలకొంది. కాంట్రాక్టర్లకు చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదు. దీంతో సదరు పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు సిద్ధంగా లేరు. ఈ నేపథ్యంలో వరద నీటి కాలువల్లో పూడికతీత చేపట్టడం లేదు.

మురుగు కాల్వలను కబ్జా చేశారు..

వరద నీటి కాలువలు మునిసిపాల్టీలలో ఆక్రమణలకు గురయ్యాయి. అధికారం అండతో కాలువలపై అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఏ ఒక్క మునిసిపాల్టీలో కూడా కాల్వలపై ఆక్రమణలు తొలగింపునకు ప్రయత్నాలు జరగడం లేదు. కాలువల కబ్జాదారులపై చర్యలు లేకపోవడంతో వారు రెచ్చిపోతున్నారు. మునిసిపాల్టీల రికార్డుల్లో నమోదైన ప్రకారం కాలువల విస్తీర్ణం లేదు. భారీ షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్వాహకులు వారి షాపుల ముందు ఉన్న కాలువలపై ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తూ వాటిని కబ్జా చేస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన ప్రణాళికా విభాగాలు చోద్యం చూస్తున్నాయి. ఆక్రమణలతో కాలువలు కుంచించుకు పోయ్యాయి. దీంతో భారీ వర్షాలు కురిస్తే వరద నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. పల్లపు ప్రాంతాల్లోని గృహాలు ముంపునకు గురవుతున్నాయి. వరద నీటి కాలువలను పునరుద్ధరించకుంటే వర్షాలు కురిస్తే పల్లపు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ముంపు కష్టాలు తప్పవు.



కారంపూడిలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి, మూతపడ్డ దుకాణాలు



మాచర్ల పార్కు సెంటర్లో దుకాణాలను మూసివేయిస్తున్న పోలీసులు



మాచర్ల : నెహ్రూనగర్‌లో ముళ్ల కంచె ఏర్పాటుచేసి బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



పిన్నెల్లిలో వైసీపీ నేత ఇంట్లో లభ్యమైన పెట్రోలు బాంబులు





ముప్పాళ్ల: మాదల వైసీపీ నాయకుడు గుంటూరు సైదా నివాసంలో సోదాలు జరుపుతున్న సత్తెనపల్లి రూరల్ సీఐ రాంబాబు, ఎస్ఐ హజరత్తయ్య, ఆయన ఇంట్లో దొరికిన పెట్రో బాంబులు

పల్నాట.. పోలీసుల పహారా

- జిల్లాలో కొనసాగుతున్న 144 సెక్షన్
- నిర్మానుష్యంగా వీధులు.. దుకాణాల మూత
- ఎక్కడికక్కడ పోలీసు పికెట్లు.. ఇళ్లల్లో తనిఖీలు
- వైసీపీ నేతల ఇళ్లల్లో పెట్రో బాంబులు స్వాధీనం
- నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు

మాచర్లటౌన్, కారంపూడి, ముప్పాళ్ల, మాచవరం, పిడుగురాళ్ల, మే 16: పోలింగ్ అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. చిన్న అలికిడి అయినా భీతిల్లిపోతున్నారు. పట్టణాలు, పల్లెలు పోలీసు పహారా మధ్య ఉన్నాయి. జిల్లా అంతటా 144 సెక్షన్ గురువారం కూడా కొనసాగింది. దుకాణాలను పోలీసులు తెరవనీయలేదు. దీంతో జిల్లా అంతటా అప్రకటిత కర్ఫ్యూ అమలవుతుంది. పట్టణాలతో పాటు పల్లెల్లోనూ వీధులు జనసంచారం లేకపోవడంతో నిర్మానుష్యంగా మారాయి. రెండు రోజులుగా ఎటువంటి అల్లర్లు జరగలేదు. అయినా ఇరువర్గాల వారు ఏ సమయంలోనైనా దాడులకు పాల్పడే అవకాశం ఉందని భావించిన పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నారు. అనుమానితుల గృహాల్లో సోదాలతో పాటు ఎక్కడికక్కడ పికెట్లు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నిస్తున్నారు. అదనపు బలగాలతో పికెట్లు కొనసాగుతున్నాయి. మాచర్లలో బందోబస్తు నిమిత్తం తమిళనాడు నుంచి 110 మందితో కూడిన పోలీసు బలగాలను గురువారం మాచర్లకి రప్పించారు. పట్టణంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు ఐదుగురు, సీఐలు ఏడుగురు, ఎస్ఐలు 22 మంది, ఏఎస్ఐలు నలుగురు, హెడ్ కానిస్టేబుళ్లు 11, పోలీసు కానిస్టేబుళ్లు 40, హోంగార్డులు 101, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు 77 మంది, సీఐఎస్ఎఫ్ 90 మంది, ఏపీఎస్‌పీ 21 మంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని మొత్తం ఐదు మండలాల్లో సుమారు 1000 మంది పోలీసు బలగాలు మోహరించాయి.

పిన్నెల్లి, మాదలలో పెట్రో బాంబులు స్వాధీనం

వైసీపీ నేతల ఇళ్లల్లో పెట్రో బాంబులు, కత్తులు, రాళ్లు, ఖాళీ బీరుసీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరికొన్ని చోట్ల కూడా బాంబులు ఉండే అవకాశం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. వైసీపీ నాయకులు ఆధిపత్యం కోసం టీడీపీ వారిని భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నంలోనే ఈ పెట్రోలు బాంబులు, మారణాయుధాలు సిద్ధం చేసుకున్నట్లు అటు పోలీసులతో పాటు ఇటు సామాన్య ప్రజలు భావిస్తున్నారు. ముందస్తు సమాచారంతో పోలీసులు బుధవారం రాత్రి మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో ఇంటింటా సోదాలు చేపట్టారు. ఈ క్రమంలో వైసీపీ నాయకులైన చింతపల్లి పెద్దసైదా, చింతపల్లి నన్నే గృహాల్లో పెట్రో బాంబులు బయటపడ్డాయి. టీడీపీ నాయకులైన షేక్ జానీబాష ఇంటిపైన గులకరాళ్లను పోలీసులు గుర్తించారు. దీంతో పోలీసులు వైసీపీకి చెందిన ముగ్గుర్ని, టీడీపీకి చెందిన ముగ్గుర్ని బుధవారం రాత్రే అదుపులోకి తీసుకున్నారు. ముప్పాళ్ల మండలం మాదలలో పోలీసు తనిఖీల్లో వైసీపీ నాయకుడు గుంటూరు సైదా ఇంట్లోని బాత్‌రూంలో 29 పెట్రోల్ బాంబులను గుర్తించారు. సత్తెనపల్లి రూరల్ సీఐ రాంబాబు, ఎస్ఐ హజరత్తయ్య గురువారం వీటిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ బిందుమాధవ్ మాచర్లలో తిష్ట వేసి పోలీసు బృందాలకు సూచనలు చేస్తున్నారు. రింగురోడ్డు, పురపాలక సంఘం కార్యాలయం ప్రధాన రహదారి, నెహ్రూనగర్‌లలో ముళ్ల కంచెలు వేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు.

నిందితుల కోసం గాలింపు..

మంగళవారం కారంపూడిలో సీఐ నారాయణ స్వామిపై దాడి చేసిన వైసీపీ గూండాల కోసం పోలీసులు ప్రత్యేక బలగాలను దింపి గాలింపు చర్యలు చేపట్టారు. మండలంలోని ప్రతి గ్రామంలో సోదాలు చేస్తున్నారు. దీంతో దాడులకు పాల్పడిన రౌడీ మూకలు గ్రామాల నుంచి పారిపోయారు. పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన ఘర్షణ, విధ్వంసాలకు పాల్పడిన వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మాచర్ల పట్టణంతోపాటు గ్రామాలను జల్లెడ పడుతున్నారు.

ప్రజలు విలవిల

మంగళవారం నాటి సంఘటనలతో జిల్లా అంతటా 144 సెక్షన్ కొనసాగుతుంది. దీంతో పోలీసులు దుకాణాలను తెరవనీయడం లేదు. రెండు రోజులుగా బయటకు అడుగుపెట్టేందుకు ప్రజలు భీతిల్లిపోతున్నారు. నిత్యావసరాలకు, తాగునీటికి సైతం విలవిల్లాడుతున్నారు. బయటకు వెళ్లి ఏం తెచ్చుకోవాలన్నా భయంతో ఉన్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు చిన్న చిన్న వ్యాపారులపై ఆంక్షలు సడలించినా పూర్తిస్థాయిలో నిత్యావసర వస్తువులు అందడం లేదు. ఇదే అదునుగా వ్యాపారులు అధిక రేట్లకు అమ్ముతున్నారు. 144 సెక్షన్ ఇంకెంత కాలం కొనసాగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సీఎంవోకు పిన్నెల్లి సోదరులు..

తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలు గురువారం పోలీసు ఎస్కార్ట్‌తో వెళ్లారు. శుక్రవారం విదేశాలకు వెళ్లనుండడంతో జగన్‌ను కలిసేందుకు సోదరులిద్దరూ వెళ్లారు.



విజయపురి సౌత్ ఎస్ఐ డీవీ కొండారెడ్డి



శివశంకర్ లోతేటి



ఎస్పీ బిందుమాధవ్



నరసరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ



గురజాల డీఎస్పీ ఏ పల్లపురాజు



సీఐ కే ప్రభాకరరావు



సీఐ ఈ బాల నాగిరెడ్డి



కారంపూడి ఎస్ఐ రామాంజనేయులు

8 మందిపై వేటు

- అడ్డగోలు అధికారులపై ఈసీ కొరడా
- కలెక్టర్ బదిలీ.. ఎస్పీ సహా ఆరుగురి సస్పెన్షన్
- ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఫలితం
- ఈ స్థాయిలో చర్యలు ఇదే ప్రథమం.. ఉలిక్కిపడిన యంత్రాంగం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఎలా ఉంటాయో ఎన్నికల కమిషన్ రూచి చూపించింది. అడ్డగోలుగా వ్యవహరించిన అధికారులపై కొరడా ఝుళిపించింది. కలెక్టర్ శివశంకర్‌ను బదిలీ చేయగా ఎస్పీ బిందుమాధవ్‌తో పాటు ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు ఎస్బీ సీఐలు, ఇద్దరు ఎస్ఐలను సస్పెండ్ చేస్తూ గురువారం రాత్రి ఎన్నికల సంఘం ఉత్తర్వులను విడుదల చేసింది. ఈసీ వేటు పడిన వారిలో గురజాల, నరసరావుపేట డీఎస్పీలు పల్లపరాజు, వీఎస్ఎన్ వర్మ, డీఎస్బీ సీఐలు ప్రభాకరరావు, బాలనాగిరెడ్డి, కారంపూడి, నాగార్జునసాగర్ ఎస్ఐలు రాంజనేయులు, కొండారెడ్డి ఉన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒకేసారి ఇంతమందిపై చర్యలు తీసుకోవడం ఇదే ప్రథమం. ఎన్నికల కమిషన్ జిల్లా అధికారులపై తీసుకున్న చర్యలు సంచలనం కలిగించాయి.

ఈసీ ఆదేశించినా అలసత్వం..

రాష్ట్రంలో అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాలను గుర్తించి అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై ఎన్నికల సంఘం పోలింగ్‌కు ముందే నిర్దేశించింది. వాటిలో పల్నాడు జిల్లా పరిధిలోనే నాలుగు నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో ఎటువంటి చర్యలు తీసుకోవాలో గతంలోనే ఎన్నికల సంఘం సూచించింది. పోలింగ్ రోజున అరాచకాలు రాజ్యమేలుతాయని ముందుగానే కమిషన్ హెచ్చరించింది. అయినా జిల్లా ఎన్నికల యంత్రాంగం అలసత్వాన్ని వీడలేదు. అరాచకాలు జరగకుండా అడ్డుకోవడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. ఇందుకు తగిన మూల్యం అధికారులు చెల్లించుకున్నారు. మాచర్ల, గురజాల, నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాలో గత ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా అరాచక శక్తులు రెచ్చిపోయి, భారీగా విధ్వంసాలు సృష్టించాయి. టీడీపీ ఏజెంట్లపై దాడులు, మాచర్ల టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిపై హత్యాయత్నం, పదుల సంఖ్యలో కార్ల ధ్వంసం, కార్ల దహనం, ఐదు పోలింగ్ బూత్‌లలో ఈవీఎంల ధ్వంసం, పెట్రో బాంబులతో దాడులు ఇలా అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి. పోలీసు నిఘా వ్యవస్థ కూడా అరాచకాలకు సంబంధించి ముందస్తు సమాచారం సేకరించడంలో విఫలమైంది. ముందు నుంచి ప్రతిపక్షాలు అనుమానించిన విధంగానే విధ్వంసాలు జరిగాయి. పల్నాడులోని పరిస్థితులపై ఆంధ్రజ్యోతిలో పలు కథనాల రూపంలో హెచ్చరించినా అధికారుల్లో చలనం లేదు. యంత్రాంగం నిర్లక్ష్యం ఫలితంగా పోలింగ్ తర్వాత కూడా అరాచకాలు రాజ్యమేలాయి. వందల సంఖ్యలో వైసీపీ మూకలు ఇనుప రాడ్లతో రోడ్డెక్కినా పోలీసులు నిరోధించలేకపోయారు. కారంపూడి విధ్వంసంలో పిన్నెల్లి వెంట్రామిరెడ్డి స్వయంగా పాల్గొన్నారు. దాడుల్లో వందల సంఖ్యలోనే గాయపడ్డారు. కారంపూడిలో ఏకంగా సీఐపైనే పిన్నెల్లి గ్యాంగ్ దాడి చేసి గాయపరిచింది. ఈ ఎన్నికల్లో పెట్రో బాంబులను వినియోగించారు.

రూ.5 కోట్లకు డీల్..

ఎన్నికల నిర్వహణలో అధికార పార్టీ అభ్యర్థులకు సహకరించేలా రూ.5 కోట్లకు డీల్ జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే వైసీపీకి అనుకూలంగా పనిచేసేలా అధికారులను నియమించేందుకు డీల్ చేసుకున్నట్లు సమాచారం. బొప్పూడి వద్ద జరిగిన ప్రధాన మోదీ సభకు భద్రత కల్పించడంలో విఫలమవడంతో అప్పటి ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని బదిలీ చేశారు. అయితే అంతకముందే మాచర్లతో పాటు పలు నియోజకవర్గాలో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించేలా కొందరూ పోలీసు అధికారులను నియమించినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ఈ ప్రచారాన్ని బలపరుస్తూ ఆ తర్వాత కూడా జిల్లాలో యథేచ్ఛగా దాడులు, దౌర్జన్యాలు కొనసాగాయి. పోలింగ్ రోజు, ఆ తర్వాత రోజు అవి తారాస్థాయికి చేరాయి. ఈ పరిస్థితులను ఉపేక్షించిన ఎన్నికల సంఘం ఏకంగా డీజీపీ, సీఎస్‌లను వివరణ కోరి మరీ తాజాగా అధికారులపై చర్యలు తీసుకుంది. కోడ్ వచ్చిన తర్వాత నుంచి జిల్లాలో ఇప్పటి వరకు కలెక్టర్, ఇద్దరు ఎస్పీలు సహా ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, ఇద్దరు ఎస్ఐలపై ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించింది. ఈ చర్యలతోనైనా ఎన్నికల యంత్రాంగంలో మార్పు వస్తుందో లేదో చూడాలి. కొత్త కలెక్టర్‌ను నియమించే వరకు జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ ఇన్‌చార్జి కలెక్టర్‌గా, ఇన్‌చార్జి ఎస్పీగా ఏఎస్పీ పీ రాఘవేంద్రరావు వ్యవహరించనున్నారు.



ఈవీఎంల స్ట్రాంగురూం వద్ద భద్రతపై ఎస్పీ ఇతర అధికారులతో చర్చిస్తున్న దినేష్‌కుమార్

స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్ట భద్రత

● జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 16: ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఈవీఎం స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేసకుమార్ పేర్కొన్నారు. స్ట్రాంగ్‌రూం భద్రతా ఏర్పాట్లను గురువారం ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒంగోలు పార్లమెంట్‌తోపాటు ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలన్నారు. స్ట్రాంగ్‌రూంల వద్ద నుంచి లెక్కింపు కేంద్రాలకు ఈవీఎం యూనిట్స్ తరలించే మార్గాలు, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లేందుకు అనువుగా బారికేడ్ల ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని ఆదేశించారు. అనధికార వ్యక్తులు, ఇతరుల వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదన్నారు. పవర్ బ్యాకప్ సౌకర్యంతో సీసీ టీవీలతోపాటు లైటింగ్, అవసరమైన మేరకు జనరేటర్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కమాండ్ కంట్రోలు రూములో సీసీటీవీ ద్వారా స్ట్రాంగ్‌రూంలను 24బై7 మూడు షిఫ్టలలో పరిశీలించేలా ప్రతిషిఫ్టకు గెజిటెడ్ అధికారులను నియమించామన్నారు. సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికలో అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. స్ట్రాంగ్‌రూంల వద్ద ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించేలా రెవెన్యూ, పోలీస్ అధికారులతో ఒక టీంను కూడా ఏర్పాటు చేసినట్లు దినేష్‌కుమార్ తెలిపారు. ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూం వద్ద మూడంచెల విధానంలో బందోబస్తును పటిష్టంగా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీలత, ఓడా వైస్‌చైర్మన్ విశ్వేశ్వరరావు, ఆర్వోలు సుబ్బారెడ్డి, లోకేశ్వరరావు, హౌసింగ్ పీడీ పేరయ్య ఎస్ఈ దేవానందం తదితరులు పాల్గొన్నారు.

ఏదీ ప్రక్షాళన!

అసలు వైద్యశాఖలో ఏమి జరుగుతోంది
పెత్తనం కోసమే ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారా?
పాత నియామకాల్లో జరిగిన అవకతవకలపై విచారణ నివేదికలు పట్టించుకోని వైనం
ఇప్పుడు తాజాగా మరో 18 పోస్టుల నియామకాలపై అవినీతి ఆరోపణలు
నోట్‌ఫైల్ లేకుండానే భర్తీ చేశారా?
ఇందులో ఎవ్వరికి ఎంత లాభం అనే దానిపై చర్చ
ఆ శాఖలో జరుగుతున్న తంతును అరికట్టేవారే లేరా..

ప్రతిష్టాత్మకమైన శాఖ అది. కానీ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యశాఖలో జరుగుతున్న తంతు చూస్తుంటే సామాన్య ప్రజానీకం కూడా అసహ్యించుకునే విధంగా ఉంది. ఒకరు చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు మరొకరి తప్పును వెలుగులోకి తీసుకరావడం, వాటిపై ఫిర్యాదులు చేయడమే పనిగా పెట్టుకున్నట్లున్నారు. తమకు పైస్థాయిలో ఉండే పరపతితో విచారణలకు నియమించడం... విచారణ చేసిన తర్వాత తప్పులు వెలుగులోకి వచ్చాక... ఆ నివేదికలను పక్కనపెట్టడం సర్వసాధారణమైపోతుండటంతోనే ఈ పరిస్థితి కారణమైందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



ఒంగోలు(కలెక్టరేట్), మే 16 : ఎంతో పవిత్రమైన వైద్య ఆరోగ్యశాఖకే అవినీతి జబ్బు చేసింది. దానిని నయం చేసే సరైన ఉన్నతాధికారి లేకపోవడమే కారణమా? అన్న చర్చ ఇప్పుడు ఆ శాఖలో నడుస్తోంది. తాము ఉన్నతాధికారిగా ఉన్నప్పుడు అంతా నిజాయితీ నడుస్తుందంటారు.. వారు ఇక్కడి నుంచి బయటకు వెళ్లాక ఒక్కొక్కటి తప్పులు వెలుగులోకి వస్తుండటంతో ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. కొవిడ్-19ను ఆసరా చేసుకొని ఉద్యోగ నియామకాల నుంచి హస్పిటల్స్ రెన్యూవల్స్ అనుమతులు ఇచ్చే విషయంలో అనుసరించిన విధానాలపై అనేక ఫిర్యాదులు ఉన్నా పట్టించుకున్నా పరిస్థితి లేకుండా పోయింది. కరోనా సమయంలో అత్యవసరంగా భర్తీ చేసిన ఉద్యోగాల విషయంలో కనీసం నోట్‌ఫైల్ కూడా లేకుండా అంతా చేశారంటే అది ఒక్క వైద్యశాఖకు చెల్లుతుంది. ఉన్నతాధికారులు, శాఖలో పనిచేసే కీలక ఉద్యోగులు కుమ్మక్కై పోస్టులను అమ్ముకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అత్యవసర సేవల కోసం అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు నియమించుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇస్తే దానిని ఆదాయ వనరుగా మార్చుకున్న పరిస్థితి.

కాంట్రాక్టు పేరుతో మోసం

కాంట్రాక్టు ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా ఆరు నెలల్లో రెగ్యులర్ కూడా చేస్తామని హామీలు ఇచ్చి ఏజెన్సీల ద్వారా నియమించారు. అయితే ఉద్యోగాలు పొందిన వ్యక్తులు తాము ఏజెన్సీల ద్వారా ఉద్యోగాలు చేస్తున్నామనే విషయాన్ని మర్చిపోయి తమకు జీతాలు రాకపోయినా పదినెలల పాటు ఉచితంగా పనిచేశారంటే వారిని శాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ఎంతలా మభ్యపెట్టారో అర్థం చేసుకోవచ్చు. ఇక 2020లో భర్తీ చేసిన ఉద్యోగ నియామకాల్లో కూడా అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆ పోస్టుల నియామకాలపై ముగ్గురు అధికారులతో కూడిన బృందాన్ని నియమించారు. విచారణాధికారులుగా వారు అంతా పరిశీలించి, ఉద్యోగులను విచారించి భారీగా అక్రమాలు జరిగాయని నిర్ధారించి కలెక్టర్‌కు నివేదిక అందజేసినా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఉద్యోగ నియామకాల వ్యవహారాన్ని పక్కనబెడితే అత్యవసరం అనే పేరుతో ఇష్టారీతిన డిప్యుటేషన్లను వేశారు. అందులోనూ పెద్దఎత్తున అవినీతి, ఆరోపణలు వచ్చినా, ఆ సమయంలో భర్తీచేసిన పోస్టుల్లో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది.

డిప్యుటేషన్లు రద్దు.. అయినా ఇక్కడే..

జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా వచ్చేవారు తమకు అనుకూలమైన ఉద్యోగులను కార్యాలయానికి డిప్యుటేషన్‌పై తెచ్చుకోవడం పరిపాటి మారింది. ఆ తర్వాత వారి ద్వారా ఇష్టారీతిన అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇలా పలువురు ఉన్నతాధికారులపై ఆరోపణలు వచ్చాయి. అయినా అవేమి పట్టించుకొని పరిస్థితి ఏర్పడింది. గతనెలలో పదవీ విరమణ చేసిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల డిప్యుటేషన్లను రద్దుచేశారు. కానీ ఆ కార్యాలయంలో ఇంకా ఇద్దరు, ముగ్గురు పనిచేస్తున్నారంటే అందుకు అండదండలు అందిస్తున్నది ఎవ్వరు అనేది ప్రశ్నార్థకంగా మారింది. వాస్తవంగా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉద్యోగులు తక్కువగా ఉన్నారు. అయితే కార్యాలయంలో పనులు సకాలంలో పూర్తిచేసుకునేందుకు సంబంధిత డీఎంహెచ్‌ఓ ఆ శాఖలో ఇతర ప్రాంతాల్లో పనిచేసే వారిని తెచ్చుకోవడం సాధరణమే. కానీ తాము ఉన్నప్పుడు ఒప్పు.. ఇప్పుడు తప్పు అన్నట్లుగా ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వైద్య శాఖ కార్యాలయానికి పట్టిన అవినీతి జబ్బును నయం చేసేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఒంగోలులో గురువారం ఉదయం కురిసిన వర్షానికి జలమయమైన కర్నూల్ రహదారి

ప్రకాశంలో పలుచోట్ల జల్లులు

ఎండల నుంచి ఉపశమనం
జిల్లా అంతటా చల్లబడిన వాతావరణం
ఒంగోలులో భారీవర్షం
ఇక్కట్లు పడ్డ జనం
ఈసారి సీజన్‌పై రైతుల్లో ఆశలు

ఒంగోలు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు వేసవి తాపం... మరోవైపు సార్వత్రిక ఎన్నికల రాజకీయ వేడితో ఉన్న జిల్లాప్రజలకు ఉపశమనం లభించేలా గురువారం వర్షం కురిసింది. పలుప్రాంతాల్లో జల్లులు పడగా ఒంగోలులో ఏకంగా భారీవర్షమే కురిసింది. గత మూడు నాలుగు రోజులుగా ఎండల తీవ్రత తగ్గి వాతావరణంలో మార్పులు కనిపించాయి. వాతావరణం చల్లబడటంతోపాటు జిల్లాలోని ఏదో ఒక ప్రాంతంలో జల్లులు పడుతూనే ఉన్నాయి. ఈక్రమంలో గురువారం తెల్లవారుజాము నుంచే వాతావరణంలో మార్పు రాగా ఉదయం 9 గంటల ప్రాంతంలో వర్షం పడింది. ఒంగోలు నగరంలో భారీవర్షమే కురిసింది. సుమారు 50.50 మి.మీ. వర్షపాతం ఇక్కడ నమోదైంది. దాదాపు గంటసేపు తెరపి లేకుండా కురిసిన వర్షంతో నగరంలోని ప్రధాన వీధులన్నీ కాలువలు, చెరువులను తలపిస్తూ నీరు పారింది. రోడ్లపైకి మురుగు చేరడంతోపాటు ట్రాఫిక్‌కు ఆటంకం కలిగింది. వీధి వ్యాపారులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. ఇతర ప్రాంతాల్లో చూస్తే మద్రిపూడి మండలంలో 24.50 మి.మీ., కనిగిరిలో 16.50, పామూరులో 12.0 మి.మీ. నమోదు కాగా జరుగుమల్లి, కొండపి, చీమకుర్తి, ఎన్‌జీపాడు, వెలిగండ్ల, సీఎస్‌పురం, గిద్దలూరు ఇలా పలు మండలాల్లో జల్లులు పడ్డాయి. దీంతో వేసవి ఎండల తీవ్రత తగ్గి ప్రజలు తాత్కాలికంగా ఉపశమనం పొందారు. ఒంగోలులో వారం రోజులుగా 37 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా గురువారం భారీవర్షం నేపథ్యంలో ఎండలు తగ్గాయి. గరిష్ఠ ఉష్ణోగ్రత 33.7 డిగ్రీలు నమోదుకాగా జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ గత నాలుగు రోజులుగా నమోదవుతున్న దాని కన్నా నాలుగైదు డిగ్రీలు తగ్గాయి. ఇదిలా ఉండగా ఈ ఏడాది మంచి వర్షాలే కురుస్తాయని, ముందుగానే రుతుపవనాలు వస్తాయన్న సంకేతాలు వాతావరణ శాఖ నుంచి ఇప్పటికే అందాయి. దానికి సంకేతంగా తాజా వర్షాలు ఉన్నట్లు ప్రజానీకం, ప్రత్యేకించి రైతాంగం భావిస్తున్నారు. మరోసారి ఒక మోస్తరు వర్షం కురిస్తే దుక్కులు దున్ని తొలకరి పైర్లు సాగుకు రైతులు సిద్ధమయ్యే అవకాశం ఉంది.



పల్టీలు కొట్టి బోల్తా పడ్డ కారు



భానుశరత్‌శర్మ(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

స్నేహితుడిని కలిసేందుకు హైదరాబాద్ నుంచి ఒంగోలుకు
చక్రాయపాలెం సమీపంలో కారు బోల్తా
దశాబ్దకాలం క్రితం వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో తల్లిదండ్రులు మృతి

అద్దంకి, మే 16 : పుట్టిన రోజుకు తన స్నేహితుడు రాలేదని, ఒంగోలులో ఉన్న స్నేహితుడు వద్దకు వస్తూ రోడ్డు ప్రమాదంలో యువకుడు మహదావం భానుశరత్ శర్మ (28)దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలిలో నివాసముండే భానుశరత్‌శర్మ ఈవెంట్స్ టీమ్‌ను నిర్వహిస్తుంటాడు. భానుభరత్ శర్మ పుట్టిన రోజు వేడుకలు బుధవారం హైదరాబాద్‌లో జరగగా ఒంగోలులో ఉన్న నరేష్ హాజరుకాలేదు. దీంతో నరేష్‌ను కలిసేందుకు బీఎండబ్ల్యూ కారులో ఒంగోలు వస్తుండగా బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో అద్దంకి మండలం చక్రాయపాలెం సమీపంలో మలుపు వద్ద అదుపు తప్పి పల్టీలు కొట్టుకుంటూ కారు పొలంలోకి బోల్తాపడింది. తీవ్రగాయాలైన భానుశరత్‌శర్మను 108లో ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాల కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. ని ద్రమత్తులో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. కారులో ఒక్కడే ప్రయాణిస్తున్నాడు. భానుశరత్‌శర్మ తల్లిదండ్రులు కూడా దశాబ్దకాలం క్రితం వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో మృతి చెందారు. కుటుంబం మొత్తం మృతి చెందడం బంధువులను తీవ్రంగా కలిచివేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నుజ్జు నుజ్జు అయిన కారు

తప్పిన ప్రమాదం

ఎయిర్ బెలూన్‌లు తెరుచుకోవడంతో గాయాలతో బయటపడిన ముగ్గురు

అద్దంకి, మే 16 : కారులో ఎయిర్ బెలూన్‌లు తెరుచుకోవడంతో తీవ్ర ప్రమాదం నుంచి ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నెల్లూరుకు చెందిన పి.మంజుల, నితీష్ హైదరాబాద్ నుంచి కారులో నెల్లూరు వెళ్తుండగా అద్దంకి మండలం చినకొత్తపల్లి క్రాస్ రోడ్డు వద్ద నామ్ రోడ్డుపై గురువారం సాయంత్రం ప్రమాదం జరిగింది. కారు ముందు వెళ్తున్న లారీని అధిగమించబోయి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మంజుల, నితీష్‌తో పాటు కారు డ్రైవర్ సాయి ప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. 108 సిబ్బంది ప్రమాద స్థలం లోనే ప్రాథమిక చికిత్స నిర్వహించారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండడంతో కారు మొత్తం నుజ్జునుజ్జయింది. కారు పూర్తిగా దెబ్బతిన్నా ఎయిర్ బెలూన్‌లు ఓపెన్ కావడంతో కారులో ఉన్న ముగ్గురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు.



క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

వాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

చీరాలటౌన్, మే 16 : ద్విచక్ర వాహనం అదుపుతప్పి సెక్యూరిటీ గార్డుకు తీవ్రగాయాలైన సంఘటన గురువారం గొనసపూడి - ఇంకొల్లు రోడ్డులో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం గొనసపూడికి చెందిన సంతోషరావు ఇంకొల్లులోని ఓ ప్రైవేటు విద్యా సంస్థలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలోనే ఎప్పటిలాగే ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన సంతోషరావు మార్గం మధ్యలో వాహనం అదుపుతప్పి పడ్డాడు. దీంతో తలకు, శరీరంపై తీవ్ర రక్త గాయాలు కావడంతో 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

టీడీపీకి ఓటు వేశాడని కొడవలితో దాడి

వెలిగండ్ల, మే 16: ఎన్నికల తర్వాత వైసీపీనేతల ఆగడాలకు అంతులేకుండా పోతోంది. ఎన్నికలకు ముందు వైసీపీని వీడి టీడీపీలో చేరారనే అక్కసుతో ఆ పార్టీ నాయకులు టీడీపీ కార్యకర్తపై కొడవలిలో దాడి తెగబడ్డారు. ఈ ఘటన మండలంలోని పందువ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం పందువ గ్రామానికి చెందిన జుటికే తిమోతి వైసీపీని వీడి టీడీపీలో చేరాడు. పార్టీలో చురుగ్గా పనిచేస్తూ తమ కుటుంబీకులు, బంధువుల ఓట్లను టీడీపీకి వేయించాడు. దీంతో కోపం పెంచుకున్న వైసీపీకి చెందిన గురవయ్య కాపుకాసి నడిచి వెళుతున్న తిమోతిపై కొడవలితో దాడిచేశాడు. ఇది గమనించిన తిమోతి పక్కకు వరగడంతో చెవి భాగానికి తగిలి తీవ్ర రక్తస్రావం అయ్యింది. దీంతో స్థానికులు కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చెవిభాగంలో నాలుగు కుట్లు పడ్డాయి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెలిగండ్ల పోలీసులు తెలిపారు.

పొగాకు కిలో రూ.303

మరో రూ.3 పెరిగిన గరిష్ఠ ధర
నేడు బోర్డు ఈడీ రాక



టంగుటూరు వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు కొనుగోళ్లు

ఒంగోలు మే 16 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా కిలో రూ.300లపై నిలకడగా ఉన్న పొగాకు ధర గురువారం స్వల్పంగా పెరిగింది. ఒంగోలు-1, ఒంగోలు-2 కేంద్రాల్లో గరిష్ఠ ధర మరో రూ.3 పెరిగి కిలో రూ.303 లభించింది. పొగాకు మార్కెట్‌లో డీలర్లుగా ఉండే కంపెనీల బయ్యర్లు ఆ ధర ఇచ్చారు. పలు ప్రధాన కంపెనీలు కూడా బేళ్ల కోసం పోటీ పడుతూ ధరలు పెంచుతున్నారు. సాధారణంగా ఎక్స్‌పోర్టర్లు, డీలర్లు తేడా లేకుండా అన్ని కంపెనీల బయ్యర్లు ధరలు పెంచి కొంటున్నా కీలక కంపెనీ ఐటీసీ బయ్యర్లు మాత్రం ధరలు పెంచేందుకు ముందుకు రారు. డీలర్లు ఇచ్చే గరిష్ఠ ధరకన్నా కనీసం కిలోకు రూ.20 తగ్గించి వేసే అవకాశం ఉన్న బేళ్లనే కొంటుంటారు. అయితే ప్రస్తుతం మార్కెట్లో ఇంకా మేలురకం బేళ్ల రాక జోరు అందుకోలేదు. దీంతో ఉన్న బేళ్ల కోసం పలు కంపెనీల బయ్యర్లు తీవ్రంగా పోటీపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఐటీసీ బయ్యర్లు కూడా ఇతరులతో పోటీపడి కొనక తప్పడం లేదు. అలా రెండు రోజులుగా ఐటీసీ కూడా గరిష్ఠ ధర కిలో రూ.299 వరకు ఇచ్చింది. దీంతో డీలర్లు మరింత స్పీడ్ పెంచాల్సిరావడంతో గురువారం మార్కెట్‌లో గరిష్ఠ ధర కిలో రూ.303 లభించింది. ఇదిలా ఉండగా పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్ బాబు, సెక్రటరీ దివి వేణుగోపాల్‌లు శుక్రవారం జిల్లాకు వస్తున్నారు. బ్రౌన్ గరిష్ఠంగా కిలో రూ.270 వరకు పలుకుతున్నా అత్యధిక బేళ్లను ఒక్కో రోజు రూ.250కే కొంటున్నారు. లోగ్రేడ్‌ల పరిస్థితి కూడా అలాగే ఎగుడు,దిగుడుగా నడుస్తోంది. ఈ విషయాన్ని రైతు ప్రతినిధులు బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. ఈ తరహా పరిస్థితితో కొన్ని గ్రామాల రైతులు నష్టపోతున్న తీరును రైతు ప్రతినిధులు వారికి వివరించారు. ఈ నేపథ్యంలో ఈడీ, సెక్రటరిలు శుక్రవారం జిల్లాకు వస్తున్నారు. అందిన సమాచారం మేరకు వారు వెల్లంపల్లి, ఒంగోలు-2, టంగుటూరు కేంద్రాల్లో కొనుగోళ్లను పరిశీలిస్తారు. అనంతరం ఇక్కడి బోర్డు ఆర్ఎం కార్యాలయంలో రైతు ప్రతినిధులతో సమీక్ష నిర్వహించనున్నారు.



లోయలో బోల్తా పడిన వాహనం

లోయలో మినీ ట్రక్ బోల్తా

● నల్లమల ఘాట్ రోడ్డులో ప్రమాదం
● 15 మందికి తీవ్రగాయాలు

పెద్ద దోర్నాల, మే 16: వేగం అదుపుతప్పిన మినీ ట్రక్ లోయలో బోల్తా పడి పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం నల్లమల అటవీ ప్రాంతం శ్రీశైలం-దోర్నాల ఘాట్‌రోడ్డులో చిన్నారుట్ల మూలమలుపు వద్ద చోటుచేసుకొంది. కర్నూలు జిల్లా కోడుమూరు మండలం పేలేకుర్తి గ్రామానికి చెందిన 15 మందికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. కోడుమూరు మండలం నుంచి మినీ ట్రక్‌లో 25 మంది శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనార్థం వెళుతున్నారు. చిన్నారుట్ల మూలమలుపు వద్ద వేగం అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొట్టి లోయలోకి దూసుకుపోయింది. చెట్టుకు తాకడంతో బోల్తా పడింది. దీంతో వాహనంలో ప్రయాణిస్తున్న వారిలో 15 మందికి తీవ్రగాయాలయ్యాయి. అదృష్టవశాత్తు లోయలోకి పూర్తిగా పోకుండా చెట్టు నిలువరించింది. దీంతో ప్రాణనష్టం జరగలేదు. వెంటనే 108 అంబులెన్స్ వాహనానికి సమాచారమివ్వడంతో ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను దగ్గరలోని సుండిపెంట వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు.



గాయపడిన వారిని వైద్యశాలకు తరలిస్తున్న 108 సిబ్బంది

వైసీపీకి కొమ్ముకాస్తున్న దర్శి పోలీసులు

టీడీపీ వర్గీయులపై అక్రమ కేసులు

దర్శి, మే 16 : దర్శి నియోజకవర్గంలో పోలీసులు వైసీపీకి కొమ్ముకాస్తున్నారు. బాధితులైన టీడీపీ వర్గీయులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. పోలింగ్ సందర్భంగా పలు చోట్ల వైసీపీ వర్గీయులు టీడీపీ శ్రేణులపై దాడులు చేసి గాయ పరిచినప్పటికి పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దర్శి మండలంలోని బొట్లపాలెంలో ఎన్నికలకు ముందురోజు దర్శి నియోజకవర్గ తెలుగుయువత నేత కల్లూరు సుబ్బుపై వైసీపీ నేతలు బొట్లపాలెంలో దాడి చేశారు. ఈఘటనపై ఫిర్యాదు చేసినప్పటికి పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మరుసటిరోజు పోలింగ్ సందర్భంగా తొలిరోజు దాడి చేసి వ్యక్తులే మళ్లీ టీడీపీ వర్గీయులపై దాడులకు తెగబడ్డారు. ఆ దాడిలో ఇరువురికి తలలు పగలటంతో పాటు పలువురికి గాయాలయ్యాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. అక్కడ జరిగిన ఘాతుకాన్ని సహించ లేక టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి స్థానికులతో కలిసి నిందితులపై చర్యలు తీసుకోవాలని శాంతియుతంగా ధర్నా చేశారు. అప్పటి వరకు దాడులు చేసిన వైసీపీ గూండాల గురించి పట్టించుకోకుండా ధర్నా చేశారన్న నెపంతో అభ్యర్థి గొట్టిపాటిలక్ష్మితో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేశారు. ఇదేమి అన్యాయమని అడిగినా స్పందించలేదు. మరుసటి రోజు పోలీసులు ఇరువర్గాలపై మొక్కుబడిగా కేసులునమోదు చేశారు. బాధితులపై అన్యాయంగా కేసు నమోదు చేయడాన్ని టీడీపీ వర్గీయులు అడిగినప్పటికి పోలీసులు పట్టించుకోలేదు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో టీడీపీ నాయకుడు వీసీరెడ్డిపై వైసీపీ నాకులు దాడి చేసినా వారిపై కేసు నమోదు చేయలేదు. ఈవీఎంలు పగలగొట్టాడన్న నెపంతో వీసీరెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈవీఎం కింద పడగా వాస్తవానికి పగిలి పోలేదు. పోలింగ్ యథాతధంగా నిర్వహించారు. అయినప్పటికీ పోలీసులు తమ ఇష్టాను సారం కేసు పెట్టారు. దర్శి మండలంలోని కురిచేడు రోడ్డులో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలోని పోలింగ్ బూత్ వద్ద వైసీపీ వర్గీయులు గొడవకు దిగారు.టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి పోలింగ్ బూత్‌లోకి వెళ్లే సమయంలో వైసీపీ వారు అడ్డుకుని ఆమెపై రాళ్లతో దాడికి యత్నించారు. అడ్డుకున్న టీడీపీ వర్గీయులపై కేసు పెట్టారు. ఇప్పటి వరకు తొలుత రాళ్ల దాడికి పాల్పడ్డ వైసీపీ వర్గీయులపై ఎలాంటి కేసు నమోదు చేయలేదు. దేవవరంలో ఓట్లువేసి బయట ని ల్చున్న టీడీపీ వర్గానికి చెందిన మహిళను ఉద్దేశపూర్వకంగా దూషించారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఆ ఘటనలో కూడా టీడీపీ వర్గీయులపై కేసు నమోదు చేశారు. మహిళలపై గొడవకు దిగిన వారిని గురించి పట్టించుకోలేదు. వరుసగా వైసీపీ వర్గీయులు దాడులు పాల్పడ్డ విషయం ఇప్పుడు వీడియోల్లో వైరల్ అవుతున్నది.సాక్షాధారాలతో టీడీపీశ్రేణులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవటంలేదు.

ఇక్కడ కాకపోతే మరోచోటికి..

బాధితుల ఫిర్యాదులను పరిశీలించి న్యాయబద్ధంగా చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారు. టీడీ పీ వర్గీయులు ఇదేమి అన్యాయమని ఒక అధికారిని అడుగగా మా ఇష్ట ప్రకారం ముం దుకు పోతాంఅని సమాధానమిచ్చినట్లు తెలిసింది.

డబ్బులు తిరిగివ్వండి..!

● ఓటర్లపై వైసీపీ నేత ఒత్తిడి

మార్కాపురం, మే 16: ఓటుకు నోట్లు ఇస్తే ఓటర్లు తాము చెప్పిందే చేస్తారని భావించారు వైసీపీ నేతలు. తమ అధిష్ఠానం ఆదేశాల మేరకు పోటీలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఇచ్చిన డబ్బును వారి వారి పరిధిలోని ఓటర్లకు పంపిణీ చేశారు. మేము ముందు అనిపించుకోవడానికి ఒకటి, రెండు రోజుల ముందే ఓటర్లకు చేర్చారు. డబ్బులు తీసుకోకుండా వ్యతిరేకిస్తే లేనిపోని కక్షసాధింపులు ఎదుర్కోవలసి వస్తుందని ప్రస్తుతం ఓటర్లు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎవరు డబ్బులిచ్చానా తీసుకొని, తమ మనస్సాక్షి ప్రకారం ఓటు వేస్తున్నారు. అయితే వైసీపీ నేతలకు ఓటర్లపై విశ్వాసం లేకుండా పోయింది. దీంతో డబ్బులు తీసుకొని తమ అభ్యర్థులకు ఓట్లేయలేదని కొంతమంది ఓటర్లను అనుమానిస్తున్నారు. వారిపై బుధవారం రాత్రి నుంచి ఒత్తిడి తీసుకొస్తున్నారు. 'మీరు మాకు ఓటు వేయలేదు. మేము మీకిచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వండి' అంటూ హుకుం జారీ చేస్తున్నారు. నోట్ల రికవరీ కోసం మార్కాపురం అసెంబ్లీ స్థానానికి పోటీ చేసిన అభ్యర్థికి అనుయాయుడిగా ఉన్న ఓ కౌన్సిలర్ రంగంలోకి దిగాడు. అయితే ఈ విషయం వైసీపీ అభ్యర్థి దృష్టికి వెళ్లలేదని కొందరూ..వెళ్లినా ఆయన పట్టించుకోవడం లేదని కొందరు ఆపార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు.

నామ్ రోడ్డులో అసంపూర్తి పనులు పూర్తయ్యేదెప్పుడో..?

- దశాబ్ద కాలంగా వాహనచోదకులకు కష్టాలే
- అద్దంకిలో ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారమేది?



ఒకే రోడ్డులో రెండువైపులా వెళ్తున్న వాహనాలు .. గోపాలపురం వద్ద రెండు వైపులా వాహనాలు ప్రయాణించేలా ఏర్పాటు చేసిన డివైడర్‌లు

అద్దంకి, మే 16 : నామ్ రోడ్డులో పలు చోట్ల అసంపూర్తిగా పనులు ఉన్నాయి. దశాబ్ద కాలంగా అసంపూర్తి పనులు పూర్తి చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2010 సంవత్సరంలో నార్కెట్‌పల్లి నుంచి అద్దంకి మీదుగా మేదరమెట్ల వరకు(నామ్) రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అత్యధికశాతం పనులు 2013 చివరకు పూర్తి కావడంతో 2014 జనవరిలో నల్గొండ జిల్లా మాడుగుల, ప్రస్తుత పల్నాడు జిల్లా తుమ్మలచెరువు, బాపట్ల జిల్లా ఏల్చూరుల వద్ద టోల్ గేట్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర విభన జరిగిన తరువాత నామ్ రోడ్డు 87.640 కి.మీ వరకు తెలంగాణ పరిధిలో, అక్కడ నుంచి 212.500 కి.మీ వరకు ఆంధ్ర పరిధిలోకి చేరింది. 2014 వరకు 190.380 కి.మీ దూరం రోడ్డు నిర్మాణం పూర్తి కాగా, అనంతరం 2021 వరకు 13.425 కి.మీ దూరం అసంపూర్తి పనులు పూర్తి చేశారు. బాపట్ల జిల్లా పరిధిలో అద్దంకి పట్టణంతో పాటు, మండలంలోని గోపాలపురం, చక్రాయపాలెం, సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు వద్ద రోడ్డు నిర్మాణ పనులు సుమారు దశాబ్ద కాలం గా పూర్తి కాలేదు. ఆయా ప్రాంతాలలో భూసేకరణ పూర్తి కాకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులకు అడ్డంకులు తొలగలేదు. పరిహారం కోసం పలు సందర్భాలలో రైతులు, ఆయా గ్రామాల ప్రజలు రోడ్డెక్కారు. అయినా పరిహారం చెల్లించక పోగా, దశాబ్ద కాలంగా పనులు అసంపూర్తిగా ఉన్నా అధికారులు సైతం పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. రాష్ట్ర విభజన జరిగినా, జిల్లాల పునర్విభజన జరిగినా, ప్రభుత్వాలు మారినా అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు మాత్రం పూర్తి చేయడంపై దృష్టి సారించకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్న చోట తరచూ రోడ్డు మరమ్మతులకు గురవుతున్నా మరమ్మతులు మొక్కుబడిగా చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.



గోపాలపురం వద్ద నిర్మాణం చేయకుండా వదిలివేసిన నామ్ రోడ్డు

నిత్యం ట్రాఫిక్ జామ్

ఇక అద్దంకి పట్టణంలో అప్పట్లో అలైన్‌మెంట్ మార్పు చేసి రోడ్డు విస్తరణ పనులు మొక్కుబడిగా చేశారు. భవానీ సెంటర్‌లో ఎలాంటి విస్తరణ పనులు చేపట్టకుండానే గాలికి వదిలేశారు. ఇక బైపాస్ రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలు గాలికి వదిలేశారు. దీంతో అద్దంకి పట్టణంలో నిత్యం ట్రాఫిక్ కష్టాలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా భవానీ సెంటర్‌లో ఐదు రోడ్ల కూడలి కావడంతో అన్ని వైపుల నుంచి వచ్చే వాహనాలతో ట్రాఫిక్ నిలిచిపోతుంది. ట్రాఫిక్ ఐ లాండ్ కూడా లేకపోవడంతో వాహనాలు అడ్డదిడ్డంగా రోడ్డు దాటుతుండడం ట్రాఫిక్ జామ్‌కు ప్రధాన కారణంగా నిలుస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నామ్ రోడ్డులో అసంపూర్తి పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.



కౌలు వేలం నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

ఆలయ భూముల కౌలు వేలం

పెరిగిన ఆదాయం

పంగులూరు, మే 16 : పంగులూరులో ఆలయ భూములకు కౌలు వేలం జరిగింది. శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం దేవదాయ శాఖ అధికారులు నిర్వహించిన కౌలు వేలంలో పలువురు గ్రామ రైతులు పాల్గొన్నారు. శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన 14 ఎకరాల 34 సెంట్ల భూమికి గతంలో రూ.93వేలకు కౌలు చెల్లించగా ఈ ఏడాది లక్షా 19 వేలకు, శ్రీ వాలేశ్వరస్వామి ఆలయానికి చెందిన 25 ఎకరాల విస్తీర్ణానికి గతంలో రూ.2 లక్షల 64 వేల కౌలు చెల్లించిన రైతులు ఈ ఏడాది 4 లక్షల 65 వేలకు, శ్రీ భీమలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన 47 ఎకరాల 28 సెంట్ల విస్తీర్ణానికి గతంలో రూ.6లక్షల70 వేల కౌలు చెల్లించిన రైతులు ఈ ఏడాది రూ.12లక్షల51 వేల కౌలుకు భూములు దక్కించుకున్నారు. శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవో కోటిరెడ్డి, పంగులూరు గ్రూప్‌నకు చెందిన ఈవో ఉప్పలమర్తి శ్రీనివాసరావు, తాళ్లూరు ఆలయ గ్రూప్‌నకు చెందిన ఈవో గుంటుపల్లి వాసుబాబు ఆధ్వర్యంలో జరిగిన కౌలు వేలంలో ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ బాచిన (అబ్బయ్యగారి) వెంకటేశ్వర్లు, పలువురు గ్రామ రైతులు పాల్గొన్నారు. ఈ ఏడాది దేవదాయ భూములు కౌలు వేలంలో 8 లక్షల 8వేల అదనపు ఆదాయం లభించిందని అధికారులు తెలిపారు.

దేవదాయ భూముల కౌలు బహిరంగ వేలం

చెరుకూరు (పర్చూరు), మే 16 : పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలోని శ్రీ త్రివిక్రమ అగస్త్యేశ్వర స్వామివారి దేవస్థాన భూముల కౌలు బహిరంగ వేలం గురువారం డివిజన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు పర్యవేక్షణలో జరిగింది. ఈ ఆలయానికి సంబంధించి మొత్తం 100 ఎకరాల 18 సెంట్లకు బహిరంగ వేలం నిర్వహించారు. అందులో 45.93 సెంట్ల భూమిని మాత్రమే గ్రామస్థులు పాడుకున్నారు. మిగిలిన భూమికి తదుపరి పాట నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. 45 ఎకరాల 93 సెంట్లకు రూ.7,46,300 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.నాగయ్య తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరం



విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

అద్దంకిటౌన్, మే 16 : అద్దంకి శాఖ గ్రంథాలయంలో ఈ నెల 15 నుంచి జూన్ 7వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు చుండూరి సుగుణరావు తెలిపారు. గురువారం గ్రంథాలయంలో నిర్వహించిన విజ్ఞాన శిబిరంలో సాయి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజు అతిథిగా వచ్చి విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో విద్యార్థులకు కథలు చదివించడం, ఆటలు ఆడించడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, మ్యూజిక్, క్యారమ్స్, ఇతర అంశాలను నేర్పిస్తామని సుగుణరావు తెలిపారు. 10 నుంచి 15 సంవత్సరాలలోపు వయస్సు విద్యార్థులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. చేరేవారు గ్రంథాలయంలో సంప్రదించాలని గ్రంథపాలకుడు కోరారు.

బస్సు దగ్ధం ఘటనపై విష ప్రచారం

- సీఎం పత్రికలో తప్పుడు కథనం
- ఖండించిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు

పర్చూరు, మే 16 : ప్రమాదం జరిగి కుటుంబాలు శోకసంద్రంలో ఉంటే సానుభూతి తెలపాల్సిన పరిస్థితుల్లో సంఘటనపై విషప్రచారం చేయడం పత్రికల విలువను దిగజార్చడమేనని జడ్పీటీసీ మాజీ సభ్యుడు, సీనియర్ నాయకుడు కొల్లా సుభాష్ బాబు అన్నారు. పల్నాడు జిల్లా, చిలకలూరిపేట మండలం పసుమర్రు సమీపంలోని ఈపూరువారిపాలెం వద్ద బస్సు దగ్ధమైన సంఘటనపై సీఎం పత్రికలో వచ్చిన దుష్ప్రచార వార్తపై ఆయన స్పందించారు. బాధ్యతతో సొంత ఊరిలో ఓటువేసుకొని తిరుగు ప్రయాణం చేస్తూ దురదృష్టవశాత్తు బస్సు దగ్ధమైన సంఘటనలో సజీవదహనం కావడం బాధాకరమన్నారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబాలకు సానుభూతి ప్రకటించి ఓదార్చాల్సిన పరిస్థితుల్లో ఇలా తప్పుడు రాతలు రాయడం దారుణమన్నారు. నోవా అగ్రిటెక్ ప్రొటెక్ట్‌కు సంబంధించి ఏమైన ప్రమాదకరమైన రసాయనాలు తరలించారా అని అనుమానాలను రేకెత్తించే విధంగా అసత్య వార్తలు రాయడాన్ని ఖండించారు. వ్యవసాయ సీజన్ ముగిసి మూడు నెలలైందని, ఈ సమయంలో వీటిని తీసుకువెళ్లడం ఏమిటనేది వారికే తెలియాలన్నారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు గాలిలో కలసి పోయాయన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పోలూరు వాగు వస్తే తూముల చప్టాపై ప్రమాదమే

20 ఏళ్లుగా ప్రయాణికులకు తప్పని కష్టాలు

యద్దనపూడి, (మార్టూరు) మే 16 : యద్దనపూడి మండలంలో వాగులు వరదలు వచ్చినపుడు పోలూరు వాగుపై ఉన్న తూముల చప్టాపై ప్రయాణం ప్రమాదకరంగా ఉంటుంది. వాస్తవంగా ఆ సమయంలో పోలూరు గ్రామానికి యద్దనపూడి మండలానికి ప్రజల రాకపోకలు నిలిచి పోతాయి. వర్షాకాలంలో చప్టాకు ఎగువ నుంచి ఉధృతంగా వాగునీరు వస్తుంది. దాంతో చప్టాపై నుంచి ప్రజలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. పోలూరు గ్రామం నుంచి రైతులు పొలాలకు వెళ్లడానికి, గ్రామం నుంచి యద్దనపూడి మండలంలోని మిగతా గ్రామాలకు వెళ్లేందుకుగత 20 ఏళ్ల క్రితం ఈ చప్టాను నిర్మించారు. అప్పటి నుంచి గ్రామస్థులకు కొంత ఊరట కలిగినప్పటికీ తూముల చప్టా స్థానంలో భారీగా వంతెన బ్రిడ్జిని నిర్మించాలని గ్రామస్థులు పలుసార్లు అధికారులను కోరడం జరిగింది. ఇప్పటికే చప్టాపై వాగునీటిని దాటుతూ గతంలో గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు వాగులో కొట్టుకుపోయి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు జరిగాయి. ఈ సమయంలో అధికారులు హడావిడి చేయడం, తూముల చప్టా స్థానంలో వంతెన బ్రిడ్జిని నిర్మించాలని ప్రజా ప్రతినిధులు ప్రయత్నాలు చేయడం జరుగుతుంది. 2014లో నాబార్డు నుంచి అధికారులు బ్రిడ్జిని నిర్మించడానికి ప్రతి పాదనలు కూడా చేశారు. కానీ బ్రిడ్జి నిర్మాణం కార్య రూపం దాల్చ లేదు. వర్షాలు భారీగా కురిసినపుడు వాగులలో నీటి ప్రవాహం పెరిగిన సమయంలో పోలీసులు రెవెన్యూ అధికారులు చప్టా వద్ద బందోబస్తు నిర్వహించడంతో తాత్కాలికంగా ప్రమాదం జరగకుండా చర్యలు చేపడుతున్నారు. కాని భవిష్యత్‌లో శాశ్వతంగా వంతెన బ్రిడ్జిని నిర్మించాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు కోరుతున్నారు. అదీగాక ప్రస్తుతం ఉన్న తూముల చప్టా కూడా శిథిల దశకు చేరడంతో వాటి తూములు పూర్తిగా శిథిలమయ్యే దశకు చేరేలోపు కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



పోలూరు వాగుపై ఉన్న తూముల చప్టా



కల్యాణ ప్రతికను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ

స్వామివార్ల కల్యాణ పత్రిక ఆవిష్కరణ

చెరుకూరు(పర్చూరు), మే 16 : పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలోని శ్రీ త్రివిక్రమ అగస్త్యేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవానికి సంబంధించిన కల్యాణ పత్రికను గురువారం ఆలయ ప్రాంగణంలో గ్రామస్థుల సమక్షంలో అర్చక స్వాములు కల్యాణ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణ కార్యదర్శి ఎం.నాగయ్య మాట్లాడుతూ స్వామివార్ల కల్యాణ వేడుకలను ఈనెల 23న నిర్వహించే విధంగా అర్చక స్వాములు నిర్ణయించడం జరిగిందన్నారు. అందుకు సంబంధించి కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. స్వామివార్ల కల్యాణ వేడుకల్లో భాగంగా ఆలయంలో ఈనెల 19 నుంచి 25వరకు పలు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో అర్చక స్వాములు నల్లూరి సీతారామాచార్యులు, కృష్ణమాచార్యులు, కంచిబొట్ల శ్రీనివాసరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఆరాధన మహోత్సవాలు



వీరబ్రహ్మేంద్రస్వామివారు

ఇంకొల్లు, మే 16 : ఇంకొల్లులో కాలజ్ఞానతత్వ మహిమాన్విత శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో భాగంగా గురువారం రాత్రి స్వామివారి జెండా ఊరేగింపు, శుక్రవారం నాగుల చెరువు వద్ద ఉన్న స్వామివారి ఆలయంలో ఆరాధన మహోత్సవంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకుడు మచ్చు నాగేశ్వరరావు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

అద్దంకిటౌన్, మే 16 : అద్దంకిలోని కాకానిపాలెంలోని రేణంగివరం రోడ్డులోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీ రబ్రహ్మేంద్రస్వామి దేవాలయం నందు శుక్రవారం స్వామివారం 331వ ఆ రాధన మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయని దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు చెన్నుపల్లి శ్రీనివాసచారి గురువారం ఒ క ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుండి పూజా కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని భక్తులు అందరు పూజా కార్యక్రమాలల్లో పాల్గొనపాలని కోరారు.

సర్వీసులు సక్రమంగా నడపండి

ఇంకొల్లు, మే 16 : ఇంకొల్లు నుంచి ఒంగోలు నడిపే బస్సు సర్వీసులను ప్రజలకు ఇబ్బందులు లేకుండా సక్రమంగా నడపాలని ఒంగోలు డిపో మేనేజరు ధర్మవరపు శ్రీనివాసులుకు విన్నవించారు. గురువారం జరిగిన డైల్‌యువర్ డీఎం కార్యక్రమంలో ఇంకొల్లు ప్రాంత ప్రయాణికులు డీఎంతో ఫోన్‌లో సమస్యలను విన్నవించారు. ఒంగోలు వయా రాచపూడి మీదగా హైదరాబాద్, తిరుపతి సర్వీసులు నడపాలని, సాయత్రం 6 గంటల తరువాత ఒంగోలు సర్వీసులు సమయపాలన సక్రమంగా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని డీఎం శ్రీనివాసులు హామీ ఇచ్చారు.

కోటేశ్వరరావును పరామర్శించిన గొట్టిపాటి



కోటేశ్వరావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న గొట్టిపాటి

అద్దంకి, మే 16 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కోటేశ్వరరావును ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ గురువారం పరామర్శించారు. అద్దంకి పట్టణంలోని 20వ వార్డుకు చెందిన నంబూరి కోటేశ్వరరావు ఈ నెల 14వ తేదీన రామాంజనేయపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నర్సరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే గొట్టిపాటి గురువారం పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట టీడీపీ నేతలు కరి పరమేష్, కోనేటి అనిల్, గుంజి గోవిందు, ఏసోబు ఉన్నారు.

రుణం.. తీర్చలేని భారం..!

- యాప్ ఉచ్చులో పడి సర్వం పోగొట్టుకున్న బాధితులు
- మరెవ్వరూ బలికావద్దని వేడుకోలు
- నష్టపోతారని పోలీసుల హెచ్చరిక

చీరాల, మే 16 : రుణ యాప్‌ల జోలికి వెళ్లొద్దు. ఆ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకోవద్దు. తీసుకుంటే దారుణంగా నష్టపోతారని బాధితులు, పోలీసులు చెప్తున్నారు. గతంలో ఆ యాప్‌ల ద్వారా రుణాలు పొందినవారు తమ అనుభవాలను చెప్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరెవ్వరూ ఆ యాప్ వలలో చిక్కుకోవద్దని సూచిస్తున్నారు.

రుణ యాప్‌ల నిర్వాహకులు ముందస్తుగా డబ్బు అవసరం ఉన్న పేద, మధ్యతరగతి వారిని, ఉద్యోగాల కోసం వెదుక్కుంటున్నవారిని, రుణం కోసం ప్రయత్నిస్తున్నవారిని గుర్తిస్తారు. వారి సెల్‌ఫోన్లు ఆ యాప్‌ల నిర్వాహకులు తమ యాప్‌ల ద్వారా రుణాలు పొందేందుకు సులువైన మార్గమని నమ్మించే విధంగా పోస్టులు పెడతారు. అవసరంలో ఉన్నవారు రుణం పొందాలనే తొందర్లో వారు చెప్పే అన్ని రకాల నిబంధనలకూ ఒప్పుకుంటారు. ఆ క్రమంలో తమ ఫోన్ కాంటాక్ట్ నెంబరు, ఫొటోలు తదితరాలు వారు ట్రాక్ చేసుకునే విధంగా అంగీకారం కోరతారు. రుణం తీసుకునే ఆత్రుతలో ఇవన్నీ సాధారణమని ఓకే చేస్తారు. వారు ఇచ్చే రుణం, తిరిగి చెల్లించాల్సిన వ్యవధి తక్కువగా ఉంటుంది. వడ్డీ అధికంగా ఉంటుంది. ఉదాహరణకు రూ.10వేలు రుణం ఇస్తుంటే ముందుగానే రూ.2వేలు తగ్గించుకుని రూ.8వేలు మాత్రమే ఇస్తారు. రుణం చెల్లించాల్సిన కాలపరిమిధిలో చెల్లించకుంటే ఇక వారి టార్చర్ మొదలవుతుంది. ఫోన్‌లోని నెంబర్ల ద్వారా తెలిసిన వారు దగ్గర వారి పరువుతీసే విధంగా మాట్లాడతారు. వేరెక్కడైనా రుణం తీసుకుందామన్నా, అది తెలుసుకుని అక్కడ కూడా చెడుగా చెప్తుంటారు. ఈ క్రమంలో తమ యాప్ ద్వారానే మరో లోన్ ఇంకాస్త పెద్దమొత్తంలో ఇచ్చేందుకు అవకాశం ఉందని చెప్తూ, ఆ వైపు ఆకర్షితులయ్యే విధంగా ప్రేరేపిస్తారు. ఆ లోన్ తీసుకుని ముందు తీసుకున్న లోన్ క్లియర్ చేసిన తరువాత మరలా కాలపరిమితి దాటగానే టార్చర్ మొదలవుతుంది. దీంతో కొందరు ఆ టార్చర్‌ను భరించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఎవరు కూడా రుణయాప్‌ల ద్వారా రుణాలు పొందవద్దని బాధితులు చెప్తున్నారు. పోలీస్‌శాఖ పరంగా కూడా హెచ్చరిస్తున్నారు.



కంప్యూటర్ శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

వేసవి శిక్షణను వినియోగించుకోవాలి

చినగంజాం, మే 16 : శాఖ గ్రంథాలయం వారు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్.నరసింహారావు అన్నారు. శాఖ గ్రంథాలయంలో 6 నుంచి 10వ తరగతి వరకు చదవే విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణతరగతులను ప్రారంభించారు. విద్యార్థులకు ఇంగ్లీషు రాయడం, చదవడం, కంప్యూటర్‌పై శిక్షణ ఇస్తున్నట్లు గ్రంథపాలకుడు ఎంఎల్ నరసింహాచార్యులు తెలిపారు. జూన్ 7వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పూర్తి వివరాలకు 8885757594 సెల్ నెంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఉపాధ్యాయులు వై.రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి


పమార్శించిన ఎమ్మెల్యే ఏలూరి



సురేష్ మృతదేహం వద్ద విషన్నవదనంతో ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, మే 16 : మండలంలోని రాజుగారిపాలెం లో తెలుగుదేశం పార్టీ కార్యకర్త, మార్టూరులోని హీరో షోరూం యజమాని శ్రీనివాసరాజుకు సోదరుడైన కళ్లేపల్లి సురేష్ రాజు (40) అనే యువకుడు గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందాడు. అతనికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాత్రి సమయంలో ఇంటిలో అస్వస్థ తకు గురైన సురేష్‌ను కుటుంబ సభ్యులు కారులో మార్టూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతనిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. దాంతో మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకు వచ్చారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రాజుగారిపాలెం వెళ్లి సురేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. రెండు రోజుల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో రాజుగారిపాలెంలో తెలుగుదేశం పార్టీ గెలుపునకు పార్టీ కార్యకర్తగా సురేష్ విశేషంగా కృషి చేశారు. చిన్న వయస్సులో సురేష్ మృతి చెందడం వారి కుటుంబానికి, పార్టీకి తీరని లోటు అన్నారు. సురేష్ రాజుగారిపాలెంలోని టీడీపీ నేత మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతి రాజుకు దగ్గర బంధువు కావడం, అంతేగాకుండా మార్టూరులో హీరో షోరూంలో పని చేస్తూ పలువురు పరిచయాలు ఉండడంతో మండలంలోని టీడీపీ శ్రేణులు షేక్ రజాక్, కామినేని జనార్దన్, తొండెపు ఆదినారాయణలతో పాటు మార్టూరు లోని పలువురు వ్యక్తులు సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి సంతాపం తెలియ చేశారు.

డెంగ్యూ నివారణకు అందరూ సహకరించండి



చీరాల ఏరియా వైద్యశాల వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

చీరాలటౌన్, మే 16 : డెంగ్యూ వ్యాధి నివారణకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చీరాల ఏరియా వైద్యశాల పీపీపీ యూనిట్ వైద్యాధికారి డా.వై.యాకోబు అన్నారు. గురువారం జాతీయ డెంగ్యూ దినం కార్యక్రమాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల వద్ద సిబ్బంది నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ప్రధాన రహదారులలో నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతినిధులు మాట్లాడుతూ పరిసరాల్లో వ్యర్థాల నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్లాస్టిక్ ఇతర నిల్వలతో ప్రమాదం పొంచి ఉన్నట్లు చెప్పారు. దోమల లార్వాను విధిగా తొలగించాలన్నారు. టైర్లు, కొబ్బరి చిప్పలు, మురుగు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. డెంగ్యూ లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో డా.ప్రణయ్ నంద, డా.ప్రణయ్‌కుమార్, పట్టణ మలేరియా అధికారి చింతా శేషబాబు, ఈపూరుపాలెం పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో డా.జ్యోతిర్మయి, సూపర్‌వైజర్‌లు గాలిబ్, మార్త ఎల్‌టీ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చినగంజాం : డ్యెంగూ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చినగంజాం, సంతరావూరు పీహెచ్‌సీల వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు, బి.నాగేంద్ర అన్నారు. డెంగ్యూ దినం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది డ్యెంగూ వ్యాధిపై చినగంజాంలో సంతరావూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సంతరావూరు, కడవకుదురు గ్రామాల్లో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. శుక్రవారం డ్రైడే-డ్రైడే పాటించటం ద్వారా డెంగ్యూవ్యాధిని, వాటికి కారణమైన డెంగ్యూ దోమలను అరికట్టవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో చినగంజాం, పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.సాయిశ్రీ చరణ్, వై.భవాని, పీ.హెచ్ఎన్ బేబి, హెల్త్ సూపర్ వైజర్లు చిరంజీవి, ఉల్దారాణి, ల్యాబ్ టెక్నిషియన్‌లు శ్యామ్ సుందర్‌బాబు, సుధా, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటరమణ, హెచ్‌వీ వరదానం, హెచ్‌వీ మాధవి, హెల్త్ అసిస్టెంట్ విజయప్రసన్న, స్టాఫ్ నర్స్ ఉదయలక్ష్మి, మురళి, మహేష్, పీసుబ్బారావు, కావ్య, సింగయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజ భాగస్వామ్యంతోనే నివారణ

అద్దంకిటౌన్ : సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధిని నివారిద్దాం అని యూపీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ గొట్టిపాటి జయసింహ అన్నారు. గురువారం జాతీయ డెంగ్యూ దినం సందర్భంగా అద్దంకి పట్టణంలోని గాజులపాలెం, కాకానిపాలెం యూపీహెచ్‌సీలో వైద్య సి బ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జయసింహ మాట్లాడుతూ దోమకాటుతో కలిగే ప్రమాదాలపై ప్రతి ఒక్క రూ అవగాహన కలిగి ఉండాలన్నారు.



మేదరమెట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వీ వెంకాయమ్మ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.


నీరు నిల్వ లేకుండా చూడాలి

మేదరమెట్ల : వాడకుండ ఉండే పాత్రలు, కొబ్బరి చిప్పలు, పాత తొట్టెలలో నీరు నిల్వ లేకుండా చేసుకోవడం డెంగ్యూ నివారించుకోవచ్చారు. గురువారం డెంగ్యూ దినం సందర్భంగా మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నిఖిలారెడ్డి, డాక్టర్ మనోజ్ ఆధ్వర్యంలో డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ నికిలారెడ్డి మాట్లాడుతూ ఇళ్లల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కువ రోజులు నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'స్ట్రాంగ్ రూమ్'కు మూడంచెల భద్రత

నెల్లూరు (క్రైం) మే 16 : నెల్లూరు శివార్లలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలకు మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు కె ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ భద్రతా చర్యలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. 24 గంటలపాటు పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు బందోబస్తు విధుల్లో ఉంటాయని తెలిపారు. అంతేగాక సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందిని ఆదేశించారు.





బుచ్చిరెడ్డిపాళెంలో గురువారం ఉదయం కురుస్తున్న వర్షం

● జిల్లాలో అక్కడక్కడా వర్షం ● చల్లబడిన వాతావరణం ● రైతన్నల ఆనందం

కరిమబ్బులు కమ్మిన వేళ..

నెల్లూరు నగరాన్ని కరిమబ్బులు కమ్మేశాయి. భగభగ మండుతున్న భానుడిని మింగేశాయి. ఉక్కపోతతో అల్లాడిన ప్రజానీకంలో ఆహ్లాదం నింపాయి. గురువారం ఉదయం జిల్లాలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బుచ్చిరెడ్డిపాళెం, లింగసముద్రం, ఉదయగిరి, ఏఎస్‌పేట తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై నీరు పారింది. భగ్గుమన్న భానుడి దెబ్బకు తడారిన నేలకు ఈ వర్షం సాంత్వన చేకూరినట్టు అయింది. మరోవైపు రెండోకారుకు సిద్ధం అవుతున్న అన్నదాతలోనూ ఆశలు చిగురింపచేసినట్టు అయింది.

ఇందుకూరుపేట :
పల్లిపాడు రీచ్ వద్ద పెన్నాలో ఇసుక తవ్వకాలతో ఏర్పడ్డ భారీ గుంతలు

జిల్లాలో అన్ని ఇసుక రీచ్‌లను పరిశీలించాం. ఎక్కడా ఇసుక తవ్వకాలు జరగడం లేదు. భారీ యంత్రాలతో తవ్వకాలు జరిపిన ఆనవాళ్లూ కనిపించలేదు.

- ఎన్జీటీకి కలెక్టర్ ఇచ్చిన నివేదిక ఇది

రీచ్‌లు ఉన్న ప్రాంతాల్లో భారీ గుంతలు కనిపిస్తున్నాయి. ఇసుకను తవ్వినట్లు స్పష్టంగా తెలుస్తోంది. యార్డుల్లో భారీ ఇసుక డంప్‌లు కొనసాగుతున్నాయి. నిత్యం విక్రయాలు జరుగుతున్నాయి.

- ఇదీ క్షేత్రస్థాయిలో పరిస్థితి



ఇసుక తవ్వకాలే లేనప్పుడు

ఈ గుంతలు ఎక్కడివి!?

- మరి జిల్లాలో వినియోగిస్తున్న ఇసుకంతా ఎక్కడిది..?
- ఎన్జీటీకి కలెక్టర్ ఇచ్చిన నివేదికపై సర్వత్రా చర్చ
- పెన్నాలో స్పష్టంగా కనిపిస్తున్న భారీ గుంతలు

జిల్లాలో అసలు ఇసుక తవ్వకాలే జరగట్లేదట! అన్ని రీచ్‌లను పరిశీలించగా భారీ యంత్రాలతో ఎక్కడా తవ్వకాలు జరుగుతున్న ఆనవాళ్ల కనిపించలేదట! ఇది ఎవరో చెప్పిన మాట కాదు. సాక్షాత్తూ జిల్లా పాలనాధికారి జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌కు (ఎన్జీటీ) ఇచ్చిన నివేదికలోని సారాంశం. ఫిబ్రవరి 11-14వ తేదీల మధ్యలో రీచ్‌లను పరిశీలించిన కలెక్టర్, ఆ నివేదికను ఎన్జీటీకి అందజేశారు. అప్పటికే ఇసుక తవ్వకాలు అసలు జరగట్లేదని కలెక్టర్ నిర్ధారించారు. కలెక్టర్ నివేదిక ప్రకారం గడిచిన నాలుగు నెలలుగా జిల్లాలో ఇసుక తవ్వకాలు జరగడం లేదు. అయితే ప్రస్తుతం జిల్లాలో వినియోగిస్తున్న ఇసుకంతా ఎక్కడిది? అన్న ప్రశ్నకు కూడా అధికారులే సమాధానం చెప్పాలి. రీచ్‌లు ఉన్న ప్రాంతాల్లో పెన్నా నదిలో పరిశీలిస్తే భారీ గుంతలు కనిపిస్తున్నాయి. ఇవన్నీ ఇటీవల తవ్వకాలతో ఏర్పడ్డ గుంతలని వాటిని చూస్తేనే అర్థమవుతోంది. ఈ గుంతలు ఎవరు పెట్టారు? అన్న ప్రశ్నకు కూడా అధికారులే సమాధానం ఇవ్వాలి. అసలు ఇసుక తవ్వకాలే జరగనప్పుడు ఇంత భారీ గుంతలు ఎలా ఏర్పడ్డాయోనని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అందులోనూ రీచ్‌ల ఒడ్డున దర్జాగా యార్డుల పేరుతో ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. మరి జిల్లాలో రీచ్‌లకు అనుమతులు లేనప్పుడు.. కలెక్టర్ నివేదిక ప్రకారం నాలుగైదు నెలల నుంచి అసలు తవ్వకాలే జరగనప్పుడు.. ఈ యార్డుల్లోకి ఇసుక ఎలా వచ్చిందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఈ యార్డులన్నిటినీ ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఏపీఎండీసీ ఈ యార్డులను ఏర్పాటు చేసింది. అటువంటప్పుడు ఆ యార్డులను ప్రస్తుత కాంట్రాక్టర్ ఎలా వినియోగిస్తున్నారో అర్థం కావడం లేదు. అసలు తవ్వకాలకే అనుమతులు లేనప్పుడు యార్డుల్లో ఇసుకకు అనుమతులు ఎవరిచ్చారన్నది కూడా అనుమానంగా మారింది. ఒకవేళ యార్డులకు అనుమతులు ఉన్నాయనుకున్నా కలెక్టర్ నివేదిక ప్రకారం నాలుగైదు నెలల నుంచి ఈ యార్డుల్లోని ఇసుక నిత్యం విక్రయాలు జరుపుతున్నా ఇంకా కరగడం లేదు. మినగల్లు, పల్లిపాడు రీచ్‌ల వద్ద ఉన్న యార్డుల్లో భారీ డంప్‌లు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. తెల్లకాగితాలపై బిల్లులు ప్రింట్ చేసి విక్రయాలు జరుపుతున్నారు. అసలు ఈ యార్డుల్లో ఎంత నిల్వ ఉంది..? ఎప్పటి నుంచి నిల్వ ఉంది..? ఎంత విక్రయాలు జరిపారు..? అన్న వాటికి అధికారుల వద్ద లెక్కలు లేవు. గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు పల్లిపాడు, మినగల్లు రీచ్‌లను పరిశీలించేందుకు వెళ్లగా అక్కడ ఉన్న కొంతమంది బెదిరింపులకు దిగడం గమనార్హం. ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన యార్డులోకి అసలు మీరెలా వస్తారంటూ అడ్డుకోవడమే కాకుండా జూన్ 4 తర్వాత తేలుస్తాం.. అంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడటం అక్కడ పరిస్థితికి అద్దం పడుతోంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

● ఎడగారు సాగుకు రైతన్నల సన్నద్ధం

● జోరుగా దుక్కులు, నారుమళ్లు

ఎన్నికలు ముగిశాయి..
ఇక సేద్యం పనులు షురూ!

సంగం, మే 16 : మొన్నటిదాకా పల్లెసీమలో ఎన్నికల హడావుడిలో ఉన్న రైతులు ఆ అంకం ముగియడంతో ఇక సాగుకు సన్నద్ధమవుతున్నారు. రబీ సీజన్ ముగియడంతోనే ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. ఈసారి జలాశయాల్లో నీటి లభ్యత లేకపోయినా మోటారు ఆయకట్టులో రైతులు ఎడగారు సాగుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే కొందరు నారుమళ్లు వేయగా, మరికొందరు దుక్కులు సిద్ధం చేస్తూ వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. సంగం, సిద్దీపురం, వెంగారెడ్డిపాళెం, అనసూయనగర్, మక్తాపురం, అన్నారెడ్డిపాళెం, దువ్వూరు గ్రామాల్లో మోటారు రైతులు నారుమళ్లు వేసి దుక్కులు సిద్ధం చేస్తున్నారు. సుమారు 2 వేల ఎకరాల్లో సాగుకు సన్నాహాలు చేస్తున్నారు.

● **ఆశాజనకంగా ధరలు**

గడిచిన సీజన్‌లో ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉండటంతో దిగుబడులు తగ్గినా మంచి గిట్టుబాటు కలిగింది. 850 కేజీల పుట్టి ధాన్యం మొదట్లో రూ.24 వేల వరకు పలికింది. ప్రభుత్వ మద్దతు ధరకంటే ప్రైవేట్ మార్కెట్‌లో ధాన్యం ధర ఎక్కువే ఉంది. ఎకరాకు కనీసం మూడు పుట్ల ధాన్యం ఖర్చులకు పోయినా ఒక పుట్టి మిగలడంతో సుమారు రూ.24 వేల వరకు మిగిలింది. దీంతో ప్రస్తుతం ఎడగారు వరి పంటకు సన్నాహాలు చేస్తున్నారు. తక్కువ కాల వ్యవధిలో పండే ఎన్ఎల్ఆర్ 34449 (నెల్లూరు మసూరి ధాన్యం), ఎంటీయూ 1010 రకం ధాన్యం సాగు చేస్తున్నారు. ఇది తెగుళ్లకు, ఎండకు తట్టుకుంటుంది. అంతేగాక ధాన్యం ధర కూడా ఆశాజనకంగా ఉంటుంది. దుక్కులు దున్ని నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. మరికొంత మంది రైతులు ఇప్పుడు నారుమళ్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. మొన్నటిదాకా ఎన్నికల్లో రాజకీయ పార్టీల తరఫున ప్రచారాల్లో పాల్గొన్న వ్యవసాయ కూలీలు కూడా వ్యవసాయ పనులకు వెళుతున్నారు.



నీటి లభ్యత మేరకే సాగు చేయాలి


ప్రస్తుతం తొమ్మిది గంటలకు బదులు ఏడు గంటలే కరెంటు సరఫరా వస్తోంది. మోటారు కింద ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తే నీటి సరఫరా కష్టమై పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. దీనికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగు చేపట్టాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మోటారు కింద వరి సాగు చేసే రైతులు ఒక మోటారుకు ఎకరా, రెండు ఎకరాలు మాత్రమే సాగు చేయాలి.

- శ్రీహరి, వ్యవసాయాధికారి, సంగం

ఎవరి లెక్కలు వారివే!

● పోలింగ్ సరళిపై ప్రధాన పార్టీల ఆరా ● బూత్‌ల వారీగా నేతల విశ్లేషణ
● ఎన్డీఏ కూటమివైపే అన్ని వర్గాలు ● మెజారిటీలపై అభ్యర్థుల మల్లగుల్లాలు

"గతంకన్నా ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. ఇది మాకు బాగా లాభిస్తుంది. ఫలానా బూత్‌లో ఓట్లు బాగా పడ్డాయి. ఆ వైపు ఉన్నవారంతా మా వారే. ఇక మా గెలుపు నల్లేరుమీద నడకే!" ఇది ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకుల ధీమా. సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ ముగిసి మూడు రోజులు గడుస్తున్నా గెలుపోటములపై అభ్యర్థులు ఎవరికివారుగా లెక్కలు వేసుకుంటున్నారు. ఎగ్జిట్ పోల్స్ అన్నీ ఎన్డీఏ కూటమివైపే ఉన్నా వైసీపీ నాయకులు మాత్రం ఈసారి కూడా అధికారం తమదేనంటున్నారు. జిల్లాలో పోల్ అయిన ఓట్ల వివరాలను బూత్‌ల వారీగా తెప్పించుకుని రాజకీయ విశ్లేషకుల ద్వారా ఆరా తీస్తున్నారు.



నెల్లూరు (జడ్పీ), మే 16 : ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. అలాగే గతంలో కంటే ఈసారి ఓటింగ్ శాతం పెరగడంతో తమకే లాభిస్తుందని ప్రధాన రాజకీయ పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల షెడ్యూలు విడుదలైన నాటినుంచే ఎలాగైనా గెలవాలన్న ఆలోచనతో ప్రధాన పార్టీల అభ్యర్థులు సర్వశక్తులూ ఒడ్డారు. వ్యూహ రచనతోపాటు ధన బలాన్ని ప్రదర్శించి ఎక్కడా వెనుకబడకుండా పోటాపోటీగా ప్రచారాలు చేశారు. అందుకు అనుగుణంగానే ఈ నెల 13వ తేదీన ఓటర్లు సైతం భారీగా తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకొన్నారు. తెల్లవారుజాము వరకు క్యూలైన్లలో వేచి ఉండి మరీ ఓటు వేశారు. ఈ ప్రక్రియ ముగియడంతో అభ్యర్థులంతా ఓటింగ్ సరళి, పోలింగ్ శాతంపై మునిగి తేలుతున్నారు. బూత్‌ల వారీగా ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చి ఉంటాయన్న దానిపై లెక్కలు వేసుకుంటూ గెలుపు, మెజారిటీలపై ధీమా వ్యక్తం చేసుకుంటున్నారు.

● **ఏజెంట్లతో సమాలోచనలు**

పోలింగ్ సరళి ఎలా జరిగింది? ఓటరు మనోగతం ఎలా ఉంది? ఎవరికి ఎక్కువ ఓట్లు పడి ఉంటాయనే విషయాలపై అభ్యర్థులు, పార్టీ ముఖ్య నేతలు బూత్‌ల వారీగా ఏజంట్లతో సమావేశాలు నిర్వహించుకుంటూ ఓటింగ్ సరళిని తెలుసుకుంటున్నారు. బూత్‌ల వారీగా తమకు ఎన్ని ఓట్లు వచ్చి ఉంటాయి? ఏ ప్రాంతం ఓటర్లు తమకు అనుకూలంగా ఉన్నారు? ఏ ఏ బూత్‌లలో ఎంత మెజారిటీ వచ్చే అవకాశం ఉంది తదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. ఓటింగ్ సరళిని బట్టి ప్రతి బూత్‌లోనూ మనకు ఇంత మెజారిటీ ఉంటుందని ఏజెంట్లు లెక్కలు గట్టి అభ్యర్థులకు నివేదికలు ఇస్తున్నారు. అయితే అరకొర బూత్‌లలో తక్కువగా, సమానంగా ఓట్లు పడినా ఎక్కువ బూత్‌ల్లో తమదే ఆధిక్యమంటూ ఏజెంట్లు లెక్కలు అందజేస్తుండటంతో దానిని బట్టి గెలుపుతోపాటు మెజార్టీ ఎంత వస్తుందన్న అంచనాల్లో అభ్యర్థులు ఉంటున్నారు. అలాగే ఎక్కడైనా క్రాస్ ఓటింగ్ జరిగిందా!? ఇచ్చిన డబ్బులకు వ్యతిరేకంగా ఎక్కడైనా ఓట్లు పడ్డాయా!? అనే అంశాలపైనా క్షుణ్ణంగా ఆరా తీస్తున్నారు. అయితే ఒక నియోజకవర్గంలో గెలిచేది ఒకరే అయినప్పటికీ ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు తమదే గెలుపంటూ లెక్కలు వేసుకొని కేడర్‌లో ఉత్సాహం నింపుతున్నారు. దీంతో నేతలు కూడా గెలుపు తమ నేతదేనంటూ ముందుగానే ఆనందాలు వ్యక్తం చేసుకుంటూ భారీగా పందేలు కడుతున్నారు.

● **ఉదయగిరి :** మండలాలు, గ్రామాల వారీగా పోలైన ఓట్లు ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చే అవకాశం ఉందనే దానిపై ఆరాతీస్తూ ప్రధాన పార్టీల నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. ఉదయగిరి నుంచి 15 మంది ఎన్నికల బరిలో ఉండగా ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీల మధ్యనే పోటీ నెలకొంది. అయితే, ప్రభుత్వంపై వ్యతిరేకత, అక్రమాలు, అవినీతి, టీడీపీ మ్యానిఫెస్టో ప్రజలను బాగా ఆకర్షించిందని ఇదే తమకు గెలుపును అందిస్తాయని టీడీపీ నాయకులు ధీమాగా ఉన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయన్న ధీమాలో వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఉన్నారు.

ఆత్మకూరులో ఎవరికివారుగా..

ఆత్మకూరు : నియోజకవర్గంలో హోరాహోరీ పోరు నెలకొనడంతో గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. పోలింగ్ సరళిని బట్టి తమ ప్రయత్నాలు ఎంతవరకు ఫలించాయో సమీకరణలు చేసుకోవడంలో తలమునకలు అవుతున్నారు. ఓటరు అంతుపట్టని విధంగా వ్యవహరించటంతో నాయకులు తమ పార్టీ అభ్యర్థికే మెజారిటీ వస్తుందని లెక్కలు వేస్తూ సంతృప్తి చెందుతున్నారు. వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత, టీడీపీ సూపర్ సిక్స్, ఉమ్మడి మ్యానిఫెస్టో తమకు అనుకూలిస్తాయని టీడీపీ నాయకులు ధీమాగా ఉన్నారు. ఇక వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి సొంత మండలం మర్రిపాడులోనే ఎదురు గాలి వీయడం, వైసీపీకి కంచుకోటగా ఉన్న అనంతసాగరం మండలంలో ఆధిక్యతకు గండి పడే అవకాశాలు ఉండటం, అనూహ్యంగా టీడీపీకి సానుకూల పవనాలు వీచాయని టీడీపీ నేతలు అంచనాలు వేస్తున్నారు. వైసీపీ నేతలు సైతం గెలుపు తమదేననే ధీమాను వ్యక్తపరుస్తూ లెక్కలు కట్టే పనిలో పడ్డారు. ఓటింగ్ సరళిని బట్టి తాము విజయం సాధించి తీరుతామని వారు విశ్లేషిస్తున్నారు.

ఎవరికి వారుగా అంచనాలు

కందుకూరు : విజయావకాశాలపై ఎడతెగకుండా కూడికలు.. తీసివేతలలో నేతలు తల మునకలై ఉన్నారు. తొలిరోజు ఒక అంచనాతో లెక్కలు వేసుకున్న నేతలు మరుసటిరోజుకి క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి అంచనాలు మార్చి లెక్కలు వేయటం మూడవరోజు మరికొన్ని మార్పులు చేర్పులతో అంచనాలు రూపొందించడంతో రోజుకొక అంచనా బయటకు వస్తోంది. భారీ మెజారిటీతో విజయం సాధిస్తామన్న ధీమా అభ్యర్థుల్లోను లేదనేది సుస్పష్టమైనా ఒకటి ఒకటిన్నర శాతం ఓట్లు ఆధిక్యతతో గెలుపు ఖాయమని ఎవరికి వారే ఢంకా బజాయిస్తూ విశ్లేషణలు బయటకు తెస్తున్నారు.

త్రిముఖపోరులో ఎవరిదో విజయం

కావలి : కావలిలో జరిగిన త్రిముఖపోరులో విజయం ఎవరిని వరిస్తుందోనని అందరిలో ఉత్కంఠ నెలకొంది. ఎన్డీఏ కూటమి తరఫున కావ్యకృష్ణారెడ్డి, వైసీపీ తరఫున ప్రతాప్‌కుమార్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా పసుపులేటి సుధాకర్‌ల మధ్యే పోటీ నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి అవినీతి, అరాచకాలతో ఆయనపై ఉన్న వ్యతిరేకత టీడీపీకి అనుకూలంగా ఉందని ఆ పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. అలాగే కావలిలో కమ్మ, బలిజ, వైశ్య సామాజిక వర్గాలు పూర్తిగా టీడీపీ వైపు ఉన్నాయంటున్నారు. అంతేగాక వ్యాపార వర్గాలు, రైతులు, యువత, నిరుద్యోగులు కూడా తమవైపే నిలిచి ఓట్లు వేశారని టీడీపీ నాయకులు ఆశగా ఉన్నారు. ఇక కావలి నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే విస్మరించడం కూడా వైసీపీ ఓటు బ్యాంకుకు నష్టం కలిగిస్తుందని అంటున్నారు. ఏదిఏమైనా ఈసారి తమ గెలుపు నల్లేరుమీద నడకేనంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక వైసీపీ నాయకులు సంక్షేమ పథకాలపైనే ఆశలు పెట్టుకుని ఉన్నారు. మరోవైపు ఓటింగ్ శాతం పెరిగినందున మహిళలు ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారని ఇది తమకు లాభిస్తుందని అంటున్నారు. మరోవైపు బీసీలు అధికంగా ఉన్న కావలి నియోజకవర్గంలో బీసీ అభ్యర్థినైన తనను ఆదరిస్తారని స్వతంత్ర అభ్యర్థి సుధాకర్ కూడా ధీమాగా ఉన్నారు. మొత్తానికి ఈ త్రిముఖ పోరులో విజయం ఎవరిదో వచ్చే నాల్గవ తేదీన తేలిపోనుంది.

డెంగ్యూ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



ఉదయగిరి రూరల్: బీసీజీ టీకా వేస్తున్న వైద్యాధికారిణి శివకల్పన



సంగం: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉదయగిరి రూరల్, మే 16: మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యఆరోగ్య సిబ్బంది జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి మెయిన్‌బజార్ వరకు ర్యాలీ చేపట్టారు. దోమలు ఉత్పత్తి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకో వాలన్నారు. కీటక జనిత వ్యాధుల నుంచి రక్షణ పొందాలని కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని సచివాలయం-3లో జరుగుతున్న అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను మండల వైద్యాధికారిణి శివకల్పన పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో వెంకటసుబ్బయ్య, సీహెచ్‌వో శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సంగం: స్థానిక వైద్యశాల ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో దోమలు నివారించండి డెంగ్యూను అరికట్టండి అంటు నినాదాలు చేశారు. డెంగ్యూ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అశోక్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామపురం: సీతారామపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేషనల్ డెంగ్యూడే సందర్భంగా గురువారం డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వప్న మాట్లాడుతూ డెంగ్యూ ఏడీస్ దోమ ద్వారా ఈ వైరస్ వ్యాప్తి చెందుతుందన్నారు. ఇళ్లలో నీరు నిలువలేకుండా చూసుకోవాలని, అంతేకాకుండా టెంకాయ చిప్పలు, ఖాళీ సీసాలు, పాత టైర్లు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్లలో ఫ్రైడేని డ్రై డేగా పాటించి దోమలు ఉత్పతి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో అబ్దుల్ మజీద్, ఎంపీహెచ్‌ఎస్ రియాజ్, ఏఎన్‌ఎంలు పీహెచ్ ఎన్ కృష్ణమ్మ, తిరుపాలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఉదయగిరి రూరల్, మే 16: మండలంలోని శకునాల పల్లిలో శ్రీ సీతారాముల ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివార్లను అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణతంతును నిర్వహించారు. కల్యాణోత్సవంలో గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు పలు సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కందుకూరు, మే 16: పట్టణంలోని ఉప్పు చెరువు ఫీడర్ పరిధిలో విద్యుత్ మెయిన్ లైనుకు తగులుతున్న చెట్ల కొమ్మలు తొలగించటం కోసం శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని జనార్ధనకాలనీ, దుర్గమ్మ గుడి ఏరియా, మగ్గాల మిల్లుల ఏరియా, ఉప్పుచెరువు, ఏవలవ్వనగర్, బృందావనం, మాయాబజార్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

బీసీజీ వ్యాక్సినేషన్ ప్రారంభం



వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారిణి, ఎంపీడీవో

కలిగిరి, మే 16: జాతీయ క్షయ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో ప్రతి గురువారం బిసిజి వ్యాక్సినేషన్ డే నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 60 ఏళ్ళు పైబడిన వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, పొగ తాగడం అలవాటు ఉన్నవారితోపాటు గత ఐదు సంవత్సరములుగా టీబీ వ్యాధితో బాధపడుతున్నవారికి వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని, మండలవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు, పంచాయతీ కార్యదర్శులు చెంచుకృష్ణయ్య, అశోక్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంతో రోడ్లు జలమయం



బస్టాండ్ సెంటర్‌లోని ప్రధాన రహదారిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

లింగసముద్రం, మే 16 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో గురువారం ఉదయం లింగసముద్రం గ్రామంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. సుమారు గంట సేపు కురిసిన వర్షానికి గ్రామంలోని ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారులు జలమయం అయ్యాయి. అంతేగాక మురుగు కాలువలు పొంగి రోడ్డుపైకి ప్రవహించాయి.

ఎన్నికల్లో గెలుపు, ఓటమిపై సర్వత్రా చర్చ

అనంతసాగరం, మే 16: సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు, ఓటములపై బస్టాండ్ సెంటర్లలో ఏ నలుగురు గుమికూడిన ఇదే చర్చ జరుగుతోంది. ఆత్మకూరు నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల పోటీ సమానంగా ఉండడంతో జిల్లా మొత్తం ఈ నియోజకవర్గం వైపే ఆసక్తి చూపుతున్నారు. అన్ని మండలాల్లో ఏబూత్‌లో ఎన్ని ఓట్లు ఉన్నాయి.. అందులో వైసీపీకి, టీడీపీకి ఎన్ని వస్తాయి? ఎంత మెజారిటీ వస్తుంది? అనే లెక్కలను గణాంకాలతో సహా చర్చించుకుంటున్నారు. వచ్చే నెల 4న ఫలితాలు వెల్లడి కానుండడంతో అప్పటి వరకు ప్రధాన పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. తమ అభ్యర్థే గెలుస్తాడని రెండు పార్టీలకు చెందిన మండల, గ్రామస్థాయి నేతలు ధీమా వ్యక్తం చేస్తూ పార్టీ శ్రేణులకు ఉత్సాహం నింపుతున్నారు. అంతేకాకుండా గెలుపు, ఓటములపై చర్చికుంటూనే బెట్టింగు వైపు పలువురు మొగ్గుచూపుతున్నారు.

సీతారామపురం : ఎన్నికలు ముగిశాయి.. ఇప్పుడు అందరూ గెలుపు, ఓటముల పై ఆసక్తితో ఉన్నారు. ఏ టీ షాప్ దగ్గర చూసినా, ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ సాగుతోంది. అంతేకాకుండా విజయం మనదే అంటూ ఏ పార్టీకి ఆ పార్టీ వారు అభినందనలు తెలుపుకుంటున్నారు. కొన్నిచోట్ల అయితే బెట్టింగ్‌ల హడావుడి కూడా జోరందుకుంది. ఎమ్మెల్యేగా పోటీ చేసిన అభ్యర్థులు మాత్రం ఎన్నికలు ముగిసిన రోజు నుంచే తమ ఇళ్లకు గేట్లు వేసుకుని విశ్రాంతి దినాలుగా ప్రకటించుకున్నారు. కానీ పలువురు మాత్రం ఎక్కడ కలిసినా ఏ ఎమ్మెల్యే గెలుస్తాడు, రాష్ట్రంలో ఏ ప్రభుత్వం రాబోతుంది అనే సంభాషణలు జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ స్థానాలకు, ఎంపీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఎంపీ స్థానాలు గురించి కొన్ని చోట్ల మాత్రమే చర్చ జరుగుతోంది. కానీ అసెంబ్లీ అభ్యర్థుల గెలుపోటముల గురించి మాత్రం ఎక్కువగా చర్చ నడుస్తోంది. దీంతో బెట్టింగ్‌లు కూడా భారీగానే సాగుతున్నాయి. విజయంపై మాత్రం ఏ పార్టీకి ఆ పార్టీ వారు ధీమాతో ఉన్నారు. ముఖ్యంగా ఉదయగిరి నియోజకవర్గంపై, నెల్లూరు ఎంపీ స్థానంపై గెలుపు ఎవరిది అనేది ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

పశువుల బీమా అందక పాడిరైతుల అవస్థలు

● పట్టించుకోని పాలకులు, అధికారులు



కొండాపురం, మే 16: పశువుల బీమా చెల్లించినా పాడి గేదెలు, ఆవులు అకాల మర ణాలు సంభ వించినప్పుడు పరిహారం అందడం లేదని మండలంలోని పలు గ్రామాల రైతులు వాపోతున్నారు. మండల పరిధిలోని 70 శాతం కుటుంబాలు కేవలం పశుపోషణపైనే ఆధా రపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా గేదెలు, ఆవులను మేపుకొని వాటి పాలను అమ్ముకొని త ద్వారా వచ్చే నగదుతో కుటుంబపోషణ జరుపుకుంటున్నారు. పాడి గేదెలు వివిధ కారణాలతో మరణించినప్పుడు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో పశువైద్యాధికారుల సూచనలతో గేదెలు, ఆవులకు పశువుల బీమా ప్రీమియం చెల్లిస్తున్నారు. అయినా బీమా నగదు అందడం లేదని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, పాలకులు వెంటనే స్పందించి తమకు పరిహారాన్ని వెంటనే విడుదలచేసి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

160 గేదెలకు క్లెయిమ్‌లు పంపించాం : పశువైద్యాధికారి

మండల పరిధిలో మరణించిన దాదాపు 160 గేదెలకు క్లెయిమ్ కోసం పంపించగా అందులో దాదాపు 60 గేదెలకు సంబంధించిన రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ అయ్యింది. ఎన్నికల కోడ్ కారణంగా పథకం హోల్డ్‌లో ఉంది. మిగిలిన రైతులకు నగదు జమ అవుతుందని పశువైద్యాధికారి ఎమ్ మధు తెలిపారు.

క్రీడలకు ప్రోత్సాహం కరువు



చెట్ల కింద ఆడుకుంటున్న విద్యార్థులు

ఆత్మకూరు, మే 16 : నియోజకవర్గంలో క్రీడలకు ప్రోత్సాహం కరువైంది. క్రీడలను ప్రోత్సహించాలని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చెప్పడమే కాని ఆచరణలో మాత్రం నిర్లక్ష్యం చూపుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం క్రీడలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. మెట్ట ప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం ఏర్పాటు చేయలేదు. దానికి తోడు మినీస్టేడియం నిర్మాణం ప్రకటనలకే పరిమితమైంది. వేసవి సెలవుల్లో ఆడుకునేందుకు చిన్నారులకు ఆటస్థలాలు కరువయ్యాయి. దాంతో యువత చెట్ల కింద, ఖాళీ ప్రదేశాల్లో ఆడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆటస్థలాలను శుభ్రం చేసి క్రీడలను ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

సంగం, మే 16: మండలంలోని కోలగట్ల వద్ద పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు పట్టుకున్నారు. అక్రమ ఇసుక తరలింపుపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ నాగార్జునరెడ్డి తన సిబ్బందితో వెళ్లి పెరమన వద్ద ఇసుక ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

శుభ్రతకు నోచుకోని ఓవర్‌హెడ్ ట్యాంకులు

● గ్రామాలకు అందని రక్షితనీరు ● పొంచి ఉన్న రోగాలు

ఆత్మకూరు, మే 16 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు రాజకీయ పనుల్లో నిమగ్నమై ప్రజల సమస్యలను పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం ప్రజలకు శుభ్రమైన తాగునీటి సరఫరాపై దృష్టి సారించలేదు. ఇటీవల ఓ మోస్తారుగా వర్షాలు కురుస్తుండడంతో తాగునీరు కలుషితమై అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 130 పంచాయతీల్లో మూడు సీపీడబ్ల్యూఎస్, 187 పీడబ్ల్యూఎస్, 91 ఎంపీడబ్ల్యూఎస్, 215 డీపీలకు పైబడి ఉన్నాయి. పీడబ్ల్యూఎస్ పథకాలకు సంబంధించిన నిర్వహణను గ్రామ పంచాయతీలకు, సీపీడబ్ల్యూఎస్ పథకాల నిర్వహణను ఆర్థిక సంఘం నిధులతో ట్యాంకుల నిర్వహణ చేపడుతున్నారు. నిధుల కొరత వెంటాడుతుండంతో ట్యాంకులు శుభ్రతకు నోచుకోవడం లేదు. నెలలో రెండు సార్లు ట్యాంకులు శుభ్రం చేయాల్సి ఉంది. మైనర్ పంచాయతీల్లో ఒక్కొక్క ట్యాంకులో ఒక్కసారి శుభ్రం చేసేందుకు రూ.350ల నుంచి రూ.400లు, మేజర్ పంచాయతీల్లో రూ.550 నుంచి రూ.600ల వరకు ఖర్చు అవుతుంది. అయితే నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, చేజర్ల, సంగం, మర్రిపాడు మండలాల్లోని వాటర్ ట్యాంకులు శుభ్రతకు నోచు కోవడంలేదు. దాంతో తాగు నీటిలో నీరు కలుషితమై సర ఫరా అవుతోంది. ఇకనైనా సం బంధిత అధికారులు, ప్రజా ప్రతి నిధులు స్పందించి వాటర్ ట్యాంకుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



శుభ్రతకు నోచుకోని వాటర్‌ట్యాంకు

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

20న ఉచిత ఒడుగుల కార్యక్రమం

ఉదయగిరి రూరల్, మే 16: పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల ఆవరణలో రహమతులిల్ ఆలమీన్ ట్రస్టు చిన్న మసీదు ఆధ్వర్యంలో ఈనెల 20న ముస్లిం చిన్నారులకు ఉచిత ఒడుగుల(ఖత్నా) కార్యక్రమం చేపడుతున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవలు మెరుగుపర్చాలి : సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐనాయకులు మాలకొండయ్య, సురేష్‌బాబు

కందుకూరు, మే 16: కందుకూరు ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవలు మెరుగుపర్చాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి మాలకొండయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు మాటాడుతూ కోట్ల రూపాయలు వెచ్చించి భవ నాలు నిర్మిస్తున్నారేకానీ కనీస వైద్యసేవలు అందించటంపై దృష్టిపెట్టడం లేదని, బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని హాస్పటల్‌కు తీసుకొస్తే మావద్ద వెంటిలేటర్ సదుపాయం లేదని ఆ యువకునికి ప్రథమ చికిత్స చేయటానికి కూడా నిరాకరించిన వైద్యసిబ్బంది మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు హాస్పటల్‌కు తీసుకెళ్లాలని ఉచిత సలహా ఇవ్వటం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కరోనా సమయంలో వెంటిలేటర్ల సదుపాయంతో పాటు 24 గంటలు ఆక్సీ జన్ అందించే సౌకర్యాన్ని కూడా కందు కూరు ఏరియా హాస్పటల్‌లో ఏర్పాటు చేయటం జరిగిందని గొప్పలు చెప్పిన డాక్టర్లు కనీస వైద్య సేవలు అందించకుండా రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతుండ టమే గాక ప్రైవేటు హాస్పటల్స్ వ్యాపారాభివృద్ధికి తోడ్పాటునందిస్తు న్నారని వారు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టి కందుకూరు ఏరియా హాస్పటల్‌లో సౌకర్యాలు, వైద్యసేవలు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

కావలిలో పడకేసిన పారిశుధ్యం

● పందుల స్వైర విహారం



ట్రంకురోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

కావలిటౌన్, మే 16: కావలి పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దుర్గంధంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నిత్యం రద్దీగా వుండే తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ట్రంకురోడ్డు తూర్పు వైపు చెత్త పేరుకుపోయి అందులో పందులు పొర్లాడుతున్నాయని, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో పారిశుధ్యం మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె



రైల్వే రోడ్డు పక్కకు ఒరిగి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

కావలి, మే 16: కావలి పట్టణ రైల్వేరోడ్డులో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ప్రమాదకరంగా ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఒకపక్క పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ గెస్టెహౌస్, మరో పక్క జామియా మసీద్‌కు వెళ్లే దారిలో ఉన్న ఈ దిమ్మె రోజురోజుకు రోడ్డు వైపునకు ఒరుగుతోంది. వర్షాలు పడితే దిమ్మె పూర్తిగా నేలకొరిగే ప్రమాదం ఉంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి దిమ్మెను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కోతకు గురైన ఉదయగిరి-బండగానిపల్లి రోడ్డు



కోతకు గురైన ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు

ఉదయగిరి రూరల్, మే 16: ఇటీవల కురిసిన వర్షాలకు ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు కోతకు గురి కావడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఘాట్‌రోడ్డు పలు ప్రాంతాల్లో కోతకు గురై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు రాకపోకల సమయంలో ప్రమాదాలకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు కోతకు గురైన ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డుపైనే మురుగు

● ప్రజల అవస్థలు



పట్టణంలోని యూనియన్‌రోడ్డుపై ఉన్న మురుగు

ఉదయగిరి, మే 16: పట్టణంలోని పలు వీధుల్లో రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తోంది. అంతేకాకుండా మురుగు నీరు నిల్వ ఉండడంతో అటుగా వెళ్లే ప్రజలు రోడ్డుదాటాలంటే ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాలాజీనగర్, సినిమాహాలు, సుద్ధబావివీధి, గండిపాళెంరోడ్డు, అగ్రహారం తదితర ప్రాంతాల్లో మురుగు నీరు ప్రవహిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీరు నిల్వలేకుండా చూడాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

ఆర్బీకే, సచివాలయాల

నిర్మాణం ఎప్పటికి పూర్తిచేస్తారు ?



మండల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

గుడ్లూరు, మే 16: మండల కేంద్రమైన గుడ్లూరు సచివాలయం, రైతుభరోసా కేంద్రాలు ఎప్పటికి పూర్తిచేస్తారో తెల్పి చెప్పాలని గుడ్లూరు గ్రామ సర్పంచ్ పాలకీర్తి శంకర్ అధికారులను నిలదీశారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పులి రమేష్ అధ్యక్షతన సాధారణ మండల సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో మండలంలో నెలకొన్న పలు సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. గుడ్లూరు సర్పంచ్ శంకర్ మాట్లాడుతూ గుడ్లూరు ఎస్సీకాలనీ, ఎస్టీకాలనీలతోపాటు పలుప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ అధికారులను కోరారు. పాజర్ల సర్పంచ్ పాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గుడ్లూరు - తెట్టు రోడ్డును కలుపుతూ పొట్లూరు నుంచి పాజర్ల గ్రామంలోకి వెళ్లే రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, పాజర్ల ఎస్టీ కాలనీలో ఇళ్లమీదుగా ఉన్న విద్యుత్ వైర్లు తొలగించాలని కోరారు. కర్లపాలెం సర్పంచ్ చాలపల రమణయ్య మాట్లాడుతూ రాళ్లపాడు రక్షిత మంచినీటి పథకం ద్వారా తీరప్రాంత గ్రామాలకు సక్రమంగా నీరు అందేలా చూడాలని కోరారు. ఎంఈవో గోవర్ధన్ మాట్లాడుతూ గుడ్లూరు కేంద్రం హైస్కూల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఇంటర్ కళాశాలను జూన్ 1 నుంచి ప్రారంభించనున్నట్లు అందుకు సంబంధిచి అడ్మిషన్‌లు కూడా త్వరలో తీసుకోవడం జరుగుతుందన్నారు. అడవిరాజుపాలెంలో మంచినీటి పైపులైన్లకు మరమ్మతులు చేయించాలని ఎంపీపీ పులి రమేష్ అధికారులను కోరారు. అలాగే పూరేటిపల్లి రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ కాకర్ల వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ జేఈ హనుమంతరావు, ఏపీఎం అశోక్, ఎంపీటీసీ సభ్యురాలు చెన్నారెడ్డి వరమ్మ, సర్పంచ్ ఎండ్లూరి డేవిడ్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువులకు రాళ్లపాడు నీరు అందించండి

● అధికారులకు రైతుల వినతి



చిల్లచెట్లతో నిండిన లింగసముద్రం కొత్త చెరువు

లింగసముద్రం, మే 16: స్థానిక కొత్త, పాత చెరువులకు రాళ్లపాడు నీరు అందించాలని పలు గ్రామాల రైతులు అధికారులను కోరుతున్నారు. గత ఐదారు సంవత్సరాల నుంచి తీవ్ర వర్షాభావంతో ఈ చెరువులకు నీరు చేరలేదు. దీంతో రైతులు పంటలు సాగు చేయలేదు. పంటలు సాగు లేకపోవడంతో అటు రైతులు, ఇటు రైతు కూలీలతో పాటు పశువులు కూడా గ్రాసం, తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ కరువు పరిస్థితులను అధిగమించేందుకు ఈ రెండు చెరువులకు రాళ్లపాడు ప్రాజెక్టులోని నీటిని తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని, దీని కోసం ప్రభుత్వం ప్రాజెక్టు దక్షిణం వైపు నుండి ఒక కాలువను కొత్త, పాత చెరువుల ఎగువ భాగం వరకు తవ్వి లిఫ్ట్ ద్వారా నీటిని రెండు చెరువులకు తరలిస్తే సాగునీటి సమస్య తీరి పంటలు సాగు చేసుకోవచ్చని, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకొని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రోడ్లపైనే వాహనాలు, తోపుడుబండ్లు



రోడ్డుకు అడ్డంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, తోపుడుబండ్లు

ఉదయగిరి రూరల్, మే 16: నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్య నిత్యం వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రధాన మార్గాల్లో తరచూ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు, ఇతరత్రా వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీకావు. దశాబ్దాలుగా ఈ సమస్య ఉన్నా రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడంతో చుట్టుపక్కల గ్రామా ల ప్రజలు నిత్యం ఇక్కట్లకు గురవుతున్నారు. ఒకవైపు నుంచి బస్సు వస్తే రెండోవైపు బస్సు వెళ్లే పరిస్థితి లేదు. వాహనం నిలిచిన వెంటనే పదుల సంఖ్యలో ఇతరత్రా వాహనాలు నిలబడిపోవాల్సిన పరిస్థితి. రోడ్లపైనే ద్విచక్రవాహనాలు, ప్రధానంగా గండిపాళెం మార్గం, మెయిన్‌బజార్, పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో కూరగాయలు, పండ్లు అమ్మే తోపుడుబండ్లు, పండ్లు విక్రయించే వాహనాలు రోడ్డు మార్జిన్‌లో ఉంచి వ్యాపారాలు సాగిస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీనికితోడు ద్విచక్ర వాహనదారులు అడ్డంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితి. ఆటోవాలాలు సైతం ప్రయాణికులను ఎక్కించుకునేందుకు రోడ్డుపైనే వాహనాలను నిలిపివేయడంతో వాహన రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో పట్టణంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది.

రోడ్ల విస్తరణ లేక ఇక్కట్లు: పట్టణంలో పంచాయతీ బస్టాండ్ సెంటర్, మెయిన్‌బజార్, గండిపాళెం మార్గాల్లో రోడ్ల విస్తరణ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఎదురువుతుందని ప్రజలు వాపోతున్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్ల వెడల్పు తక్కువగా ఉండడం, వాహనాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుండడంతో ట్రాఫిక్ ప్రధాన సమస్యగా మారింది. ఇప్పటికైనా అధికారులు పట్టణంలో రోడ్ల విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్యను తీర్చాలని పలువురు కోరుతున్నారు.